ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల
ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ
పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో
ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
తాడేపల్లిగూడెం fb.com/vaartha
Published from Tadepalligudem, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Srikakulam
21-2-2025 శుక్రవారం సంపుటి: 31 సంచిక: 20 పేజీలు: 10+4 వెల: 6.50


మహారాష్ట్ర మంత్రికి రెండేళ్ల జైలు

శ్రీలంకలో రైలు ఢీకొని ఆరు ఏనుగులు మృతి

5లో

# మిర్చి రైతులను ఆదుకుంటాం



గురువారం న్యూఢిల్లీలో కేంద్రమంత్రి శివరాజ్‌చౌహాన్‌తో వర్చువల్‌గా మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు

## కేంద్ర మంత్రితో సాయం కోసం మాట్లాడా..

## అంతర్జాతీయంగా డిమాండ్ తగ్గడంవల్లే ధరల పతనం

## పోలవరం నీరు బనకచర్లదాకా తీసుకెళ్లేందుకు కేంద్ర సాయం అడిగా..

## ఢిల్లీలో మీడియాతో సిఎం చంద్రబాబు

**విజయవాడ,ఫిబ్రవరి 20,ప్రభాతవార్త ప్రతినిధి:** మిర్చి రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. వారిని ఆదుకుంటామని సిఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేసారు. మిర్చి ధర పతనంపై కేంద్రంతో మాట్లాడామన్నారు. ఎప్పుడూ లేని విధంగా ఈ సారి రేట్లు పడిపోయాయి. గతంలో అంతర్జాతీయ మార్కెట్ బాగుండటంతో రైతులకు మంచి ధరవచ్చిందన్నారు. ప్రస్తుతం అంతర్జాతీయంగా డిమాండ్ తగ్గడంతో ధరలు పడిపోయాయి. మిర్చి రైతుల సమస్యలను కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ దృష్టికి తీసుకెళ్లామన్నారు.. కేంద్రమంత్రి పర్యటనలో ఉన్నందున వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతుల సమస్యలను వివరించామన్నారు. శుక్రవారం అధికారులతో కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ మిర్చి ధరల అంశంపై సమీక్షిస్తారు. అని సిఎం చంద్రబాబు నాయుడు అన్నారు. రైతులను ఆదుకోవాలని కేంద్రాన్ని కోరామన్నారు.ఈ యేడాది 12 లక్షల మెట్రిక్ టన్నులు మిర్చి సేకరించాల్సి ఉంది...ఇప్పటికే 4 లక్షల మెట్రిక్ టన్నుల మిర్చి మార్కెట్‌కు వచ్చింది. దాదాపు 5 లక్షల ఎకరాల్లో ఈ యేడాది రాష్ట్రంలో మిర్చి సాగైంది. ఎప్పుడూ లేనంతగా రేట్లు పడిపోయాయి. ఎట్టి పరిస్థితుల్లో రైతులను ఆదుకోవాలని కేంద్రాన్ని కోరాం. మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీమ్ కింద 25 శాతం మాత్రమే ఇస్తారు. సాగు ఖర్చులను లెక్కలు వేసి ధరలు నిర్ణయించాలి. అవన్నీ సరిచేయాలని కేంద్రమంత్రిని కోరాం. దీనిపై సమీక్షా సమావేశంలో చర్చించిన తర్వాత స్పష్టత ఇస్తామని కేంద్రమంత్రి చెప్పారు. ఏ విధంగానైనా రైతులను ఆదుకోవడం ముఖ్య ఉద్దేశం. శనివారం వ్యాపారులు, మార్కెట్ కమిటీ ప్రతినిధులతో మాట్లాడి ధరల పతనానికి కారణాలు >>2



గురువారం ఢిల్లీ ముఖ్యమంత్రిగా రేఖాగుప్తాచేత ప్రమాణం చేయిస్తున్న లెఫ్టినెంట్ గవర్నర్ వికె సక్సేనా

# ఢిల్లీ పీఠంపై రేఖా గుప్తా

రామ్‌లీలా మైదాన్‌లో అట్టహాసంగా జరిగిన ప్రమాణ స్వీకారం

డి.సిఎంగా పర్వేష్‌సింగ్ వర్మ, మరో ఐదుగురు మంత్రులు ప్రమాణం

హాజరైన ప్రధాని మోడీ, పలువురు కేంద్రమంత్రులు, ఎన్డీయె సిఎంలు, ఎపి సిఎం చంద్రబాబు, డి.సిఎం పవన్

మంత్రులకు వెంటనే శాఖల కేటాయింపు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20:** రెండున్నరదశాబ్దాలు దాటిన తర్వాత దేశరాజధాని ఢిల్లీలో బిజెపి ప్రభుత్వం కొలువుదీరింది. గురువారం మధ్యాహ్నం రామ్‌లీలామైదాన్‌లో జరిగిన భారీ సభలో ముఖ్యమంత్రిగా రేఖాగుప్తా ప్రమాణ స్వీకారంచేసారు. లెఫ్టినెంట్ గవర్నర్ వికె సక్సేనా ఆమెతో ప్రమాణం చేయించారు. ప్రధాన మంత్రి నరేంద్రమోడీ, హోంమంత్రి అమిత్‌షా, పలువురు కేంద్రమంత్రులు, ఎన్డీయేపాలిత రాష్ట్రాల ముఖ్య >>2

## ఎపి ఫైబర్‌నెట్‌లో ముగ్గురు ఉన్నతాధికారులపై వేటు

**విజయవాడ,ఫిబ్రవరి20,ప్రభాతవార్తప్రతినిధి:** ఎపి ఫైబర్‌నెట్‌లో ముగ్గురు ఉన్నతాధికారులపై వేటు పడింది. ఫైబర్‌నెట్ చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ భరద్వాజ, ఫైబర్‌నెట్ బిజినెస్ హెడ్ సురేశ్, ప్రొక్యూర్‌మెంట్ అసిస్టెంట్ మేనేజర్ శశాంక్ హైదర్ ఖాన్‌ను తక్షణమే విధుల నుంచి తొలగించాలని ఫైబర్‌నెట్ ఛైర్మన్ జివి రెడ్డి ఆదేశాలిచ్చారు. గత 9 నెలలుగా ఫైబర్‌నెట్‌లో కనీస పురోగతి లేదని ఒక్క రూపాయి ఆదాయం కూడా తీసుకురాలేకపోయామని జివి రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.

ఎపి ఎస్‌ఎఫ్‌ఎల్‌లో సంస్కరణలు చేస్తున్నా అధికారులు సహకరించడం లేదని అందుకే ముగ్గురు అధికారులపై చర్యలు తీసుకున్నట్లు ఛైర్మన్ స్పష్టం చేశారు. సంస్థలో 400 మందిని తొలగించాలని ఆదేశాలిచ్చినా అధికారులు పట్టించుకోలేదని జివి రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగుల తొలగింపు ఆదేశాలపై ఫైబర్‌నెట్ ఎండి, ఇడి సంతకాలు చేయలేదని, ఉద్యోగులకు జీతాల రూపంలో సంస్థ సొమ్ము చెల్లించారని మండిపడ్డారు. ఫైబర్‌నెట్‌లోని ఉన్నతాధికారులు గత ప్రభుత్వంతో చేతులు కలిపారని అన్నారు. ఫైబర్‌నెట్‌కు జీఎస్టీ అధికారులు రూ.377 కోట్లు జరిమానా విధించారని, కానీ అధికారులు తనకు చెప్పలేదని తెలిపారు. ఈ 9 నెలల్లో ఒక్క కొత్త కనెక్షన్ కూడా ఇవ్వలేకపోయామని, >>2

# ఇక వడివడిగా పోలవరం

## పూర్తి సాయం అందించడానికి కేంద్రం అంగీకారం

## కుడి, ఎడమ కాల్వల నిర్మాణ ఖర్చు రీయింబర్స్‌మెంట్ అడిగాం

## కేంద్ర జలశక్తిమంత్రి సిఆర్ పాటిల్‌తో సమావేశమైన సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్



గురువారం కేంద్రమంత్రి సిఆర్ పాటిల్‌తో సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ భేటీ దృశ్యం

**విజయవాడ,ఫిబ్రవరి20,ప్రభాతవార్తప్రతినిధి:** పోలవరం ప్రాజెక్టును నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా నిర్మాణం పూర్తి చేసేందుకు సహకరిస్తామని కేంద్ర జలశక్తి మంత్రి సిఆర్ పాటిల్ స్పష్టం చేసారని సిఎం చంద్రబాబు తెలిపారు. డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్‌తో కలిసి కేంద్ర జలశక్తి మంత్రి సిఆర్ పాటిల్‌తో చంద్రబాబు ఢిల్లీలో సమావేశమయ్యారు. సమావేశం మంచిగా జరిగిందని సిఎం చంద్రబాబు మీడియాకు వెల్లడించారు. పోలవరం ఎడమ, కుడి కాలువల నిర్మాణానికి చేసిన ఖర్చును రీయింబర్స్‌మెంట్ చేయాలని కోరినట్లు తెలిపారు. ప్రాజెక్టును యుద్ధప్రాతిపదికన పూర్తి చేసేందుకు అవసరమైన అన్ని సహాయ సహకారాలు అందించాలని విన్నవించినట్లు తెలిపారు. డయా ఫ్రం వాల్ నిర్మాణ పనులు కూడా ఇప్పటికే రెండు కట్టర్లతో మొదలయ్యాయని తెలిపారు. మార్చి నుండి మూడో కట్టర్‌తో పనులు చేపడతామని వెల్లడించారు. డయాఫ్రం వాల్ నిర్మాణానికి సమాంతరంగా ఇసిఆర్‌ఎఫ్ డ్యాం పనులు మొదలు పెట్టేలా, అవసరమైన డిజైన్స్, సిడబ్ల్యూసి నుంచి త్వరగా వచ్చేలా సహాకరించాలని కేంద్ర మంత్రిని కోరారు.

ఈ సందర్భంగా సిఎం చంద్రబాబు విజ్ఞప్తి మేరకు త్వరలో పోలవరం సందర్శనకు వస్తానని సిఆర్ పాటిల్ తెలిపారు. గోదావరినుంచి 200 టిఎంసిల వరద నీటిని బనకచెర్లకు తరలించే లక్ష్యంతో చేపట్టిన పోలవరం బనకచెర్ల లింక్ ప్రాజెక్టుకు మద్దతు కోరినట్లువెల్లడించారు. ఈప్రాజెక్ట్ రాష్ట్రాన్ని కరవు రహితంగా మారుస్తుందని తెలిపారు. 80 లక్షల మందికి తాగునీరు, 3 లక్షల హెక్టార్ల కొత్త ఆయకట్టుకు ఇది ఉపయోగపడుతుందని అన్నారు. పరిశ్రమలకు 20 టిఎంసిల >>2

# 24 నుంచి అసెంబ్లీ

## 28నే బడ్జెట్ సమర్పణ

**విజయవాడ,ఫిబ్రవరి20,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ఫిబ్రవరి 24వ తేదీ నుంచి ప్రారంభమవుతోన్నాయి. ఆ క్రమంలో మార్చి 4వ తేదీన రాష్ట్ర బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ సభలో ప్రవేశపెట్టనున్నట్లు తొలుత సమాచారం వెలుగులోకి వచ్చింది. అయితే ఈ షెడ్యుల్‌ను కాస్తా ముందుకు జరిపారు. ఫిబ్రవరి 28వ తేదీన బడ్జెట్‌ను సభలో ప్రవేశపెట్టనున్నారు. ఇక ఈ బడ్జెట్ సమావేశాల ప్రారంభమవుతోన్న నేపథ్యంలో ఆ రోజు ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ అబ్దుల్‌నజీర్ ప్రసంగించనున్నారు.

అలాగే 25వతేదీన గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపేతీర్మానంపై చర్చ ప్రారంభం కానుంది. అదేరోజు ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై సిఎం చంద్రబాబు మాట్లాడనున్నారు. ఇక అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ఫిబ్రవరి 24వ తేదీనుంచి ప్రారంభంకానున్నాయి. ఇప్పటికే బడ్జెట్ అంశాలు నిధులకేటాయింపుపై సిఎం చంద్రబాబు ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్, ఆర్థికశాఖతో సహా వివిధ శాఖల అధికారులతో సమావేశాలు నిర్వహించారు.

## గ్రూప్-2 మెయిన్స్ నిలుపుదలపై పిటిషన్లను కొట్టివేసిన హైకోర్టు

2లో

# వెలిగొండ పూర్తికి మరో రెండేళ్లు!

## ప్రాజెక్టుకు మరో రూ. 4వేల కోట్లు అవసరం: మంత్రి నిమ్మల

**విజయవాడ,, ఫిబ్రవరి 20,ప్రభాతవార్తప్రతినిధి:** వెలిగొండ ప్రాజక్టు పనులను పూర్తి చేయకుండానే జాతికి అంకితం చేసిన ఘనత గత ప్రభుత్వానిదని, ఆ ప్రాజక్టు పూర్తి కావాలంటే దాదాపు రూ.4 వేల కోట్ల నిధులతో పాటు 2 ఏళ్ల సమయం పడుతుందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డా.నిమ్మల రామానాయుడు తెలిపారు. గురువారం రాష్ట్ర సచివాలయంలో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ 4.50 లక్షల ఎకరాలకు సాగు నీరు, 25 లక్షల మందికి త్రాగు నీరు అందజేసే వెలిగొండ ప్రాజక్టు ప్రధాన పనులు ఏవీ పూర్తి చేయకుండా రైతులను గృహనిర్బంధం చేసి పటిష్టమైన బందోబస్తు మధ్య ఆ ప్రాజక్టును జాతికి అంకితం చేయడం జరిగిందన్నారు. శ్రీశైలం వద్ద నున్న హెడ్ రెగ్యులేటరీ, రిటైనింగ్ వాల్ పనులు, మొదటి, రెండవ సొరంగం పనులను, ఫీడర్ కెనాల్ పనులను మరియు నిర్వాశితుల కాలనీల నిర్మాణ పనులను ఏ మాత్రం పూర్తి చేయకుండా వెలిగొండ ప్రాజక్టును జాతికి అంకితం చేయడం జరిగిందన్నారు. సొరంగం1 లో 1.20 లక్షల క్యూబిక్ మీటర్ల మేర రోడ్డును మరియు సొరంగం2 లో 2.00 లక్షల క్యూబిక్ మీటర్లు మట్టిని తొలగించాల్సి ఉందని, అందుకు దాదాపు తొమ్మిది మాసాలు పడుతుందన్నారు. సొరంగం 2లో ఇంకా డ్రిల్లింగ్ అండ్ బ్లాస్టింగ్ చేయాల్సిన పనులుఉన్నాయని అందుకు దాదాపు ఎనిమిది మాసాలు >>2

# గ్రూప్-2 పరీక్షలకు భారీ ఏర్పాట్లు



గురువారం ఎపిపిఎస్సి గ్రూపు2 మెయిన్ రాత పరీక్షలపై సమీక్షిస్తున్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయా నంద్

## 23న పరీక్షల నిర్వహణపై కట్టు కథలు ప్రచారం చేస్తే కఠిన చర్యలు : సిఎస్ విజయానంద్

**విజయవాడ, ఫిబ్రవరి20.ప్రభాతవార్తప్రతినిధి:** ఈనెల 23వతేదీన నిర్వహించనున్న ఎపిపిఎస్సి గ్రూపు2 మెయిన్ రాత పరీక్షలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నట్టు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయా నంద్ చెప్పారు. ఈ పరీక్షల నిర్వహణపై గురువారం రాష్ట్ర సచివాలయంలో ఎపిపిఎస్సి ఛైర్మన్ ఎ.అనురాధతో కలసి ఆయన అధికారులతో సమీక్షించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షల నిర్వహణలో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు ఆస్కారంలేకుండా అన్ని పరీక్షాకేంద్రాలవద్ద కట్టుదిట్టమైన బందోబస్తుతో పాటు ఇతర ఏర్పాట్లను చేయాలని కలక్టర్లు, ఎస్పిలను ఆదేశించారు.13 పాత జిల్లా కేంద్రాల్లోని 175 పరీక్షా కేంద్రాల్లో ఈ పరీక్షలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.పరీక్షల నిర్వహణకు సంబంధించి తీసుకోవాల్సిన చర్యలపై ఇప్పటికే మార్గదర్శకాలను జిల్లాలకు పంపండం జరిగిందని వాటిని పూర్తిగా పాటించాలని స్పష్టం చేశారు. ఈ పరీక్షలకు 92వేల 250 మంది అభ్యర్ధులు హాజరు కానున్నారని పరీక్షలు సజావుగా జరిగేందుకు వీలుగా పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేయాలని కలక్టర్లు, ఎస్పిలను ఆదేశించారు. ముఖ్యంగా పరీక్షల నిర్వహణకు సంబంధించి సోషల్ మీడియాలో ఎక్కడైనా ఎవరైనా వదంతులు లేదా నకిలీ వార్తలు ప్రసారం చేసినా లేదా సర్కులేట్ చేసినా వెంటనే విచారణ చేసి అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సిఎస్ విజయానంద్ కలక్టర్లు, ఎస్పిలకు స్పష్టం చేశారు.

ఇదే సమయంలో ఎవరైనా నకిలీ వార్తలు ప్రసారం లేదా వదంతులు సృష్టించినా అభ్యర్ధులు వారి తల్లిదండ్రులు ఎవిధమైన ఆందోళన చెందవద్దని ఆయన హితవు చేశారు. పరీక్షలు సజావుగా సక్రమంగా జరిగేందుకు వీలుగా ఇప్పటికే అన్ని కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయడం జరిగిందని అన్నారు.సెన్సిటివ్ పరీక్షా కేంద్రాలుగా గుర్తించిన ప్రాంతాల్లో మరిన్ని కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని సిఎస్ విజయానంద్ కలక్టర్లు,ఎస్పిలు,ఎపిపిఎస్సి అధికారులను ఆదేశించారు. ముందుగా ఎపిపిఎస్సి ఛైర్మన్ ఎ.అనురాధ గ్రూపు2 మెయిన్ పరీక్షల ఏర్పాట్ల గురించి మాట్లాడుతూ పాత 13 జిల్లా కేంద్రాల్లోని 175 పరీక్షా >>2

## వల్లభనేనికి హైకోర్టులో చుక్కెదురు



**విజయవాడ, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త ప్రతినిధి:** వైఎస్సార్సీపీ నేత వల్లభనేని వంశీకి హైకోర్టులో ఎదురు దెబ్బ తగిలింది. గన్నవరం టిడిపి ఆఫీసుపై దాడికేసులో ముందస్తు బెయిల్ ఇవ్వాలంటూ వంశీ వేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. ఇటీవల వంశీ దళిత యువకుడు సత్యవర్ధన్‌ను కిడ్నాప్, దాడి చేసిన కేసులో అరెస్ట్ అయి ప్రస్తుతం విజయవాడ జైలులో ఉన్నాడు.

వైఎస్సార్సీ నేత వల్లభనేని వంశీకి హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. వంశీ ముందస్తు బెయిల్ పిటిషన్‌ను కొట్టేస్తూ న్యాయస్థానం ఉత్తర్వులుజారీచేసింది. గన్నవరం టిడిపి కార్యాలయంపై దాడి కేసులో వంశీ నిందితుడిగా ఉన్నాడు. ఈ కేసులో తనకు >>2

# రైల్వే పరీక్షల్లో భారీ అవినీతి!

## పలువురు అధికారుల అరెస్టు

**గుంతకల్లు రైల్వే,ఫిబ్రవరి 20,ప్రభాతవార్త:** పశ్చిమ రైల్వే జోన్‌లో పదోన్నతులకు సంబంధించిన కేసులో రైల్వే అధికారులు సహా ఆరుగురిని అరెస్టు చేసినట్లు సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సిబిఐ) వెల్లడించింది. పశ్చిమ రైల్వే జోన్‌లో లిమిటెడ్ డిపార్ట్‌మెంటల్ (ఎల్‌డిసిఇ) పరీక్షల్లో అభ్యర్థులకు అనుకూలంగా ఉండేందుకు భారీగా లంచం వసూలు చేశారన్న ఆరోపణలు, అభియోగాలపై పశ్చిమ రైల్వే, వడోదరలోని డిఆర్‌ఎం కార్యాలయంలో ఇద్దరు ఐఆర్‌పిఎస్ అధికారులతో పాటు మరికొందరితో కూడిన లంచం నెట్‌వర్క్ (రాకెట్)ను సిబిఐ అదుపులోకి తీసుకొని విచారిస్తోంది. ఈ కేసులో పశ్చిమ రైల్వే జోన్‌లోని వడోదరలో పనిచేస్తున్న 2008, 2018 ఐఆర్‌పిఎస్ బ్యాచ్‌కు చెందిన ఇద్దరు అధికారులతో సహా ఆరుగురు >>2

# విద్యుత్ ఛార్జీల పెంపు లేదు..

## ఎపి ఇఆర్‌సి ఛైర్మన్ ఠాకూర్ రామ్‌సింగ్

**తిరుపతిరూరల్, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్‌లో విద్యుత్ చార్జీలు పెంపులేదని ఎపిఇఆర్‌సి ఛైర్మన్ ఠాకూర్ రామ్ సింగ్ ప్రకటించారు. 2025-26 సంవత్సరానికి సంబంధించి రాష్ట్రంలో విద్యుత్ చార్జీల టారిఫ్‌లను ఏపి విద్యుత్ నియంత్రణ మండలి ఛైర్మెన్ విడుదల చేసారు. ఎపిఇఆర్‌సి మూడు డిస్కమ్‌ల కోసం రూ.57,544,17 కోట్ల రుపాయాల ఎఆర్‌ఆర్‌ని అమోదించగా, ఇది డిస్కమ్‌ల ఫైలింగ్‌ల కంటే రూ.1.324.35 కోట్లు తక్కువ అన్నారు. >>2



విద్యుత్ చార్జీల టారిఫ్‌లను విడుదల చేస్తున్న విద్యుత్ నియంత్రణ మండలి ఛైర్మెన్ ఠాకూర్ రామ్ సింగ్


గురువారం న్యూఢిల్లీలో జరిగిన సిఎం ప్రమాణస్వీకార కార్యక్రమంలో ప్రధాని మోడీతో డి.సిఎం పవన్

# హిమాలయాలకు వెళ్తున్నారా?

## డిప్యూటీ సిఎం పవన్‌ను చూసి చమత్కరించిన ప్రధాని మోడీ

## ఢిల్లీ సిఎం ప్రమాణ స్వీకార కార్యక్రమంలో అందరినీ ఆకట్టుకొన్న పవన్ ఆహార్యం

**విజయవాడ,ఫిబ్రవరి20,ప్రభాతవార్తప్రతినిధి:** ఢిల్లీ సిఎం రేఖ గుప్తా పదవీ స్వీకార కార్యక్రమంలో ఎపి డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్‌తో ప్రధాని నరేంద్రమోడీ చతుర సంభాషణ సాగించారు.ఈ కార్యక్రమానికి వచ్చిన ప్రధాని మోడీ ఒక్కొక్క ప్రముఖున్ని పలుకరిస్తూ, కరచాలనం చేస్తూ పవన్ కళ్యాణ్ కనిపించగానే ఒక్కనిమిషం పాటు అలా ఆగిపోయారు. పవన్ వస్త్రాదారణ చూసిన మోడీ నవ్వుతూ హిమాలయాలకు వెళ్దామనుకుంటున్నావా! అంటూ చమత్కరించారు. మోడీ మాటలకు పడిపడి నవ్విన పవన్ కళ్యాణ్ అలా ఏమి లేదంటూ సమాధానమిచ్చారట. వెంటనే నీ ముందు చాలా బాధ్యతలు ఉన్నాయి.. వాటిని చూసుకో అంటూ మోడీ పవన్ కళ్యాణ్ చేతిలో చేయి వేసి పలకరించారు. మోడీ మాటలకు పవన్ కళ్యాణ్ వెనుకఉన్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు సైతం నవ్వుతూ కనిపించారు. వేదికపై ఉన్నవారందరికి నమస్కరిస్తూ ముందుకుసాగిన మోడీ పవన్ వద్ద కొద్దిసేపు ఆగి.. ప్రత్యేకంగా మాట్లాడటంపై రాజకీయంగా పలు భిన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పవన్‌పై మోడీ మరోసారి తన అభిమానాన్ని చూపించారంటూ జనసైనికులు కామెంట్స్ చేస్తున్నారు.ప్రత్యేకంగా పవన్‌వేదికపై డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఆయన వస్త్రధారణ చూసి పిఎం మోడీ సైతం ఆశ్చర్యపోయినట్లు తెలుస్తోంది. ఇటీవల కాలంలో పవన్ కళ్యాణ్ సనాతన ధర్మం కోసం మాట్లాడుతున్నారు. సనాతన ధర్మ పరిరక్షణకు జనసేన పోరాడుతుందని ప్రకటించారు. దేశ వ్యాప్తంగా హిందూ ఆలయాల పరిరక్షణ కోసం ప్రత్యేక సనాతన బోర్డు ఏర్పాటుచేయాలనే డిమాండ్‌ను పవన్ వినిపిస్తున్నారు. దీంతో పవన్ కళ్యాణ్ పేరు దేశవ్యాప్తంగా ప్రాచుర్యంలోకి వచ్చింది.

# రైతులను ఆదుకుంటాం

>> తెలుసుకుంటానని సిఎం చంద్రబాబు అన్నారు.ఈ అంశంపై ఇప్పటికే కేంద్రానికి 3 సార్లు లేఖలు రాశాం. రాష్ట్ర ప్రభుత్వం నుంచి కూడా అధికారులు వచ్చి కేంద్ర అధికారులతో మాట్లాడారు. మా ప్రధాన ఉద్దేశం మిర్చి రైతులను ఆదుకోవాలని కోరడానికి ఢిల్లీకి వచ్చాం. రైతులు నష్టపోకుండా ఏం చేయాలో చేస్తాం. రైతులను పట్టించుకోని వారు మాట్లాడుతున్నారు. పంటలకు సంబంధించి ధరలు ఒక్కోసారి తగ్గుతాయి.. ఒక్కోసారి పెరుగుతాయన్నారు. రైతుకు గిట్టుబాటు ధరలేనప్పుడు ప్రభుత్వం వారికి కల్పించగా అండగా నిలుస్తోందన్నారు. రైతులకు గతంలో ఏమీ చేయలేని వారు ఇప్పుడొచ్చి మాట్లాడుతున్నారు. 2019కి ముందు ధరలు తగ్గితే దేశంలో ఎక్కడా లేని విధంగా రూ.138 కోట్లు విడుదల చేసి మిర్చి రైతులను ఆదుకున్నాం. మళ్లీ డబ్బులివ్వబోయేది ఎన్డీయేనే. బాధ్యత లేకుండా మిర్చి యార్డులోకి వెళ్లారు. ఎన్నికల కోడ్ అన్ని రాజకీయ పార్టీలకు వర్తిస్తుంది. కానీ పోటీలో మేం లేం కాబట్టి మాకు వర్తించదని చెప్పున్నారు. ఎన్నికల కమిషన్ వెళ్లొద్దని చెప్పినా వినకుండా వెళ్లారు. ఇల్లీగల్ పనులు చేసి సెక్యూరిటీ కావాలని అడిగారు. మీరు చేసే ఇల్లీగల్ పనులకు పోలీసులు రక్షణగా ఉండాలా? నేరాలు చేస్తుంటే మీ వెనక పోలీసులు రావాలా? జల్ జీవన్, పోలవరంపై చర్చించేందుకు కేంద్ర జలశక్తిశాఖ మంత్రి సీఆర్ పాటిల్‌ను కూడా కలిశాను. జల్ జీవన్ మిషన్, పోలవరంపై ఆయనతో చర్చించాం. పోలవరం పనులు సజావుగా సాగుతున్నాయి. 2027 నాటికి పూర్తి చేయాలని ఆశయంగా పెట్టుకున్నాం. నదుల అనుసంధానంపైనా చర్చించాం. సముద్రంలోకి వృథాగా వెళ్లే నీరు ఉపయోగించుకుంటే రాష్ట్రంలో కరవు లేకుండా ఉంటుంది. పోలవరం నుంచి బనకచర్ల నీళ్లు తీసుకెళ్లేందుకు కేంద్ర సహకారం కోరాం. దీనిపై అధ్యయనం చేయడానికి కేంద్ర ప్రతినిధులు కూడా రాష్ట్రానికి వస్తారు. జల్ జీవన్ మిషన్ పథకంలో భాగంగా ఇంటింటికీ కుళాయి నీటిని అందించాలన్నది లక్ష్యం. కానీ గత ప్రభుత్వం ఆ పథకాన్ని ఒక్కశాతం కూడా ఉపయోగించుకోలేదు. రాష్ట్రానికి రూ. 27 వేల కోట్లను కేంద్రం మంజూరు చేసింది. పైప్‌లైన్ల ద్వారా కాకుండా బోరు బావుల ద్వారా ఇస్తామని చెప్పారు. కేంద్రం ఇచ్చిన రూ.50 వేల కోట్ల నిధులను యూజ్ ఖర్చు చేసింది. గుజరాత్‌లో ఇంటింటికీ కుళాయి ద్వారా నిరంతరంగా నీళ్లు ఇస్తున్నారు. కేంద్రం ఈ పథకాన్ని మళ్లీ నిబంధనలు మార్చి 2028కి పనులు పూర్తి చేయాలని సమయం పెంచింది. దీని ప్రకారం గతంలో కేటాయించిన రూ.27 వేల కోట్లు మాత్రమే వస్తాయి. రాష్ట్రంలో అన్ని ప్రాంతాల్లో కుళాయి ద్వారా నీరివ్వాలంటే అదనంగా రూ.54 వేల కోట్లు అవసరం. దీనిపై కూడా కేంద్రంతో మళ్లీ సంప్రదిస్తాం. ప్రస్తుతం రూ.27 వేల కోట్లకు డీపీఆర్ సిద్ధం చేసి కేంద్రాన్ని నిధులు కోరతాం. తప్పుడు విధానాలతో ప్రజలకు నష్టంగా ప్రభుత్వం అవలంభించిన తప్పుడు విధానాల వల్ల ప్రజలు ఏ విధంగా నష్టపోతారో ఈ జల్ జీవన్ మిషన్ ఒక ఉదాహరణ. 93 కేంద్ర ప్రాయోజిత పథకాలను ఐదేళ్ల పాటు నిర్వీర్యం చేశారు. వాటిల్లో కొన్ని పథకాలను మేము వచ్చాక మ్యాచింగ్ గ్రాంట్ కేటాయించి నిధులు ఖర్చు చేసే యుసిలు ఇచ్చాం. కేంద్రం ఇచ్చే పథకాలు ఉపయోగించుకుంటే రాష్ట్రానికి ఎంతో మంచి జరుగుతుంది. కానీ గత ప్రభుత్వ చేతకాని పాలన వల్ల సమస్యలు వచ్చి పడ్డాయి... వాటిని పరిష్కరించుకుంటూ ముందుకెళ్తున్నాం. సముద్రంలో కలిసే నీటినే వాడుకుంటున్నాంనదులను ప్రవహించే వరుసలో చూసుకుంటే ఏపి చిట్టచివర ఉంది. ఉమ్మడి రాష్ట్రంలో నేను 9 ఏళ్ల సిఎంగా ఉన్నప్పుడు అనేక ప్రాజెక్టులు పూర్తి చేసి తెలంగాణకు నీళ్లందించాం. ఇప్పుడు సముద్రంలోకి వెళ్లే నీరు ఉపయోగించుకోవాలని చూస్తున్నాం. వృథాగా సముద్రంలోకి పోయే నీటిని ఎపి ఉపయోగించుకునే అవకాశం ఉంది. వాటినే వాడుకుంటున్నాం. రాజకీయం అంటే ప్రజల సమస్యల కోసం పని చేయడం రాజకీయం అవుతుంది. ఎపిలో ఎన్డీయే చిత్తశుద్ధితో పని చేస్తోంది అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. ఇక కేంద్రమంత్రులు కింజరపు రామ్మోహననాయుడు,పెమ్మసాని చంద్రశేఖర్ తదితరులు సిఎం చంద్రబాబుతో పాటు కేంద్రమంత్రి శివరాజ్‌చౌహాన్‌తో మిర్చి ధరలపై జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.అంతకు ముందు సిఎం చంద్రబాబు ఢిల్లీ సిఎం రేఖా గుప్తా ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొని ఆమె అభినందించారు.జ్ఞాపికను అందజేసారు.


గురువారం ఢిల్లీ సిఎంగా ప్రమాణం చేసిన రేఖా గుప్తాకు జ్ఞాపికను అందించి అభినందిస్తున్న సిఎం చంద్రబాబు

# వడివడిగా పోలవరం

>> నీటిని ఈ ప్రాజెక్టు ద్వారా కేటాయించవచ్చని సిఎం చంద్రబాబు తెలిపారు.స్వయంగా మూడు సార్లు పోలవరం ప్రాజెక్టును సందర్శించి వర్క్ షెడ్యూల్ విడుదల చేసామని చంద్రబాబు అన్నారు. 2025 డిసెంబర్ నాటికి డయా ఫ్రంవాల్ నిర్మాణం, 2027 డిసెంబర్ పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేసేలా ఎప్పటికప్పుడు అధికారులు, ఏజెన్సీలతో సమీక్షిస్తున్నామని సిఎం చంద్రబాబు కేంద్రమంత్రికి తెలిపారు. పోలవరం ప్రాజెక్టును నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేందుకు సహాయ, సహకారాలు అందిస్తామని కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ హామీ ఇచ్చినట్లు తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ సైతం పోలవరం ప్రాజెక్టుపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారని సీఆర్ పాటిల్ తెలిపారన్నారు.కేంద్రమంత్రి పాటిల్‌తో బేటీ సందర్భంగా ఆయనను సీఎం చంద్రబాబు,డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఘనంగా సత్కరించి,జ్ఞాపికను అందజేసారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి కింజరపు రామ్మోహననాయుడు పాల్గొన్నారు.ఈ భేటీ అనంతరం చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ఢిల్లీ సిఎం ప్రమాణ స్వీకారానికి హాజరయ్యారు ఈ కార్యక్రమం అనంతరం ఎన్డీఏ నేతలకు బిజెపి జాతీయ అధ్యక్షుడు నడ్డా విందులో చంద్రబాబు నాయుడు,పవన్ కళ్యాణ్ పాల్గొన్నారు.

# ఢిల్లీ పీఠంపై రేఖా గుప్తా

>> మంత్రులు, బిజెపినేతలు హాజరయ్యారు. ఎపినుంచి సిఎం చంద్రబాబు, డిప్యూటిసిఎం పవన్‌కళ్యాణ్‌లతోపాటు ఎన్డీయే పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు కూడా పాల్గొన్నారు. ఉదయం ఇంటినుంచి బయలుదేరిన రేఖాగుప్తా హనుమాన్ ఆలయంలో పూజలుచేసారు తర్వాత ఆమె రామ్‌లీలామైదానానికి చేరుకుని అందరినీ పలకరించారు. సుమారు 25వేలమంది భద్రతాసిబ్బంది బందోబస్తుతో ఉన్న రామ్‌లీలామైదాన్‌లో ఆమె ముఖ్యమంత్రిగా ప్రమాణంచేసారు. సుమారు 50వేలమందికిపైగా హాజరయిన అభిమానులు, బిజెపి కేడర్‌లమధ్య గుప్తా సిఎంగాను, పర్వేష్‌సింగ్ వర్మ డిప్యూటి సిఎంగాను ప్రమాణాలుచేసారు. రేఖాతోపాటు బిజెపి ఎమ్మెల్యేలు పర్వేశ్‌వర్మ, ఆశీస్‌సూద్, మజీందర్‌సింగ్ సిర్సా, రవీందర్ ఇంద్రజ్‌సింగ్, కపిల్‌మిశ్రా, పంకజ్‌కుమార్‌లు మంత్రులుగా ప్రమాణంచేసారు. కొత్త సిఎంకు జడ్‌కేటగిరీ సెక్యూరిటీని కేటాయించారు. ఇదిలా ఉండగా ప్రమాణ స్వీకారంచేసిన తర్వాత రేఖాగుప్తా మాట్లాడుతూ మహిళలకు ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉన్నామన్నారు. మార్చి 8వ తేదీన రూ.2500 నగదును వారి ఖాతాల్లోకి బదలాయిస్తామని చెప్పారు. ఎన్నికల్లో ప్రజలకిచ్చిన అన్ని హామీలను నెరవేరుస్తామని అన్నారు. ప్రధానిమోడీ కలలను సాకారంచేయడం అనేది ఢిల్లీలోని 48 మంది బిజెపి ఎమ్మెల్యేల బాధ్యత అని అన్నారు. మహిళలకు ఆర్థికంగా సాయం అందించే హామీలన్నీ మేం ఖచ్చితంగా నెరవేరుస్తామని, మార్చి 8 నాటికి సొమ్ములు వారి ఖాతాల్లో ఉంటాయని అన్నారు. ఇదిలా ఉంటే ప్రమాణ స్వీకారంచేసిన తర్వాత మధ్యాహ్నం 3 గంటలప్రాంతంలో కేంద్ర మంత్రి జెపినడ్డాతో కలిసి సిఎం రేఖాగుప్తా ఢిల్లీ సచివాలయానికి చేరారు. ఈ సందర్భంగా ఆమెకు పలువురు ఎమ్మెల్యేలు ఎంపిలు అధికారులు ఘనస్వాగతం పలికారు. సిఎం ఛాంబర్‌లోకి వెళ్లిన రేఖాగుప్తా ముఖ్యమంత్రిగా బాధ్యతలుచేపట్టారు. ఢిల్లీకి నాలుగో మహిళా సిఎంగాను, రెండో బిజెపి మహిళా ముఖ్యమంత్రిగా ఆమె రికార్డు నెలకొల్పారు. సాయంత్రం ఐదు గంటలకు వాసుదేవ్‌ఘాట్, యమునా బజార్‌ను సిఎం సందర్శించారు. తన మొదటి కేబినెట్ సమావేశం ఢిల్లీలోని సచివాలయంలోనే నిర్వహిస్తారు. ఈమేరకు అధికారులు సిఎం షెడ్యూలును సైతం విడుదలచేసారు.

# వెలిగొండ పూర్తికి మరో రెండేళ్లు!

>> పడుతుందన్నారు. అదే విధంగా సొరంగం2లో 6.8 కి.మి. మేర లైనింగ్ పనులు ఉన్నాయని, భారీ టన్నెల్ బోరింగ్ మిషన్ కూడా ఉందని, దాన్ని తొలగించేందుకు చాలా సమయం పడుతుందన్నారు. 21.8 కి.మి. మేర ఫీడర్ కెనాల్ పనులను కూడా నిర్వహించాల్సి ఉందన్నారు. ఇన్ని పనులు పెండింగ్‌లో ఉంటే వెలిగొండ ప్రాజెక్టును జాతికి అంకితం చేయడం ఎంతో విడ్డూరంగా ఉందన్నారు. అదే విధంగా ఈ ప్రాజెక్టు విషయంలో తమ ప్రభుత్వంపై బురద జల్లే విధంగా ప్రతి పక్షపార్టీ నాయకులు మాట్లాడం వింతగా ఉందన్నారు. 1996 సంవత్సరంలో ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆ ప్రాజెక్టుకు భూమి పూజచేసి, 2014 లో రూ.1,373 కోట్లను కేటాయించి అందులో 96 శాతం నిధులు అంటే రూ.1,319 కోట్లను వెచ్చించి 30 శాతం పనులను పూర్తి చేయడం జరిగిందన్నారు. అయితే గత ప్రభుత్వ హయాంలో భారీ స్థాయిలో బడ్జెట్ రూ.3,518 కోట్లు కేటాయిస్తున్నట్లు చూపించినప్పటికీ అందులో కేవలం 18 శాతం నిధులు అంటే రూ.647 కోట్లను మాత్రమే వెచ్చించడం జరిగిందన్నారు.

పూర్తికాని ప్రాజెక్టులను జాతికి అంకితం చేసిన ఘనుడు జగన్ అన్నారు. అబద్ధాలు చెప్పడం, అభూత కల్పనలు చేయడం, పూర్తికాని ప్రాజెక్టులను ప్రారంభించడంలో జగన్ అంతర్జాతీయ ఖ్యాతి గడించారని నిమ్మల రామానాయుడు ఎద్దేవా చేశారు. ప్రపంచంలో ఇప్పటివరకు ఏడు వింతలు మాత్రమే ప్రజలకు తెలుసు అని ఎనిమిదో వింత జగన్ రూపంలో చూస్తున్నారని ఆయన అన్నారు.

# చుక్కెదురు

>> ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ గతంలో పిటిషన్ దాఖలు చేశారు. పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం ఇటీవల తీర్పు రిజర్వు చేసింది. నేడు పిటిషన్‌ను కొట్టేస్తూ తీర్పునిచ్చింది. వల్లభనేని వంశీ ఆదేశాల మేరకే గన్నవరం టిడిపి కార్యాలయంపై దాడి జరిగిందని ప్రభుత్వం తరపున న్యాయవాది వాదనలు వినిపించారు. వాహనాలు దగ్ధం చేసి భయభ్రాంతులకు గురి చేశారని కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. బాధితులు ఫిర్యాదు చేస్తే పోలీసులు కేసు నమోదు చేసి నిందితులను అప్పట్లో అరెస్ట్ చేయలేదని తెలిపారు. వైఎస్సార్సీ అధికారంలో ఈ కేసు దర్యాప్తును నీరుకార్చారని కోర్టు దృష్టికి తీసుకువచ్చారు.

ముందస్తు బెయిల్ ఇస్తే కేసు దర్యాప్తుపై ప్రభావం పడుతుందని తెలిపారు. పిటిషనర్‌పై రాజకీయ కక్షతోనే కేసు నమోదు చేశారని పిటిషనర్‌కు, దాడికి ఎటువంటి సంబంధం లేదని వంశీ తరుపు న్యాయవాదులు వాదనలు వినిపించారు.ఇరువైపుల వాదనలు విన్న తరువాత వంశీ ముందస్తు బెయిల్ పిటిషన్‌ను హైకోర్టు కొట్టేసింది.

# రైల్వే పరీక్షల్లో భారీ అవినీతి!

>> నింధితులను అరెస్టు చేసింది. పశ్చిమ రైల్వే జోన్‌లో లిమిటెడ్ డిపార్ట్‌మెంటల్ పరీక్షల్లో పదిమంది అభ్యర్థులకు అనుకూలంగా వ్యవహారించేందుకు భారీగా లంచం వసూలు చేసిన ఆరోపణలకు సంబంధించిన కేసులో ముంబై చర్చ్ గేట్ డిప్యూటీ చీఫ్ కమర్షియల్ మేనేజర్,డిప్యూటీ స్టేషన్ సూపరింటెండెంట్,అహ్మదాబాద్‌లోని సబర్మతి డివిజనల్ రైల్వే ఆసుపత్రిలో నర్సింగ్ సూపరింటెండెంట్‌తో పాటు మరో ప్రైవేటు వ్యక్తిని సిబిఐ అరెస్టు చేసింది.

ఈ సందర్భంగా నింధతుల నివాసాలు,అధికారిక ప్రాంతాల్లో 11చోట్ల నిర్వహించిన సెర్చ్ ఆపరేషన్‌లో లంచం తీసుకున్న రైల్వే ఉద్యోగులు నుండి రూ.57లక్షలు విలువ చేసే 650గ్రాముల బంగారం,బంగారు ఆభరణాలు, సుమారు రూ.5లక్షల నగదు, ఎలక్ట్రానిక్ యాంత్రిక పరికరాలను స్వాధీనం చేసుకున్నట్లు సిబిఐ తెలిపింది. అరెస్ట్ చేసిన నింధితులను అహ్మదాబాద్‌లోని సిబిఐ ప్రత్యేక న్యాయస్థానంలో హాజరు పరుచనున్నట్లు విచారణ కొనసాగుతుందని సిబిఐ తన ప్రకటనలో తెలిపింది.

# ఉన్నతాధికారులపై వేటు

>> ఇంటర్నెట్ వ్యవస్థలో నిత్యం సమస్యలు వస్తున్నాయని తెలిపారు. ఫైబర్‌నెట్ అధికారులు ఎలా పని చేస్తున్నారనేందుకు ఇవన్నీ నిదర్శనమని జివి రెడ్డి అన్నారు. ఫైబర్‌నెట్ ఎండి దినేష్‌కుమార్ ఆగస్టులో వచ్చినా ఒక్కరోజు కూడా సమీక్షించలేదని, ఒక్క ఆపరేటర్‌ను కూడా కలవడం లేదని జివి రెడ్డి వివరించారు. ఫైబర్‌నెట్‌ను చంపేయాలని దినేష్‌కుమార్ భావిస్తున్నారా అని ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో ఉన్నట్లే దినేష్‌కుమార్ పని చేస్తున్నారని అన్నారు. ఈయన కనీసం టార్గెట్లు పెట్టడం లేదని, అలాగే ఆదాయం పెంచేందుకు కూడా ప్రయత్నించడం లేదని వెల్లడించారు. కానీ సిబ్బందికి అక్రమంగా 3 నెలలు జీతాలు చెల్లించారని వివరించారు. ఆ జీతాల మొత్తాన్ని ఎండి దినేష్, ఉన్నతాధికారుల నుంచి వసూలు చేయాలని అన్నారు.

# మార్చి 1 నుండి 20 వరకు ఇంటర్ పరీక్షలు

**విజయవాడ, ఫిబ్రవరి20.ప్రభాతవార్తప్రతినిధి:** మార్చి 1వ తేదీ నుండి 20వ తేదీ వరకూ ఇంటర్మీడియెట్ పరీక్షలు జరగన్నాయి.మార్చి 1నుండి 19 వరకూ ప్రథమ సంవత్సర పరీక్షలు,3 నుండి 20 వరకూ ద్వితీయ సంవత్సర పరీక్షలు రోజూ ఉదయం 9గం.ల నుండి మధ్యాహ్నం 12 గం.ల వరకూ జరగనుండగా 26 జిల్లాల్లో 1535 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా మొత్తం 10 లక్షల 58వేల 892 మంది విద్యార్థులు పరీక్షలు వ్రాయనున్నారు. అదే విధంగా ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ సొసైటికి సంబంధించిన ఇంటర్మీడియెట్ పరీక్షలు మార్చి 3 నుండి 15వ తేదీ వరకూ జరగనుండగా 325 కేంద్రాల్లో ఈపరీక్షలకు మొత్తం 67వేల 952 మంది విద్యార్థులు పరీక్షలు వ్రాయనున్నారు.ఈపరీక్షల ఏర్పాట్లపై గురువారం రాష్ట్ర సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ విద్యాశాఖ అధికారులతో సమీక్షించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి, ఏప్రిల్ నెలలు పరీక్షలమాసాలని కావున ఆయాపరీక్షలు సజావుగా సాగేందుకు తగిన విస్తృత ఏర్పాట్లు చేయాలని కలక్టర్లు, ఎస్పిలను ఆదేశించారు. ఈపరీక్షలకు సంబంధించి 1535 కేంద్రాలను ఏర్పాటు చేయగా వాటిలో 68 కేంద్రాలను సెన్సిటివ్,36 కేంద్రాలు వల్నరబుల్ కేంద్రాలుగా గుర్తించడం జరిగిందని అక్కడ గతంలో జరిగిన సంఘటనలను దృష్టిలో ఉంచుకుని కట్టుదిట్టమైన ఏర్పాట్లుచేయాలని సిఎస్ విజయానంద్ ఆదేశించారు. ఆయా పరీక్షా కేంద్రాల్లో తాగునీరు,ప్రథమ చికిత్స ఏర్పాట్లు, విద్యుత్, బెంచ్‌లు వంటి కనీస సౌకర్యాలు అందుబాటులో ఉండే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని సిఎస్ విజయానంద్ కలక్టర్లకు స్పష్టం చేశారు.పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు వీలుగా పరీక్షా కేంద్రాలకు 100మీటర్ల పరిధిలో 144వ సెక్షన్ కింద నిషేధాజ్ఞలు జారీ చేయాలనిఆదేశించారు.పరీక్షాకేంద్రాల పరిధిలో పరీక్షలసమయంలో జిరాక్సు కేంద్రాలు, నెట్ కేంద్రాలు మూసి ఉంచేలా చర్యలు తీసుకోవాలని సిఎస్ ఆదేశించారు.

# బంగ్లాపై భారత్ విజయం

## ఆరువికెట్ల తేడాతో బంగ్లాజట్టు ఓటమి

**దుబాయ్, ఫిబ్రవరి 20:** ఐసిసి ఛాంపియన్స్‌ట్రోఫీలో భారత్‌బోణి కొట్టింది. దుబాయ్ వేదికగా బంగ్లాదేశ్‌తోజరిగిన మ్యాచ్‌లో టీమిండియా ఆరువికెట్ల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్‌చేసిన బంగ్లా 49.4 ఓవర్లలో 228 పరుగులకు ఆలౌట్ అయింది. అనంతరం లక్ష్యఛేదనలో భారత్ 46.3 ఓవర్లలో నాలుగు వికెట్లను కోల్పోయి 231 పరుగులుచేసి విజయం సాధించింది. భారత ఓపెనర్ శుభ్‌మన్‌గిల్ 101 పరుగులుచేసి సెంచరీ వీరుడుగా నిలిచాడు. ఇంగ్లండ్‌పై సెంచరీ సాధించి దూకుడుపై ఉన్న కెప్టెన్ రోహిత్‌శర్మ 41పరుగులుచేసాడు. తొలి వికెట్‌కు ఓపెనర్ గిల్‌తోకలిసి పది ఓవర్లలోపే 69 పరుగులు జోడించాడు. రోహిత్ ఔట్ అయ్యా క్రీజులోకి వచ్చిన విరాట్ ఆచితూచి ఆడుతూ 22 పరుగులుచేసాడు. స్పిన్నర్ రిషద్ బౌలింగ్‌లోనే కోహ్లీ వికెట్ పడిపోయింది, శ్రేయస్ అయ్యర్ 15పరుగులేచేసి నిరాశపరిచాడు. అక్షర్‌పటేల్ 8 పరుగులుమాత్రమేచేసి నిరాశకు గురిచేసాడు. వికెట్లు పడుతున్నా ఏకాగ్రతకోల్పోకుండా శుభ్‌మన్‌గిల్ కీలక ఇన్నింగ్స్ ఆడాడు. కెఎల్‌రాహుల్ 40 పరుగులుచేసి జట్టును గెలిపించాడు. కెఎల్‌రాహుల్; శుభ్‌మన్‌గిల్ ఇద్దరూ కలిసి జట్టును విజయం వైపు నడిపించారు. గిల్128 బంతుల్లో తొమ్మిదిఫోర్లు, రెండు సిక్సర్లతో 101 పరుగులుచేస్తే కెఎల్‌రాహుల్ 47 బంతుల్లో ఒకఫోరు, రెండుసిక్సర్లతో నాటౌట్‌గా నిలిచారు. బంగ్లా బౌలర్లలో రషీద్‌కు రెండు, తక్సిన్ అహ్మద్,రెహమాన్‌కు చెరోవికెట్ లభించింది.

# విద్యుత్ ఛార్జీల పెంపు లేదు..

>>ఎపిఇఆర్‌సి మొత్తం ఆధాయాన్ని రూ.44.323.30 కోట్ల రుపాయాలను ఆమోదించగా ఇది డిస్కమ్‌ల దాఖలు కంటే కొంచెం ఎక్కువే అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.12,632.40కోట్ల సబ్సీడిని భరించటానికి అంగీకరించినట్లు తెలిపారు. అన్ని వినియోగదారుల వర్గాలకు టారిఫ్ పెంపును నివారించినట్లు తెలిపారు. వ్యవసాయ వినియోగదారులు, ఉద్యానవన నర్సరీలు, చాకలి, ఆక్వాకల్చర్ రైతులు, షెడ్యూల్డ్ కులాలు, తెగల కుటుంబాలు మొదలైనవాటితో సహ నిర్ధిష్ట వినియోగదారు వర్గాలకు రాయితీలు, ఉచిత విద్యుత్‌ను అందించే ప్రభుత్వ ఉత్తర్వులు అన్నీకూడా ఉచిత సబ్జీడిలో చేర్చినట్లు తెలిపారు. మొదటిసారిగా ఎపిఇఆర్‌సి స్వల్పకాలిక విద్యుత్ అవసరాల గురించి మరింత వాస్తవిక అంచనా కోసం హార్లీ డిస్పాచ్‌ను ద్వారా నిర్ణయించింది. రాష్ట్ర ప్రభుత్వ యాజమాన్యంలోని జెన్‌కోలు దిగుమతి చేసుకున్న బొగ్గును సేకరించేందుకు, ఆర్ఎస్ఆర్ మోడ్ ద్వారా బొగ్గును రవాణా చేసుకునేందుకు అనుమతించినట్లు తెలిపారు.

ఏప్రిల్ 1-2025 నుండి ఇళ్లను నిర్మించుకునే లేదా పునఃనిర్మించే వ్యక్తులు వాణిజ్య టారిఫ్ బదులుగా డొమెస్టిక్ టారిఫ్‌లో బిల్ చేయబడతారని తెలిపారు. స్టాండిబై టారిఫ్‌లు ఇప్పుడు గ్రీన్ ఎనర్జీ ఓపెన్ యాక్సస్ కన్జమర్ మాత్రమే కాకుండా ఓపెన్ యాక్సస్ కన్జమర్స్‌కు వర్తిస్తాయని తెలిపారు. 150 కెడబ్ల్యు వరకు కనెక్ట్ చేయబడిన ఈవి చార్జింగ్ స్టేషన్‌లకు ఎల్‌టి వోల్టేజ్ స్థాయిలో విద్యుత్ సరఫరా చేయడానికి అమోదం తెలిపినట్లు తెలిపారు. డిమాండ్ చార్జీలు లేకుండా ఇవిల టారిఫ్ యూనిట్‌కు రూ.6.70 మాత్రమే వసూలు చేస్తాయని తెలిపారు. డొమెస్టిక్ వినియోగదారుల కోసం అదనపు లోడ్‌లను క్రబద్ధీకరించే పథకాన్ని ఎపిఇఆర్‌సి అమోదించి, ఈ పథకం మార్చి 1నుండి జూన్ 30వరకు అమలులో ఉంటుందని తెలిపారు. అన్‌లైన్ విండో ద్వారా వినియోగదారులు స్వచ్ఛంధంగా అదనపు లోడ్‌లను ప్రకటించవచ్చునని తెలిపారు.

# గ్రూప్-2 మెయిన్స్ నిలుపుదలపై పిటిషన్లను కొట్టివేసిన హైకోర్టు

**విజయవాడ,ఫిబ్రవరి20,ప్రభాతవార్తప్రతినిధి:** ఎపిలో గ్రూప్2 ప్రధానపరీక్ష(మెయిన్స్) ప్రక్రియను నిలువరించాలంటూ పలువురు అభ్యర్థులు దాఖలు చేసిన అనుబంధ పిటిషన్లను రాష్ట్ర హైకోర్టు గురువారం కొట్టేసింది. ప్రస్తుత వాజ్యాలలో కోర్టు ఇచ్చే తుది తీర్పునకు లోబడి గ్రూప్-2 ఫలితాలు ఉంటాయని హైకోర్టు స్పష్టం చేసింది. గ్రూప్-2 నోటిఫికేషన్‌లో మహిళలు, మాజీ సైనిక ఉద్యోగులు, క్రీడాకారులు, దివ్యాంగులకు ప్రత్యేక రిజర్వేషన్ పాయింట్లు కేటాయించడాన్ని సవాలు చేస్తూ పలువురు అభ్యర్థులు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై విచారణ జరిపిన హైకోర్టు ఈ విధంగా తీర్పు వెలువరించింది. ఫిబ్రవరి 23వ తేదీన గ్రూప్-2 మెయిన్స్ పరీక్ష నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో గ్రూప్-2 మెయిన్స్ పరీక్షను నిలువరించాలంటూ పలువురు అభ్యర్థులు ఇటీవల ఎపి హైకోర్టును ఆశ్రయించారు. ఎగ్జిక్యూటివ్, నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీ కోసం ఫిబ్రవరి 23వ తేదీన నిర్వహించనున్న ప్రధాన పరీక్షను నిలుపుదల చేయాలంటూ వేసిన అనుబంధ పిటిషన్లపై న్యాయస్థానం తీర్పును రిజర్వ్ చేసింది.

ప్రధాన వ్యాజ్యాలపై కౌంటర్లు దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సత్తి సుబ్బారెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా రోస్టర్ ఆఫ్ రిజర్వేషన్‌ను ఫిక్స్ చేసి గ్రూప్-2 పోస్టులకు తాజాగా నోటిఫికేషన్ ఇచ్చేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ విశాఖకు చెందిన ఎం. పార్థసారథి, కడపకు చెందిన కనుపర్తి పెంచలయ్యతోపాటు మరో ఇద్దరు హైకోర్టులో వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలు ఇటీవల విచారణకు రాగా పిటిషనర్ల తరఫున న్యాయవాదులు బొద్దులూరి శ్రీనివాసరావు, జీవీ శివాజీ వాదనలు వినిపించారు. ఎపిపిఎస్సీ ఇచ్చిన నోటిఫికేషన్.. రిజర్వేషన్ల అమలుతోపాటు సుప్రీంకోర్టు మార్గదర్శకాలు, ప్రభుత్వ జీవోకు విరుద్ధంగా ఉందన్నారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలు, ప్రభుత్వ జీవోను ఈ సందర్భంగా కోర్టు ముందు ఉంచారు. ఈ నెల 23వ తేదీన జరగనున్న గ్రూప్ 2 ప్రధాన పరీక్షను నిలుపుదల చేస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని వారు కోరారు. అడ్వొకేట్ జనరల్ వాదనలు వినిపిస్తూ ప్రిలిమినరీ పరీక్ష ఇప్పటికే ముగిసిందని, ప్రధాన పరీక్షను నిలువరించ వద్దని హైకోర్టును కోరిన విషయం విధితమే. అలాంటి వేళ.. ఎపి హైకోర్టు ఈ విధంగా తీర్పు వెలువరించింది.

# గ్రూప్-2 పరీక్షలకు భారీ ఏర్పాట్లు

>> కేంద్రాల్లో ఈపరీక్షలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. 23వ తేదీ ఉదయం 10గం.ల నుండి మధ్యాహ్నం 12.30 గం.ల వరకూ పేపర్1 వ్రాత పరీక్ష ఉంటుందని అభ్యర్థులు ఉ.9.30 గం.ల లోపు ఆయా పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని ఉ.9.45 గం.లకు పరీక్షా కేంద్రాల గేట్లను మూసివేయాలని ఆలస్యంగా వచ్చిన ఎవరినీ లోనికి అనుమతించ కూడదని స్పష్టం చేశారు. అదే విధంగా మధ్యాహ్నం 3గం.ల నుండి 5.30 గం.ల వరకూ పేపర్2 పరీక్ష ఉంటుందని అభ్యర్థులు మధ్యాహ్నం 2.30 గం.ల లోగా ఆయా పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని 2.45 గం.లకు ఆ పరీక్షా కేంద్రాలా గేట్లను మూసివేసి ఆతర్వాత ఎట్టిపరిస్థితుల్లోను అభ్యర్థులెవరినీ లోనికి అనుమతించకూడదని ఆమె స్పష్టం చేశారు.పరీక్షల నిర్వహణకు సంబంధించి డిటైల్డ్ ఇన్‌స్ట్రక్షన్లతో కూడిన బుక్ లెట్‌ను అన్ని పరీక్షా కేంద్రాలకు పంపడం జరిగిందని ఆసూచనలన్నీ లైజన్ అధికారులు, చీఫ్ సూపరింటిండెంట్లు, ఇన్విజిలేటర్లు తుచ తప్పక పాటించి పరీక్షలు సజావుగా జరిగేలే చూడాలని చెప్పారు. గ్రూపు2 మెయిన్ పరీక్షలకు సంబంధించి సోషల్ మీడియాలో పరీక్షలు వాయిదా పడతాయని, ఇతర దుష్ప్రచారం జరుగుతోందని అటువంటివేమీ అభ్యర్థులు నమ్మవద్దని ఎట్టి పరిస్థితుల్లోను ఈనెల 23వ తేదీన ఈ పరీక్షలను సజావుగా జరిపేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు చైర్మన్ అనురాధ స్పష్టం చేశారు.పరీక్షల సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు అవకాశం లేనివిధంగా తగిన బందోబస్తు ఏర్పాట్లు చేయాలని కలక్టర్లు, ఎస్పిలకు ఆమె సూచించారు.అలాగే పరీక్షా కేంద్రాలకు 100 మీటర్ల పరిధిలో 144వ సెక్షన్ కింద నిషేధాజ్ఞలు విధించాలని చెప్పారు.అదే విధంగా పరీక్షా కేంద్రాల సమీపంలో పరీక్షల సమయంలో జిరాక్సు,నెట్ కేంద్రాలన్ని మూసి ఉంచాలన్నారు.పరీక్ష హాల్లోకి మొబైల్ ఫోన్లను, ఎలక్ట్రానిక్ వాచీలు తదితర పరికరాలను ఎట్టిపరిస్థితుల్లోను లోనికి అనుతించరాదని తెలిపారు. అంతేగాక అవసరమైన మేర పరీక్షా కేంద్రాల్లో సిసిటివి కవరేజ్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని చైర్మన్ అనురాధ కలక్టర్లకు సూచించారు.

రాష్ట్ర సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేశ్ కుమార్ మీనా మాట్లాడుతూ పరీక్షల సమయంలో ఎక్కడైనా సోషల్ మీడియా లేదా ఇతర ప్రచార మాధ్యమాల్లో నకిలీ వార్తలు ప్రసారం చేస్తే వెంటనే స్పందించి పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని కలక్టర్లకు సూచించారు.అలాంటి వార్తలపై వెంటనే స్పందించి కౌంటర్ చేయడం తోపాటు తప్పుడు లేదా నకిలీ వార్తలు ప్రసారం చేస్తే అలాంటి వారిపై చట్ట పరంగా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈసమావేశంలో రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి కె.శశిధర్,ఆశాఖ కమీషనర్ కృతికా శుక్ల, సమాచారశాఖ డైరెక్టర్ హిమాన్షు శుక్ల,ఎపిపిఎస్సి కార్యదర్శి ఐఎన్ మూర్తి తదితర అధికారులు పాల్గొనగా వర్చువల్‌గా జిల్లా కలక్టర్లు, ఎస్పిలు, సిపిలు,ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## వారం - వర్జ్యం

తేది : 21-02-2025, శుక్రవారం
శ్రీ క్రోధి నామ సంవత్సరం,
మాఘమాసం, ఉత్తరాయణం,
శిశిర ఋతువు, కృష్ణపక్షం,
అష్టమి ఉ.11.59
అనూరాధ ప.3.53
వర్జ్యం : రా.9.54-11.37
దు.ఉ.9.00-9.47
2) మ.12.53-1.40
రాహుకాలం - ఉ.10.30-12.00

## వార్తాఫలం

**మేషం :** పనులలో ఆటంకాలు ఎదురైన అధిగమిస్తారు. చికాకులు ఎక్కువ అవుతాయి.

**వృషభం :** మీ ఊహలు నిజమయ్యే సూచనలు లేవు. ప్రయాణాలు వద్దు.

**మిథునం:** శ్రమపడ్డా ఫలితం దక్కదు. వ్యాపారాలు నిరాశ పరుస్తాయి.

**కర్కాటకం:** కొత్త పనులు చేపట్టి సకాలంలో పూర్తి చేస్తారు. వాహనసౌఖ్యం.

**సింహం:** సంఘంలో ఆదరణ పొందుతారు. ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి.

**కన్య :** వృత్తి, వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. దైవదర్శనాలు.

**తుల :** ముఖ్యమైన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. శుభవార్తలు వింటారు.

**వృశ్చికం:**ముఖ్యమైన నిర్ణయాలలో సొంత ఆలోచనలు శ్రేయస్కరం. ప్రయాణాలు.

**ధనుస్సు:** చిన్ననాటి మిత్రులను కలిసి కష్టసుఖాలను పంచుకొంటారు.

**మకరం:** దూరప్రాంతాల నుండి వచ్చిన సమాచారం ఆనందం కలిగిస్తుంది. వాహనయోగం.

**కుంభం :** కుటుంబంలో బాధ్యతలు పెరిగినా సమర్థవంతంగా నిర్వహిస్తారు. శుభవార్తలు.

**మీనం :** వృత్తి వ్యాపారాలలో ఆటుపోట్లు ఎదురైన పట్టుదలతో అధిగమిస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



## గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో ఆచార్య యార్లగడ్డ భేటీ

**విజయవాడ ఫిబ్రవరి 20 ప్రభాతవార్త ప్రతినిధి:**ఆంధ్రప్రదేశ్ గవర్నర్ మాననీయ సయ్యద్ అబ్దుల్ నజీర్ ను రాజ్య సభ పూర్వ సభ్యులు, విశ్వ హిందీపరిషత్తు జాతీయ అధ్యక్షులు, పద్మభూషణ్ అచార్య యార్లగడ్డ లక్ష్మి ప్రసాద్ మర్యాద పూర్వకంగా కలిసారు. గురువారం విజయవాడ రాజ్ భవన్ లో జరిగిన భేటీ సందర్భంగా యార్లగడ్డ తాజాగా రచించిన అక్కినేని కా విరాట్ వ్యక్తిత్వ హిందీ, డోనాల్డ్ ట్రంప్ అంగ్ల పుస్తకాలను గవర్నర్ కు బహుకరించారు. అక్కినేని కా విరాట్ వ్యక్తిత్వ పుస్తకాన్ని ఇటీవల ప్రధాని నరేంద్ర మోడీ అవిష్కరించిన విషయం విదితమే. ఈ సందర్భంగా యార్లగడ్డ మాట్లాడుతూ విశ్వవిద్యాలయాల ఉపకులపతుల నియామకంలో రాష్ట్ర పభుత్వం అనుసరించిన విధానం అభినందనీయమని, కులపతి హోదాలో గవర్నర్ అమలు చేసిన తీరు అందరి ప్రశంసలు అందుకుందని గవర్నర్ నజీర్ కు వివరించారు. రాజకీయాలకు అతీతంగా ప్రతిభకు పట్టం కడుతూ ఉప కులపతుల నియామకం జరిగిందన్నారు. విశ్వవిద్యా లయాను ప్రక్షాళన చేసే దిశగా ప్రతిభకు పట్టం కట్టారని ప్రశంసించారు. వివిధ విశ్వవిద్య లయాలు, ప్రత్యేకించి ఆంధ్రా విశ్వవిద్యా లయంలో నెలకొన్న క్రమ శిక్షణా రాహిత్యంపై దృష్టి సారించాలని యార్లగడ్డ గవర్నర్ కు విన్నవించారు. రాష్ట్రంలో హిందీ ప్రచారం, సాహిత్య సృజనల వికాసాన్ని వివరిస్తూ అలూరు భైరాగి, అచార్య ఆదేశ్వరరావుల కవితలను వైఎల్పి వినిపించారు. ఆంధ్రప్రదేశ్ కు సర్ అర్థర్ కాటన్ అందించిన సేవలు సైతం వీరి మధ్య చర్చకు వచ్చాయి.

## పాఠశాలలో వేడి పాలు పడి విద్యార్థి గాయపడిన ఘటనపై మంత్రి సవిత ఆందోళన!



**విజయవాడ,ఫిబ్రవరి 20,ప్రభాతవార్తప్రతినిధి:** కొండపి ఎంజేపీ బాలుర పాఠశాలలో వేడి పాలు పడి విద్యార్థి గాయపడిన ఘటనపై రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని, సిబ్బంది నితంతరం అప్ర మత్తంగా ఉండాలని, విద్యార్థుల భద్రత పట్ల బాధ్యతతో మెలగాలని గురుకులం కార్యదర్శి మాధవీలతను ఫోన్లో ఆదేశించారు. గురువారం ఉదయం కొండపి ఎంజేపీ బాలుర పాఠశాలలో అయిదో తరగతి చదువున్న మధుమోహాన్ పాలు తాగడానికి కిచెన్ రూమ్ కు వెళ్లాడు. పాలు తాగి వస్తున్న క్రమంలో పక్కన టేబుల్ పై ఉన్న వేడి పాలుతో ఉన్న గిన్నె దొర్లి మధుమోహాన్ పై పడిపోయింది. దీంతో బాలుడి చాతి కింద, పొట్ట భాగంలో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే బాలుడిని ఒంగోలు కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి ఇన్చార్జి అంకిరెడ్డి బాలునికి వైద్య సేవలందించారు. ఘటన జరిగిన వెంటనే ఎంజేపీ ఇన్చార్జి వార్డెన్ స్రవంతి బాలుని తల్లిదండ్రులకు సమాచారమందించారు. ఈ విషయం తెలుసుకున్న వెంటనే మంత్రి సవిత.గురుకులం కార్యదర్శి మాధవీలతతో ఫోన్ లో మాట్లాడారు. బాలుని ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. బాలుని ఆరోగ్యం నిలకడగా ఉందని, తీవ్ర గాయాలు కావడంతో మరో మూడు రోజుల పాటు వైద్యుల పర్యవేక్షణలో ఉంచుతున్నట్లు వెల్లడించారు. దీనిపై మంత్రి సవిత స్పందిస్తూ, బాలునికి మెరుగైన వైద్యమందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎప్పటికప్పుడు బాలుని ఆరోగ్యంపై వివరాలు అందివ్వాలని స్పష్టంచేశారు. వేడి పాలు ఉన్నచోట హాస్టల్ నిర్వాహకులు, సిబ్బంది లేకపోవడంపై మంత్రి సవిత ఆగ్రహం వ్యక్తంచేశారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతమైతే హాస్టల్ సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి సవిత హెచ్చరించారు.స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర సాంఘిక సంక్షేమ మంత్రి డొక్కా బాలవీరాంజనేయులతోనూ మంత్రి సవిత మాట్లాడారు. ప్రమాదం జరిగిన విషయం తెలిసిన వెంటనే మంత్రి బాలవీరాంజనేయులు ఒంగోలులోని కిమ్స్ ఆసుపత్రికి వెళ్లి విద్యార్థిని పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి, విద్యార్థికి మెరుగైన వైద్యమందించాలని ఆదేశించారు. ఎంజేపీ స్కూల్లో జరిగిన ఘటనపై మంత్రి సవితకు మంత్రి బాలవీరాంజనేయులు సమాచార మందించారు. విద్యార్థి ఆరోగ్య పరిస్థితి గురించి మంత్రి సవిత అడిగి తెలుసుకున్నారు.

## 'గర్భాలయ శిఖర కలశాలు అపవిత్రం'

### ధర్మకర్తల మండలి మాజీ అధ్యక్షుడు అంజూరు తారక శ్రీనివాసులు



**శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 20 ప్రభాతవార్త** శ్రీకాళహస్తీశ్వరాలయం గర్భాలయ కలశాలు అపవిత్రం జరిగిందని మాజీ ధర్మకర్తల మండలి అంజూరు తారక శ్రీనివాసులు ఆరోపించారు. గురువారం ఆయన మాట్లాడుతూ 2022లో కూడా ఇలా జరిగి గందరగోళం మారిందన్నారు. కుంబాభిషేకాల సమయంలో అర్చకులు కలశాలకు అభిషేకించటానికి తప్ప మరెప్పుడు తాకలేదన్నారు.

గర్భాలయ శిఖరాలపై ఏదైనా చేయాలంటే సంప్రదాయబద్దంగా ఆగమ నిబంధనల ప్రకారం చేయాలని అలా కాకుండా చేస్తే చేదు అనుభవాలు ఎదుర్కొన్నారని శ్రీనివాసులు ఆరోపించారు. 2020లో ఏం జరిగిందో ఆలయాధికారులు గుర్తించుకోవాలన్నారు.ఇప్పటికైనా అధికారులు జరిగిన పొరబాటును గుర్తించి సరిదిద్దాలన్నారు.

## విధుల పట్ల నిర్లక్ష్యం వహించే వైద్యులు, సిబ్బందిపై వేటు తప్పదు

### - రాష్ట్ర ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ మంత్రి వాసంశెట్టి సుభాష్



**సచివాలయం,ఫిబ్రవరి 20,ప్రభాతవార్త :** కార్మికులకు ఉచితంగా ఉత్తమ వైద్య సేవలు అందజేయాలనే లక్ష్య ంతోనే ఈఎస్ఐ ఆస్పత్రులను ఏర్పాటు చేయడం జరిగిందని,అయితే అటు వంటి లక్ష్యానికి విఘాతం కల్పించే విధంగా ప్రవరి ్తంచే వైద్యులు,సిబ్బందని ఏమాత్రం ఉపేక్షించబోమని రాష్ట్ర కార్మిక,ఫ్యాక్టరీలు,బాయిలర్ ్స,ఇన్సూ రెన్స్ మెడికల్ సర్వీసెస్ శాక మంత్రి వాసంశెట్టి సుభాష్ హెచ్చరించారు.రాజమండ్రి ఇఎస్ఐ వైద్యులు,సిబ్బంది విధుల పట్ల చూపుతున్న నిర్లక్ష్య వైఖరినీ స్వయంగా గమనించిన తదుపరి 5గురు వైదు ్యలను,4గురు ఔట్‌సోర్సి ంగ్ సిబ్బందిన సస్పెండ్ చేయడం జరిగిందన్నారు.గురువారం రాష్ట్ర సచివాలయం పబ్లిసిటి సెల్లో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాటా ్లడుతూ రాజమండ్రి ఈఎస్ఐ వైదు ్యలు,సిబ్బంది విధులపట్ల చూపుతున్న నిర్లక్ష్య వైఖరిదోరణి వల్ల ఆస ్పత్రిలో ఓపి గరిష్టంగా 50కూడా లేదని,అయితే వీరిని సస్పెండ్ చేసిన తదుపరి ఓపి 170కి పెరిగిందనే విషయాన్ని ఆయన స్పష్టంచేశారు.తిరుపతి ఇఎస్ఐ వైద్యులు విదుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపడం వల్ల ఆ ఆస్పత్రిలో చాలా మంచి వైద్యసేవలు అందజేయడం జరుగుతుందని తద్వారా అక్కడ ఓపి దాదాపు 350దాకా ఉందన్నారు.గత ప్రభుత్వం ఈఎస్ఐ లను పూర్తిగా నిర్లక్ష్యం చేయడం జరిగిందని,కాకినాడ ఈఎస్ఐ ఆస్పత్రిని కేంద్రప్రబుత్వానికి అప్పగించిందన్నారు.

రాష్ట్రంలోని కారి ్మకుల భద్రతకు,సంక్షేమానికి ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం అత్యదిక ప్రాదాన్యతను ఇస్తుందని,ప్రస్తుతం ఉన్న 78డిస్పెన ్సరీలకు అదనంగా మరో 18డిస్పెన్స రీలను తమ ప్రబుత్వం మంజూరు చేయడం జరుగుతుందన్నారు.తమ ప్రభుత్వం ఏర్పడిన 9నెలల కాలంలోనే అమరావతిలో 500పడకల ఈఎస్ఐ సెకండరీ కేర్ ఆస్పత్రితో పాటు ఇఎస్ఐ మెడికల్ కళాశాలను మరియు 150పడకల సూపర్ స్పెషాలీటి ఆస్పత్రిని ఏర్పాటు చేసే ప్రతిపాదనలను ఇఎస్ఐసి డైరెక్టర్ జనరల్‌కు పంపడం జరిగిందన్నారు.తిరుపతి ఈఎస్ఐని 50పడకల నుంచి 100పడకల సామర్ధ్యానికి పెంచే చర్యలు చేపట్టామన్నారు.తద్వారా 97రెగ్యూలర్ పోస్టులు,94ఔట్‌సోరి ్సంగ్ పోస్టులు మంజూరు చేయడం జరిగిందన్నారు.కార్మికుల భద్రతను దృష్టిలో ఉంచుకొని విశాఖ ఫార్మాసిటీలో సిఎస్ఆర్ నిధులతో మొబైల్ ఐసి యూనిట్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. సమావేశంలో ఇఎస్ఐ సంచాలకులు ఆంజనేయులు పాల్గొన్నారు.

## బాలికల రక్షణ కోసం ఆద్య పేరిట సరికొత్త కార్యక్రమం

### - రాష్ట్రంలోనే తొలిసారి నసనకోట ఎంజెపి పాఠశాలలో ప్రారంభం
### - ఎమ్మెల్యే పరిటాల సునీత, ఎస్ఐ సుధాకర్ ఆధ్వర్యంలో వినూత్న కార్యక్రమం




కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

**అనంతపురం, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త బ్యూరో** బాలికల శక్తిని తెలియజేస్తూ సమాజంలో జరుగుతున్న పరిణామాలపై అవగాహన కల్పించే విధంగా రాష్ట్రంలో తొలిసారి శ్రీ సత్యసాయి జిల్లా పోలీసులు ఆద్య అనే కార్యక్రమాన్ని తీసుకొచ్చారు. రామగిరి ఎస్సై సుధాకర్ యాదవ్, ఎమ్మెల్యే పరిటాల సునీత ఆధ్వర్యంలో తొలిసారిగా ఈ కార్యక్రమాన్ని నసనకోట ఎంజెపి పాఠశాలలో ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ రత్న, ట్రైనీ కలెక్టర్ వినూత్న, ఇతర అధికారులు, మేధావులు హాజర య్యారు. ముఖ్యంగా బాలికలు చదువుకునే సమయంలో తీసు కోవాల్సి న జాగ్రత్తలు, ప్రేమ, వ్యామోహాలు, సోషల్ మీడియా వంటి వాటికి ఆకర్షితులు కాకుండా అవగాహన కల్పించే విధంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పరిటాల సునీత మాట్లాడుతూ.. బాలికలపై ఎవరైనా కనెన్నెత్తి చూడాలంటే భయపడే విధంగా రాష్ట్రంలో పోలీసులు కీచకులను ఎన్కౌంటర్ చేయాలని విజ్ఞప్తి చేశారు. బాలికలు చిన్న వయస్సులోనే ప్రేమ ఇతర వాటిపై ఆకర్షితులు కాకుండా ఉండాలన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అనుక్షణం తమ పిల్లల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జిల్లా ఎస్పీ రత్న మాట్లాడుతూ.. సెల్‌ఫోన్ అన్నది అరచేతిలో అద్భుతమని, అదే మీకు శాపంగా మారకుండా చూసుకోవాలన్నారు. టెక్నాలజీని మంచి కోసం ఉపయోగించాలన్నారు. బాలికల రక్షణ కోసం పోలీసులు అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటున్నారని, సైబర్ క్రైమ్ డ్రగ్స్ వంటి వాటిపై పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ట్రైనీ కలెక్టర్ వినూత్న మాట్లాడుతూ.. తల్లిదండ్రులు ఎంతో నమ్మకంతో అమ్మాయిలను చదివిస్తుంటారని వారి నమ్మకాలను వమ్ముచేయకుండా మీరు చదువుకోవాలన్నారు. ఒక్కరు తప్పు చేసినా ఆ ప్రభావం మొత్తం మీ పాఠశాల, గ్రామాలపై పడుతుందని ఆమె అన్నారు.

## వల్లభనేని వంశీ కస్టడీ, హెల్త్ పిటిషన్లపై ముగిసిన వాదనలు

**విజయవాడ ఫిబ్రవరి 20 ప్రభాతవార్త ప్రతినిధి:** వైకాపా నేత, మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ కస్టడీ హెల్త్ పిటిషన్లపై వాదనలు ముగిశాయి. ఈ రెండు పిటిషన్లపై ఎస్సీ ఎస్టీ కోర్టు శుక్రవారం తీర్పు వెలువరించనుంది. వంశీతో పాటు మరో ఇద్దరి కస్టడీ పిటిషన్లపైనా న్యాయస్థానం తీర్పు ఇవ్వనుంది. గన్నవరం తెదేపా కార్యాలయంపై దాడి కేసులో వంశీ ముందస్తు బెయిల్ పిటిషన్‌పై ఏపీ హైకోర్టు కొట్టివేసిన విషయం తెలిసిందే. దళిత యువకుడు సత్యవర్ధన్ కిడ్నాప్ దాడి కేసులో ఇటీవల వల్లభనేని వంశీని పోలీసులు అరెస్ట్ చేశారు. ప్రస్తుతం ఆయన విజయవాడలోని జిల్లా జైలులో ఉన్నారు.

## యూట్యూబర్ హత్య కేసును ఛేదించిన పోలీసులు

### - ప్రభుత్వ భూవివాదమే హత్యకు కారణం
### - వివరాలు వెల్లడించిన డిఎస్పి శ్రీనివాస్



అరెస్ట్ అయిన ముద్దాయిలను చూపుతున్న పోలీసులు

**గుంతకల్లు, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త** గత ఐదు రోజుల క్రితం జరిగిన యూట్యూబర్ భోగాల తిరుమలరెడ్డి హత్య కేసును పోలీసులు ఛేదించారు. ప్రభుత్వ భూమి వివాదమే హత్యకు కారణమని తెలిపారు. ఈ మేరకు గురువారం కసాపురం పోలీసుస్టేషన్ ప్రాంగణంలో డిఎస్పి శ్రీనివాస్ వివరాలు వెల్లడించారు. మండలంలోని సంఘాల గ్రామానికి చెందిన ముద్దాయి జీవన్‌కుమార్ తనకున్న నాలుగు ఎకరాల పొలం పక్కనే వున్న ఒక ఎకరం ప్రభుత్వ భూమిని సాగు చేసుకుంటున్నాడని తెలిపారు. బివిఆర్ న్యూస్ టుడే యూట్యూట్ ఛానెల్ నిర్వహిస్తున్న తిరుమలరెడ్డి ప్రభుత్వ భూమిని ఎలా సాగు చేసుకుంటావని అభ్యంతరం తెలిపాడని పేర్కొన్నారు. భూమిని సాగు చేసుకుంటున్న విషయాన్ని తహశీల్దార్‌కు ఫిర్యాదు చేసి డబ్బులు డిమాండ్ చేశాడన్నారు. దీంతో ఇద్దరి మధ్య వివాదం పెరిగి పెద్దదైందన్నారు. తిరుమలరెడ్డిని అడ్డు తొలగించుకోవాలని భావించిన జీవన్‌కుమార్ అదే గ్రామానికి చెందిన బోయ రామాంజనేయులు, కసాపురం గ్రామానికి చెందిన బోయ రామన్నల సహాయంతో ఈనెల 17వతేదీ ఉదయం 7.45 గంటల సమయంలో సొంత పొలానికి బైకుపై వెళుతున్న తిరుమలరెడ్డిని ట్రాక్టర్‌తో బలంగా గుద్ది హంద్రీనీవా కాలువలో పడవేశారన్నారు. మృతుని భార్య కామేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముద్దాయిలను గురువారం అరెస్ట్ చేసి వారి వద్ద నుండి ఒక ట్రాక్టర్, మోటర్‌సైకిల్, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించామని డిఎస్పి తెలిపారు. ఈ సమావేశంలో రూరల్ సిఐ ప్రవీణ్‌కుమార్, ఎస్ఐ టిపి వెంకటస్వామి, సిబ్బంది పాల్గొన్నారు. కేసు ఛేదింపులో ప్రతిభ చూపిన హెడ్‌కానిస్టేబుల్ వెంకటేష్, కానిస్టేబుళ్లు జాఫర్, కిషోర్‌కుమార్, రాఘవేంద్ర, నాగేశ్వరరావు, అంజి, నూర్‌అహ్మద్‌లను డిఎస్పి అభినందించారు.

## శివరాత్రి సందర్భంగా శ్రీశైలానికి ప్రత్యేక బస్సు

**విజయవాడ ఫిబ్రవరి 20 ప్రభాతవార్త ప్రతినిధి:** మహాశివరాత్రి సందర్భంగా రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శ్రీశైలానికి ప్రత్యేక బస్సు నడువుతున్నట్లు ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శేషగిరిరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని భక్తులు ఉపయోగించుకోవాలని సూచించారు. 18 సీట్లున్న మినీ ఏసీ బస్సు ఈ నెల 25న సాయంత్రం ఆరింటికి రాజమహేంద్రవరంలో బయలుదేరుతుందని పేర్కొన్నారు. అదే రోజు రాత్రి 9 గంటలకు విజయవాడ బెర్మ్‌పార్కు హోటల్ వద్దకు చేరుతుందని వివరించారు. పదింటికి మళ్లీ బయలుదేరి 26న ఉదయం శ్రీశైలం చేరుకుంటుందని పేర్కొన్నారు. అక్కడి పర్యాటకాభివృద్ధి సంస్థ హోటల్‌లో అల్పాహారం, మధ్యాహ్నభోజన సదుపాయం కల్పిస్తున్నట్లు ఈడీ వివరించారు. టిక్కెట్ ధర పెద్దలకు రూ.4360 పిల్లలకు రూ.3490గా నిర్ణయించినట్లు తెలిపారు. దర్శనం అనంతరం బస్సు తిరుగు ప్రయాణంలో త్రిపురాంతకం మీదుగా 27న తెల్లవారుజామున రెండింటికి విజయవాడ, ఉదయం ఆరింటికి రాజమహేంద్రవరం చేరుకుంటుందని ఈడీ వివరించారు. వివరాలకు 9848629341, 9848007025 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

## పింఛన్ల వెరిఫికేషన్ పారదర్శకం

### - రాష్ట్ర ఎంఎస్‌ఎంఇ, సెర్ఫ్ మంత్రి కొండపల్లి శ్రీనివాస్



**సచివాలయం,ఫిబ్రవరి 20,ప్రభాతవార్త :** రాష్ట్రంలో దివ్యాంగుల పించన్ల వెరిఫికేషన్ ఎంతో పారదర్శకంగా జరుగుతుందని రాష్ట్ర ఎమ్ఎస్ఎంఈ,సెర్ఫ్,ఎన్నారై ఎంపవర్‌మెంట ్ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు.గురువారం రాష్ట్ర సచివాలయం పబ్లిసిటీ సెల్లో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ రాష్ట్రంలో దాదాపు 8లక్షల దివ్యాంగులకు సామాజిక భద్రతా ఫించన్లు పంపిణీ చేయడం జరుగుతుందని,ఇందులో ఇప్పటివరకు 1.20లక్షల పింఛన్లు వెరిఫి కేషన్ పూర్తయినట్లు తెలిపారు.గతంలోని నియమ నిబంధల ప్రకారమే ఈ ఫించన్ల వెరిఫికేషన్ జరుగుతుందని,అర్హులైన ఏ ఒక్కరికి ఎటువంటి అన్యాయం జరగదన్నారు.ఒక జోన్‌లోని వైద్యులు మరో జోన్‌లో వెరిఫికేషన్‌ను ఎంతో పారదర ్శకంగా నిర్వహించడం జరుగుతుందన్నారు.ఎమ్ఎస్ఎంఈ ల సర్వే కూడా ముమ్మరంగా సాగుతున్నందని, ఇప్పటివరకు 50శాతం మేర సర్వే పూర్తయిందని,ఈసర్వేకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తుది గడువు నిర్ణయించినట్లు మార్చి 15కల్లా ఈ సర్వే పూర్తవుతుందని ఆయన తెలిపారు.

## హాబీట్రాట్స్ ట్రస్ట్ గ్రాంట్ 8వ ఎడిషన్‌కు దరఖాస్తులు ఆహ్వానం

**విజయవాడ, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త :** పర్యావరణ పరిరక్షణ, సామాజిక, సాంకేతిక అంశాలపై ఇంటర్ డిసిప్లినరీ పరిశోధనలను ప్రోత ్సహించే లక్ష్యంతో భారత దేశ సహజ ఆవాసాలు, స్వదేశీ జాతులను రక్షించడానికి స్వలాభాపేక్ష లేని తాము ఈ ఏడాది ది హాబీటాట్స్ ట్రస్ట్ గ్రాంట్స్ 8వ ఎడిషన్‌ను ప్రారంభిస్తున్నట్లు హాబీటాట్స్ ట్రస్ట్ అధిపతి రుషికేష్ చవాన్ ప్రకటించారు. ఈనెల 15 నుండి మార్చి 17 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని, ఫైనల్ వివరాలు అక్టోబర్ 2025లో వెల్లడిస్తామన్నారు.

## ఉద్యోగ, ఉపాధ్యాయుల బకాయిలు చెల్లించాలి

### నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్

**విజయవాడ, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త :** రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు రు.25వేలకోట్ల బకాయిల చెల్లింపులపై ప్రభుత్వం వెంటనే ప్రకటన చేయాలని నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. అసోసియేషన్ రాష్ట్రాధ్యక్షులు కరణం హరికృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాగంటి శ్రీనివాసరావులు గురువారం విడుదల చేసిన ప్రకటన ద్వారా తమ డిమాండ్లను తెలిపారు. రాజధానితో పాటు 26 జిల్లా కేంద్రాల్లో రు.500కోట్లతో వెంచర్లు వేసి సబ్సిడీపై ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇళ్ళస్థలాలు కేటాయించి వారి స్వంతింటి కల నెరవేర్చాలన్నారు. ఒక్కొక్క ఉద్యోగికి రు.3 నుండి రు.5లక్షల మేర ప్రభుత్వం బకాయి వుందని , డిఏ బకాయిలు నగదు రూపంలో చెల్లించాల్సి న నగదుతో కలిపితే మరింత పెరుగుతుందని వీటి చెల్లింపుపై ప్రభుత్వం వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో తక్షణ నిర్ణయం తీసుకుని న్యాయం చేయాలన్నారు. ప్రభుత్వం ఉద్యోగి అనుమతితో ఆ బకాయిలను 30శాతం సబ్సి డపై ఇళ్ళస్థలాలను కేటాయించడం ద్వారా స్వంతింటి కల నెరవేర్చాలన్నారు.

## ముంబయిలో పర్యటించిన మంత్రి నారాయణ, సిఆర్డీయే కమిషనర్ కూనపరెడ్డి కన్నబాబు

**విజయువాడ,ఫిబ్రవరి20,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో రాజధాని అమరావతి పాటు,కీలక నగరాల అభివృద్ధి లక్ష్యం రాష్ట్ర పురపాలక శాఖా మంత్రిత్వ శాఖ కీలక చర్యలు చేపట్టింది.ఈ క్రమంలో ముంబయి నగరానికి వెళ్ళారు.అక్కడ మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్మెంట్ అధారిటీ(ఎంఎంఆర్‌డిఏ ), సిడ్కో అధికారులతో మంత్రి నారాయణ, సీఆర్డీయే కమిషనర్ కూనపరెడ్డి కన్నబాబులుఇతర అధికారులు సమావేశమయ్యారు.ఎంఎంఆర్‌డిఏప్లానింగ్ డైరెక్టర్ శంకర్ దేశ్ పాండే,ఇతర విభాగాల అధికారులుముంబయి అభివృద్ధిలో కీలక పాత్ర వహిస్తున్న ఎంఎంఆర్‌డిఏముంబయి లో రోడ్లు,మెట్రో రైలు,హౌసింగ్ ప్రాజెక్టులు చేపడుతున్న ఎంఎంఆర్‌డిఏరోడ్ల అభివృద్ధి,మెట్రో రైలు ప్లానింగ్,రవాణా ప్రణాళికలు, ఇళ్ల నిర్మాణం,రీజినల్ డెవలప్మెంట్,నిధుల సమీకరణ పై మంత్రి నారాయణకు ముంబై అధికారులు వివరించారు.ముంబయి మహానగరంలో విదేశీ పెట్టుబడుల సహకారంతో మౌలిక వసతులను అభివృద్ధి చేస్తున్న విధానాన్ని మంత్రి కి వివరించిన లీలీళిదీతి అధికారులుప్రభుత్వ ప్రాజెక్టుల కోసం నిధుల సమీకరణ చేస్తున్న విధానాలు అడిగి తెలుసుకున్న మంత్రిముంబై మహానగర అభివృద్ధి లో ఎంఎంఆర్‌డిఏ తీసుకుంటున్న విధానాలను ఏపీలోని నగరాల అభివృద్ధికి అనుసరించే ఆలోచనలో మంత్రి నారాయణ ఉన్నారు.

## రాజశేఖరం మృతి పార్టీకి తీరని లోటు

### - పాలవలస కుటుంబ సభ్యులను పరామర్శించిన జగన్

**పాలకొండ (మన్యం జిల్లా), ఫిబ్రవరి 20 ప్రభాతవార్త** మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ పాలవలస రాజశేఖరం మృతి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు అని ఆయన తాము పెద్ద దిక్కును కోల్పోయామని ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్సార్ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం మన్యం జిల్లా పాలకొండ పట్టణంలోని పాలవలస రాజశేఖరం ఇంటికి వచ్చిన సందర్భంగా రాజశేఖరం భార్య రేగిడి మండలం జెడ్పీటీసీ పాలవలస ఇందుమతిని, ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించారు. రాజశేఖర్ మృతి వార్త నన్ను కలచి వేసింది అన్నారు. తండ్రి సమానుడు తాను పార్టీలో



ఎదుగుదలకు నా వెంట నడిపించారని జగన్మోహన్‌రెడ్డి గుర్తు చేసుకున్నారు. మరణ వార్త తెలియగానే దిగ్భ్రాంతికి గురయ్యానని అన్నారు. నా తండ్రికి కూడా ఉత్తరాంధ్రలో ఆప్తుడు ఎవరైతే ఉన్నారంటే అది రాజశేఖర్‌ని గుర్తు చేసుకున్నారు. దూరంగా ఉండడం వలన రాలేకపోయానని రాజశేఖరం కుటుంబానికి తాను ఎల్లప్పుడూ అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా రాజశేఖరం భార్య ఇందుమతిని కుమార్తె పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి, కుమారుడు ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌బాబులను పరామర్శించి వారితో కొద్దిసేపు మాట్లాడారు. అనంతరం పాలవలస రాజశేఖరం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. జగన్మోహన్‌రెడ్డి ప్రత్యేక హెలికాప్టర్‌లో పాలకొండ సమీపంలో మధ్యాహ్నం 2 గంటలకు హెలికాప్టర్‌లో దిగారు. ఈ సందర్భంగా శ్రీకాకుళం పార్వతీపురం, విజయనగరం జిల్లాల నుంచి మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎంపీలతో పాటు మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, మాజీ ఉప ముఖ్యమంత్రి పాముల పుష్పశ్రీవాణిలు జగన్మోహన్‌రెడ్డికి స్వాగతం పలికారు. పాలవలస విక్రాంత్‌బాబు ఇంటికి సుమారు రెండు కిలోమీటర్లు రోడ్‌షోలో జగన్మోహన్‌రెడ్డి వచ్చారు. దారి పొడుగునా జగన్మోహన్‌రెడ్డిని చూడడానికి మండలంలోని చట్టుప్రక్కల గ్రామాల నుంచి ప్రజలు తండోప తండాలుగా వచ్చారు. ముఖ్యంగా రాజశేఖరం ఇంటి వద్ద వివిధ కళాశాల విద్యార్థులు, రైతులు తమ సమస్యలను వివరించేందుకు బార్లు తీరారు. జగన్‌ను చూసిన ఆనందంలో జై జగన్ జైజగన్ అంటూ నినాదాలు చేశారు. ప్రజల కేరింతలను చూసి కాన్వాయ్ నుంచి బయటకు వచ్చిన జగన్ దారి పొడవునా ప్రజలకు అభివాదం చేసుకుంటూ ముందుకు వెళ్లారు. ప్రస్తుతం ఈ ప్రాంతంలో ఎన్నికల కోడ్ ఉన్నప్పటికీ దాన్ని ఉల్లంఘించారని తెలుస్తోంది. ముఖ్యంగా జగన్మోహన్‌రెడ్డి రోడ్‌షోలో దారి పొడుగునా జగన్ జగన్ అంటూ నినాదాలు వినిపించాయి. ముఖ్యంగా జగన్మోహన్‌రెడ్డి ప్లేకార్డులు జెండాలు కనిపించాయి జగన్మోహన్‌రెడ్డి పర్యటనలో పాల్గొన్న ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌కు ప్రజల్లో మంచి క్రేజ్ ఏర్పడింది. పాలవలస ఇంటి నుంచి బయటకు వచ్చిన దువ్వాడ శ్రీనివాస్‌ను ప్రజలు ముఖ్యంగా యువత చుట్టుముట్టి సెల్ఫీలు దిగారు.

## మహాకుంభమేళాలో ఇస్రో మాజీ చైర్మన్ సోమనాథ్ పుణ్యస్నానం



**శ్రీహరికోట (తడ), ఫిబ్రవరి 20 ప్రభాతవార్త** భారత అంతరిక్ష పరిశోధన సంస్థకు చంద్రయాన్-3తో గఘన కీర్తిని కట్టబెట్టిన ఇస్రో మాజీ చైర్మన్ ఎస్.సోమనాథ్ ఆధ్యాత్మికతపరంగాను ఇతరులకు ఆదర్శంగా నిలిచారు. అంతరిక్ష పరిశోధన సంస్థ చైర్మన్, డిఓఎస్ అధ్యక్షునిగా అత్యంత ఉన్నత పదవుల్లో ఉన్నప్పుడు కూడా ఆయన పదేపదే ఆధ్యాత్మిక భావాలు వెలిబుచ్చేవారు. సంస్కృత భాషలోనూ కొంత పట్టున్న సోమనాథ్ దక్షిణ భారతదేశంలో పేరెన్నిక కలిగిన పలు ఆలయాలను సందర్శించి ఉన్నారు. గత నెలలో ఇస్రో చైర్మన్‌గా పదవీ బాధ్యతలు విరమించిన తర్వాత ఆధ్యాత్మికతపరంగా మరింత చొరవ చూపిస్తున్నారు. చైర్మన్‌గా ఉన్నప్పుడు అధికారదర్పం ఎలాగో ఉంటుంది. ప్రస్తుతం ఆయన సాధారణ పౌరుడిగా ప్రయాగరాజ్ త్రివేణి సంగమ తీరంలో కొంతసేపు పడవ కోసం నిరీక్షించి అనంతరం పుణ్యస్నానం ఆచరించారు. మహాకుంభమేళాలో సోమనాథ్‌ని చూసిన భక్తులు ఆయన సాదాసీదాగా ఒక చిన్న బ్యాగు పట్టుకొని నిరీక్షించడాన్ని ఆశ్చర్యపోయారు. ప్రస్తుతం సోమనాథ్ ప్రయాగరాజ్ తీరంలో పడవ కోసం నిరీక్షించడం, పుణ్నస్నానం చేయడం వంటి ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో విరివిగా కనిపిస్తున్నాయి. భారత అంతరిక్ష పరిశోధన సంస్థకు గొప్ప విజయాలను అందించిన శాస్త్రవేత్త ఇంత సాధారణంగా వ్యవహరించడాన్ని చూసి అక్కడి భక్తులు, సందర్శకులతో పాటు ఈ దృశ్యాలను తిలకించిన వారు కూడా ఆయనను మరింత గౌరవభావంతో చూస్తున్నారు. భారత శాస్త్ర సాంకేతికరంగంలోని ఒక గొప్ప వ్యక్తిత్వాన్ని ఇది ప్రతిబింబించిందని కొందరు అభిప్రాయపడుతున్నారు.

వార్త


జీవితంలో విజయం సాధించడానికి మనిషికి తెలివితేటలు ఉండి అవకాశాలు వచ్చినంత మాత్రాన చాలదు. ఏకాగ్రత, లక్ష్యసిద్ధి అవసరం.

న-సి.డబ్ల్యు.వెండెల్

# 'ప్రక్షాళన' మొదలు!

దేశంలో నదులన్నీ జీవనదులే. నదీ స్నానాలకు విశేష ప్రాధాన్యత ఉంది. పర్వదినాలప్పుడు భక్తులు ఎంతో పవిత్రంగా భావించే ఆ నదుల్లో పుణ్యస్నానాలాచరిస్తుంటారు. పన్నెండేళ్లకోసారి ఆయా నదులకు పుష్కరాలూ జరుపుతుంటారు. ప్రస్తుతం మహాకుంభమేళాలో పవిత్ర స్నానాల కోసం జనం తండోపతండాలుగా వచ్చి వెళ్తున్నారు. ఒకరోఇద్దరో కాదు తాజా లెక్కల్ని బట్టి 57కోట్ల మంది స్నానం చేసి వెళ్లారు. అంతటి అమృత స్నానాలు కారణంగా గంగా, యమున, సరస్వతి నదులను త్రివేణి సంగమ పవిత్ర భూమిగానే కొలుస్తాం. కానీ నదీ జలాలు అనేక కారణాల చేత కాలుష్యంతో నిండిపోయాయి. పర్యావరణ శాస్త్రజ్ఞులు వీటి విషయంలో జాగ్రత్తలు చెబుతూనే ఉంటారు. నదులు తమ సహజ స్వరూపస్వభావాలను కోల్పోవడం తెలిశాక వాటి సంరక్షణ విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సంకల్పించిన ప్రభుత్వాలు వాటి మీద పలు కారణాల వలన శ్రద్ధ చూపించలేకపోయాయి. నదుల్లో కాలుష్యం నియంత్రించలేని స్థాయికి చేరుకున్నదని ఏనాడో గుర్తించారు. ఒక అడుగు ముందుకు పడలేదు. ఆయా నదుల్లో మురుగు నీటి ప్రవాహాల వలన కశ్మల కాసారాలుగా పేరుకుపోతున్నాయి. ఇదే పరిస్థితి దేశ వ్యాప్తంగా తారసిల్లుతోంది. పారిశ్రామిక వ్యర్థజలాలే కాదు, ప్లాస్టిక్‌తో కూడిన చెత్తకూడా చివరకు చేరేది ఈ నదీ తీరానికే. నదుల్లో కాలుష్య నియంత్రణకు కేంద్ర జలశక్తి మంత్రిత్వశాఖ ప్రత్యేకించి నడుం కట్టిన సందర్భాలు లేవు. జాతీయ హరిత ట్రిబ్యునల్ కూడా అనేక కేసుల్లో వీటి విషయాన్ని ప్రస్తావిస్తూనే ఉన్నది. గోదావరి, కృష్ణా జలాల్లో సైతం తీసుకున్న జలనమూనాలన్నీ విష లోహాలతో నిండిఉన్నట్లు నివేదికలొచ్చాయి. ఆర్సెనిక్, నికిల్, కాడ్మియ, క్రోమియం వంటి రసాయనిక పదార్థాలు కలిసి ఉన్న ఈ జలాల వలన వాటిని తాగునీరుగా వాడే జనానికి అనారోగ్యహేతువవుతున్నాయి. దేశంలోని 187 నదుల్లో నీరు అత్యంత కాలుష్యాన్ని మోసుకెళ్తున్నట్లు చెప్పుకుంటారు. గంగానదిలోకి ఉత్తరాదిన దాదాపు అన్ని ప్రధాన పట్టణాల నుంచి రోజూ 300కోట్ల లీటర్లకు పైగా మురుగునీరు వచ్చి చేరుతోందని అంచనా. విష రసాయనాలు, క్రిమిసంహారక మందులు, ఇవిగాక పశు కళేబరాలు, మృతదేహాలు కూడా ఈ నదుల్లో కలిసిపోతుండడం వల్ల పవిత్ర నదులుగా భావించే మనం తీరా స్నానం చేస్తే ఎలాంటి అనారోగ్యాలు దరిచేరతాయో ననే భయం పట్టుకుంటోంది. అందుకే నదీజలాలు తాగునీటిగా ఉపయోగపడవనే అభిప్రాయం ప్రజల్లోకి బలంగా వచ్చేసింది. నదీ కాలుష్యం గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే. ఇటీవలనే చేసిన అధ్యయనాన్ని బట్టి గంగానది ఇప్పుడు నీటిలో మలసంబంధిత బ్యాక్టీరియా నిండిపోయింది. కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డు ఈ నెల 3న సమర్పించిన నివేదికను బట్టి ఈ నది నీటి నాణ్యత స్నానానికి పనికిరాదు. హరిద్వార్‌లోనూ గంగానది కలుషితమైంది. 1986లో కేంద్రప్రభుత్వం గంగానది శుద్ధికోసం 'నమామి గంగే' ప్రాజెక్టు ప్రారంభించింది. వేలాది కోట్లు ఖర్చుచేసినా సత్ఫలితాలు సాధించ లేకపోయారు. అమెరికా, యూరప్ వంటి పశ్చిమదేశాల్లో నదులను అత్యంత శుభ్రంగా ఉంచుకోవడం మనకు తెలిసిన విషయమే. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం బాగా పెరిగిన రోజుల్లో కూడా మురుగునీటి శుద్ధి పారిశుధ్య సంరక్షణ వంటి విషయాల్లో వెనుకబడి ఉన్నామనే మన కార్యాచరణలో లోపముందన్నది తేటతెల్లం. ఆ నేపథ్యంలోనే యమునా నదీ కాలుష్యస్థాయిలు నానాటికీ పెరిగిపోయా యని పెద్ద చర్చేసాగుతోంది. నిన్నమొన్నటి ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో కూడాయమునా నది కాలుష్యం గురించిప్రచారంజరిగింది. ప్రధాన పోటీ లో ఉన్న ఆప్, భారతీయ జనతాపార్టీలు యమునా నదీ జలాలు ప్రక్షాళనపై విసుర్లు కూడా విసురుకున్నాయి. కానీ చివరకు 'యమునా నది ప్రక్షాళన' తాము చేస్తామంటే తాము చేస్తామని హామీలు ఇచ్చాయి. కేంద్ర ప్రభుత్వం అండదండలు లేకుండా ఇలాంటి మహత్తర కార్యక్రమాలు చేయడం కష్టసాధ్యం. అయినా 'ఆప్' కూడా ఆ పాటే పాడింది. 2020లోనే ఆమ్ ఆద్మీపార్టీ ఢిల్లీ పీఠం ఎక్కినా కేంద్రప్రభుత్వంతో వైరంతో యమునా నదిప్రక్షాళన ఊసేఎత్తలేదు. ఏమైతేనే పాలకులుఎవరైనా, ఏపార్టీ వారైనా ప్రక్షాళన అవసరమేనని ఒప్పుకున్నారు. అనుకున్నట్లుగానే ఈ నెల 16 నుంచి యమునా నది శుద్ధిపనులను కేంద్ర ప్రభుత్వం చేపట్టింది. నిత్యం పారిశ్రామిక వ్యర్థాలు, 3 కోట్లకుపైగా జనాభా ఉన్న ఢిల్లీ ప్రాంతాల నుంచివస్తున్న మురుగు కూడా దీనిలోనే కలుస్తాయి. 4అంచెల ప్రణాళిక తో ముందుకు వెళ్తోంది. కొత్త ప్రభుత్వం ఏర్పడకుండానే ఢిల్లీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో పనులు మొదలయ్యాయి. యమునా నది ఉత్తరాఖండ్ హిమాల యాలను దాటి హర్యానా, యుపి సరిహద్దుల మీదుగా ప్రవహించి ఢిల్లీకి చేరుకుంటుంది. ప్రస్తుతానికి ఈ 57 కిలో మీటర్ల మేర పనులు పూర్తి చేస్తారు. ఢిల్లీని దాటితే మధుర ఆగ్రాల ప్రాంతంలో కూడా నదీజలాలు కాలుష్యమే. నదిశుభ్రం కోసం క్లీనింగ్ ఆపరే షన్ మొదలెట్టారు. ట్రాష్ స్కిమ్మర్లు, వీడ్ హార్వెస్టర్‌లు, డ్రెడ్జి యుటిలిటీ యూనిట్లతో నదిని శుభ్రం చేస్తున్నారు. సుందరీకరణ, కాలుష్యం కలిగించే వ్యర్థాల తొలగింపు జరుగుతోంది. మురుగునీటితో పేరుకుపోయిన మేటలను డ్రెడ్జింగ్ యంత్రాలు తొలగిస్తాయి. ఆ తర్వాత సీవరేజి ట్రీట్‌మెంట్ ప్లాటులను ఏర్పాటుచేయిస్తారు. ఏమయితేనేం ఢిల్లీ విషయంలో కేంద్రం ఓ ముందడుగు వేసింది. దేశవ్యాప్తంగా ఉన్న ఇతర నదుల్లో కాలుష్యం తొలగించేందుకు కూడా యుద్ధప్రాతిపదికపై నడుం కట్టాల్సిన ఆవశ్యకత ఉంది.

కష్టతరమైన పనిని చేసే వ్యక్తి, అప్పగించబడిన పనిని చాలా బాగా చేసే వ్యక్తి ఎన్నటికీ తన ఆత్మగౌరవాన్ని కోల్పోడు.



జార్జి బెర్నార్డ్ షా

మీరు గౌరవాన్ని కోరుకుంటే, ముందు మిమ్మల్ని మీరు గౌరవించుకోవాలి. మీ అనుమతి లేనిదే మిమ్మల్నెవరూ చిన్నచూపు చూడరు.



శామ్యూల్ జాన్సన్

# ప్రజావాక్కు



## కుల భావజాలానికి కాలం చెల్లింది!

వైకాపానేత, పులివెందుల శాసనసభ్యులు జగన్ మోహన్ రెడ్డి తన విజయవాడ పర్యటనలో చంద్రబాబు నాయుడుకి తన సామాజిక వర్గానికి చెందిన వారు ఎదగటం ఇష్టం ఉండదంటూ ఒక వ్యర్థప్రేలాపన చేశారు. వల్లభనేని వంశీని అరెస్టు చేస్తే న్యాయ పోరాటం చేయవచ్చు. జగన్ అందుకు అన్నివిధాలా సహాయ పడవచ్చు. ఇక్కడ కుల ప్రస్తావన అసంబద్ధం, దివాళా కోరు రాజకీయాలకు పరాకాష్ట! గతంలో కులాలమధ్య చిచ్చుపెట్టి రాజకీయ లబ్ధి పొందారు. వైకాపా పాలనలో బిటెక్ రవి గారిని కూడా వేధింపులకు గురిచేశారు. మరి ఇదే నీతిసూత్రం అప్పుడు కూడా వర్తించాలి కదా? ఇదే భావజాలం కొనసాగితే వచ్చే ఎన్నికల్లో ఆ పదకొండు స్థానాలు కూడా రావు.

-గరిమెళ్ల రామకృష్ణ, ఏలూరు, ఏలూరు జిల్లా

## ఎస్జీటీ ఉపాధ్యాయులకు పరీక్షల విధులు వద్దు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రాథమిక పాఠశాల్లో అధిక భాగం స్కూళ్లలోఒకరు లేక ఇద్దరుఎస్జీటీ ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. ఈఎస్జీటీ ఉపాధ్యాయులకు మార్చి, ఏప్రిల్ నెలల్లోఇంటర్మీడియట్ పరీక్షలఇన్విజిలేషన్ డ్యూటీలు, పదవ తరగతి పరీక్షల ఇన్విజిలేటర్ స్పాట్ వాల్యూయేషన్ విధులు కేటాయిస్తున్నారు. అందువల్ల ప్రాథమిక పాఠశాలలు సింగిల్ టీచర్స్ స్కూల్స్ అవుతున్నాయి. దీంతో ఆయా ప్రాథమిక పాఠశాలల్లో విద్యా బోధనకు ఆటంకం కలుగుతున్నది. రాబోవురోజుల్లో ఎస్జీటీ ఉపాధ్యాయులను పదవ తరగతి పబ్లిక్ పరీక్షల విధులకు ఉపయోగించడం వల్ల ఆయా ప్రాథమిక పాఠశాలల్లో విద్యాబోధనకు ఆటంకం కలుగుతుంది. కాబట్టి పదవ తరగతి పరీక్షల ఇన్విజిలేటర్ డ్యూటీ, స్పాట్‌వాల్యూయే షన్ డ్యూటీల నుంచి ఎస్జీటీ ఉపాధ్యాయులను మినహాయించాలి.

- వాసిలి సురేష్, నెల్లూరు జిల్లా

## మాదకద్రవ్యాల నియంత్రణ ఎక్కడ?

మాదకద్రవ్యాల సమస్య రోజురోజుకు తీవ్రతరమై యువతరాన్ని నిర్వీర్యం చేస్తుంది. మాదకద్రవ్యాల మత్తులో పడి నిండు నూరేళ్ల జీవితాలను చిత్తు చేసుకుంటున్నారు. వీటిని సేవించడంవల్ల కలిగేదుష్ఫలితాలను చిన్నవయసు నుంచే పసిపిల్లలకు వివరించి చెప్పాలి. పాఠశాలలో వీటి దుష్ఫలితాలను గురించి స్పష్టంగా బోధించాలి.

- తూలుగు రమణారావు, అక్కరాపల్లి

## కుంభమేళా భక్తుల జేబుకు చిల్లు

మహా కుంభమేళా ఫిబ్రవరి 26న వచ్చే శివరాత్రితో ముగియనుంది. ఈ క్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు ప్రయాగ్ రాజ్ తరలివెళ్తారు. విమాన మార్గంలోనూ పెద్ద సంఖ్యలో భక్తులు వెళుతున్నారు. ఈడిమాండ్‌ను ఆసరాగాచేసుకుని విమానయాన సంస్థలు భక్తుల జేబుకు చిల్లులు పెడుతున్నాయి. సాధారణ రోజుల్లో రూ.5000 నుండి రూ. 10,000 లోపు ఉండే చార్జీలను ఏకంగా రూ.30 వేలకు పైనే వసూలు చేస్తున్నాయి. ఈ వారం ఆరంభంలో ప్రయోగ్ రాజ్ నుండి బెంగుళూరు ప్రయాణానికి ఓ ప్రయివేటు విమాన కంపెనీ ఒక్కొక్కరికి రూ. 39,146 వసూలు చేసింది. సాధారణంగా రూ.10 వేల లోపు ఉన్న విమాన చార్జీలను కుంభమేళా సమయంలో బెంగుళూరుకు రూ.22వేల వరకు వసూలు చేశాయి. తాజాగా ఈ చార్జీలు మరింత దంచుకోవడం పై భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంలో వెంటనే కేంద్ర విమాన మంత్రిత్వ శాఖ ట్రావెల్స్ ఏజెన్సీలపై చర్యలు తీసుకొని విమాన చార్జీలను తగ్గించే విధంగా చేయాలని ప్రయాణికుల విన్నపం.

-దాసం వెంకటరెడ్డి, బెంగుళూరు

## భారత్,బంగ్లా సంబంధాలు

షేక్ హసీనాకు ఆశ్రయం ఇవ్వడం వల్ల బంగ్లా కొంత మనకు దూరం జరిగిన పాకిస్థాన్‌తో అంటకాగడం వల్ల వచ్చే లాభం ఏమి ఉండదు భారత్‌లోద్వారా స్కింతయారీలో అమర్త్యసేన్‌తో పాలుపంచుకున్న మహమ్మద్ యూనిస్ పాలకుడుగా బంగ్లాలో నివసించే మైనారిటీలకు ముఖ్యంగా హిందువులకు ఏమాత్రం విశ్వాసం కలిగించిన దాఖలాలు లేవు అదే అతి పెద్ద విషాదం. అయితే భారత్‌కు బంగ్లాకు సాంస్కృతిక సంబంధాలు కూడా ఉన్నాయి. అంత మాత్రమే కాదు భారత్ బంగ్లా మధ్య కుషియారానది రహీంపూర్ కాలువ సంబంధాలు కూడా ఉన్నాయి. కావున ఆ దిశగా భారత్ బంగ్లా అడుగులు పటిష్టంగా ఉండాలి.

-భారత అవినాష్, జనగామ

## ప్రజల అవసరాలు పట్టించుకోండి

గ్రామాల్లో పాఠశాల, వైద్య శాల, పార్కు, గ్రంథాలయం, పబ్లిక్ టాయిలెట్స్ వంటి మౌలిక వసతులు ఉన్నప్పుడే గ్రామం సమగ్రా భివృద్ధి చెందుతుంది. ప్రభుత్వాలు ఇంటి పన్ను వసూలు చేస్తూ కనీస సౌకర్యాలు కల్పించడం లేదు. రాజకీయ పార్టీలు ఓట్ల కోసం ఉచితబియ్యం, బస్సు, రైతుబంధు వంటి పథకాలు ప్రకటిస్తూ ప్రజల అవసరాలను మాత్రం విస్మరిస్తున్నాయి.

- పుట్లూరి రాంనర్సింహారెడ్డి, నల్లగొండ జిల్లా

మనవి ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# తెలుగు భాషా సంస్కృతులను పరిరక్షించాలి

***ఈ తరం విద్యార్థులకు తెలుగు ప్రాచీన వైభవం, సంస్కృతి సంప్రదాయాల పట్ల కనీస అవగాహన లేకుండా పోతున్నది. దేశ భాషలందు "తెలుగు లెస్స" అన్న నానుడి దేశ భాష లందు "తెలుగు లెస్" అనే దురవస్థకు రాబోతోంది. తెలుగు ప్రజలు తమ మాతృభాషను కాపాడుకుంటూ ప్రపంచమంతా విస్తరించారు. ప్రపంచ వ్యాప్తంగా తెలుగు మాట్లాడేవారు 15 కోట్ల దాకా ఉంటారని ఒక అంచనా. 2011 జనాభాలెక్కల ప్రకారం భారతదేశంలో దాదాపు 9కోట్లమంది తెలుగు మాట్లాడే వారున్నారు. వాస్తవానికి తెలుగు మాధ్యమాన్ని పూర్తిగా నిర్వీ ర్యంచేస్తున్నది తెలుగుజాతి. తెలుగుకు పట్టిన ఈ 'తెగులు' ఈనాటిది కాదు. కాలక్రమేణ, అవిభక్త ఆంధ్రదేశం పూర్తిగా మారిపోయి ప్రస్తుతం ఆంగ్ల దేశంగా రూపుదిద్దుకుంటోంది. అజంతాలతో ఉండటం వలన ఇటాలియన్ ఆఫ్ ద ఈస్ట్ అని సంబోధించబడిన, అద్భుత భాష అంతరించి పోకుండా మరల జవసత్వాలని అందించాల్సిన అవసరం ఉంది.***

రామ కిష్టయ్య సంగన భట్ల

ఒక సమాజపు సంపూర్ణ జీవన విధానమే ఆ సమాజపు సంస్కృతి. సంస్కృతి అంటే సంస్కరించినది అని అర్థం. ఆ సమాజంలో పాటించే ఆచారాలు, పద్ధతు లు, సంప్రదాయాలు, వస్త్రధారణ, భాష, మతం, ఆటలు, విశ్వాసాలు, కళలు, జీవన విధానం, అన్నీ సంస్కృతిలోని భాగాలే. తెలుగు సంస్కృతి, సాంప్రదాయాలకు వేలాది ఏళ్ల చరిత్ర ఉంది. ప్రాచీన అర్ష విద్యా సభ్యతా సంస్కృతులకు ఆలవాలమైన భారతావనిలో తెలుగు సంస్కృతికి విడదీయ రానిది బంధం అనుబంధం ఉన్నాయి. తెలుగు సంస్కృతి లో భాగమై నానాటికీ అనాదరణకు గురవుతున్న తెలుగు భాష పునర్ వైభవానికి కృషి సల్పాల్సిన సమయం ఆసన్న మైంది. విదేశాల్లో తెలుగు వికాసానికి ఎనలేని కృషి జరుగు తుంటే, ఉభయ తెలుగు రాష్ట్రాల్లో కనుమరుగయ్యే ప్రమా దంలో పడింది. బతుకు తెరువు కోసం ఆంధ్ర ప్రాంతం నుంచి మారిషస్‌కు వెళ్లినవ్యవసాయ కూలీలు 185 సంవ త్సరాలుగా తమ మాతృభాష అయిన తెలుగు భాషను పరిరక్షిస్తూనే ఉన్నారు. 12.5 లక్షలకు పైగా జనాభాలో లక్ష మందికి పైగా తెలుగువాళ్లు ఉండగా తమ వారసు లకు, భావితరాల వారికి, తెలుగు భాషలో సాధికారికతను సాధించి పెట్టేందుకు కృతనిశ్చయంతో, తెలుగుభాషా మాధ్యమంలో పాఠశాలలు నిర్వహింప చేసుకుంటూ తమ పిల్లల్ని తమ మాతృభాషలోనే చదివించడం గొప్పలలో కెల్లా గొప్ప. అక్కడ తెలుగు వారికోసం చాలా సంస్థలున్నాయి. ఉత్స వాల్లో అందరూ తెలుగులోనే మాట్లాడే ప్రయత్నం చేస్తారు. మారిషస్ అధికారిక టీవీ ఛానెల్లో కూడా వారానికి ఒక తెలుగు సినిమా వేస్తారు. డీడీ యాదగిరి ఛానెల్ మారిషస్‌లో వస్తుంది. ప్రాథమిక స్థాయి నుంచి విశ్వవిద్యాలయ స్థాయి వరకూ తెలుగు నేర్చుకునే అవకాశాలు ఉన్నాయి. మారిషస్ యూనివర్సిటీ లో తెలుగులో డిప్లొమా, డిగ్రీ కోర్సు లున్నాయి. అంతేకాకుండా, మారిషస్ తెలుగు మహాసభ, తెలుగు సాంస్కృతిక కళానిలయం, తెలుగు సాంస్కృతిక నిలయం, తెలుగు భాషా సంఘం వంటి సంస్థలు అక్కడ తెలుగు భాషను, సంస్కృతిని కాపాడటానికి ప్రయత్నిస్తున్నాయి. ఆస్ట్రేలియాలో తెలుగు భాషా వికాసం కోసం చాలాకాలంగా అనేక సాహిత్య, సాంస్కృతిక సంస్థలు కృషి చేస్తూ భావితరాలకు బాటలు వేస్తున్నాయి. 'తెలుగుమల్లి' సాహిత్య మాసపత్రిక, 'భువన విజయం' వంటి సాంస్కృతిక సంస్థలు ఈక్రమంలో తెలుగు ప్రజల అస్తిత్వానికి ప్రతీకలుగా నిలిచాయి. తెలుగు భాషకు ఆస్ట్రేలి యాలో అరుదైన గౌరవం లభించింది. అక్కడి పాఠశాలల్లో తెలుగును ఐచ్ఛిక అంశంగా చేరుస్తూ ఆస్ట్రేలియా ప్రభుత్వం కీలక ఆదేశాలిచ్చింది. దీంతో ప్రాథమిక, మాధ్యమిక పాఠ శాలల్లో ఇకపై పన్నెండో తరగతి వరకు తెలుగు భాషను నేర్చుకునే అవకాశం కలిగింది. ఇందుకు ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్, సిడ్నీ, విక్టోరియా, న్యూసౌత్ వేల్స్, క్వీన్స్ లాండ్, సౌత్ ఆస్ట్రేలియా మొదలైన రాష్ట్రాల్లోని తెలుగు వారి పిల్లలకు ఒకటో తరగతి నుంచి పన్నెండో తరగతి వరకు తెలుగు ఐచ్ఛికంగా ప్రాథమిక, మాధ్యమిక పాఠశాలల్లో చదువుకొనే అవకాశం కలగనుంది. అమెరికాలో తెలుగు భాషకు గౌరవం దక్కింది. డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం అమెరికాలో ప్రజలకు సమాచారం అందించేందుకు అధికారిక భాషగా తెలుగు భాషను గుర్తించింది. యూఎస్ ఆధారిత ఇమ్మిగ్రేషన్ స్టడీస్ ఇటీవలి అధ్యయనం తెలుగును యుఎస్‌లో వేగంగా అభివృద్ధి చెందుతున్న భాషగా చూపిస్తుంది. ఇది గత ఏడు సంవత్సరాలలో 86శాతం పెరిగింది. 2020లో అమెరికా అధ్యక్ష ఎన్నికలు నవంబర్



3న జరగగా, ఆ ఎన్నికల్లో ఓటరు బ్యాలెట్ పేపర్‌లోని అధికారిక భాషల జాబితాలో తెలుగు భాష కూడా చేర్చారు. ఇటీవలే సద్గురు ఘంటసాల ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ట్రస్ట్, వంశీ ఇంటర్నేషనల్ ఇండియా, సాంస్కృతిక కళాసారథి సింగపూర్ సంయుక్త ఆధ్వర్యంలో తానా, వంగూరి ఫౌండేషన్, యునైటెడ్ కింగ్డ మ్ తెలుగు అసోసియేషన్, సీపీ బ్రౌన్ తెలుగు సమాఖ్య (లండన్), దక్షిణాఫ్రికా తెలుగు సాహిత్య వేదిక, తెలుగు మల్లి ఆస్ట్రేలియా, తెలుగు అసోసియేషన్ సిడ్నీ, న్యూజిలాండ్ తెలుగు అసోసియేషన్, హాంగ్ కాంగ్ తెలుగు సమాఖ్య, వేగేశ్న ఫౌండేషన్ వారి సంయుక్త నిర్వహణలో కళాప్రపూర్ణ, పద్మభూషణ్, సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత దేవులపల్లి కృష్ణశాస్త్రి 123వ జయంతి సందర్భంగా మొట్టమొదటి ప్రపంచ సంగీత సాహిత్య సమ్మేళనం అత్యంత వైభవంగా నిర్వహించారు. అంతేకాదు మొట్టమొదటి ప్రపంచ సంగీత సాహిత్యసమ్మేళనం కార్యక్రమానికి వండర్ బుక్ ఆఫ్‌రికార్డ్స్, తెలుగు బుక్‌ఆఫ్ రికార్డ్స్ లో గౌరవ స్థానం దక్కింది. 12 గంటల ఈ నిర్విరామ సంగీత కార్యక్రమాన్ని వేలాదిమంది వీక్షించి, ఆనందించడం సంగీత చరిత్రలో ఒక చెరిగిపోని సంఘటన. ప్రపంచ తెలుగు సాంస్కృతి మహోత్స వంలో దాదాపు 45 దేశాలనుంచి 64 తెలుగు సంఘాలు ఒకే తాటిపైకి వచ్చాయి. తెలుగు చరిత్రలో కనీవినీ ఎరుగని రికార్డ్‌అది. జయహో భారతీయం భారతదేశం, జిజ్ఞాస-భారతదేశం తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా, ఆంధ్రప్రదేశ్ అసోసియే షన్ ఆఫ్ సౌత్ ఆఫ్రికా, ఫ్రాన్స్ తెలుగు అసోసియేషన్, సౌత్ ఆఫ్రికా తెలుగు కమ్యూనిటీ, జర్మనీ తెలుగు అసోసియేషన్, సింగపూర్ తెలుగు సమాజం, తెలుగుఅసోసియేషన్ ఆఫ్‌లండన్, బహరేన్ తెలుగు కళాపరిషత్, తెలుగు వెలుగు జర్మనీ, డెన్మార్క్ తెలుగు అసోసియేషన్, తెలుగు అసోసి యేషన్ ఆఫ్ ఆస్ట్రేలియా, తెలుగు అసోసియేషన్ ఆఫ్‌సౌత్ ఆస్ట్రేలియా, సింగపూర్ తెలుగు కమిటీ, చైనా తెలుగు అసోసియేషన్, తెలుగు అసోసియేషన్ ఆఫ్ స్కాట్లాండ్, తెలుగు అసోసియేషన్ ఆఫ్ కెన్ బెర్రా, కామన్ అసోసియేషన్ ఆఫ్ చైనా, యునైటెడ్ తెలుగు అసోసియేషన్ ఫోరమ్-కువైట్, తెలుగుకళా సమితి కువైట్, ఆస్ట్రేలియా తెలుగుసమితి, ఆస్ట్రేలియా తెలంగాణ స్టేట్ అసోసియేషన్, తెలుగు అసోసియేషన్ ఆఫ్‌సిడ్నీ, సౌదీ తెలుగు అసోసియేషన్, సౌత్‌ఆఫ్రికా తెలుగు కమ్యూనిటీ, తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ సౌత్ ఆఫ్రికా, తెలుగుకల్చరల్ సొసైటీ నార్తైన్ ఐర్లాండ్, తెలుగు కళాసమితి బహరెయిన్, తెలుగు అసోసియేషన్ ఆఫ్ సౌత్ ఇఙ్లాండ్ - న్యూజి ల్యాండ్, తెలుగు బ్యాడ్మింటిన్ క్లబ్ ఆఫ్ కాంటెంబరి - న్యూజిల్యాండ్, తెలుగు కళాసమితి-ఓమాన్, దుబాయ్ తెలుగు అసోసియేషన్, ఖత్తర్ తెలుగు అసోసియేషన్, నార్వే తెలుగు అసోసియేషన్, అమెరికా తెలుగు మహిళ సంఘం లతోపాటు ఆయా దేశాలలో వివిధరాష్ట్రాల తెలుగు అసోసియేషన్స్ భాగస్వామ్యం అయ్యాయి. తెలుగు భాషనునికోలే కొంటి "ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్" అని 1402లోనే ప్రశంసించారు. మొగల్ చక్రవర్తి ఔరంగజేబు అరబ్బీభాషలో తనకు పాఠాలు బోధించి, తన బాల్యం అంతా వృధాపరిచారని, తన గురువుకు రాజ్య బహిష్కరణ లాంటి తీవ్రశిక్ష విధించిన విషయం చరిత్రచెప్తుంది. ఔరంగజేబు తన గురువుకు రాసిన నాటి చారిత్రాత్మక ఉత్తరాన్ని 1910లో కొమర్రాజు లక్ష్మణరావు తెలుగులోకి అనువదించడమే కాక, తనకాలం నాటి ఆంగ్ల మాధ్యమం చదువుల వల్ల భవిష్యత్ తరాలు ఔరంగజేబులాగా మనలను తప్పు పడతాయని హెచ్చరించారు. ఈతరం విద్యార్థులకు తెలుగు ప్రాచీన వైభవం, సంస్కృతి సంప్రదాయాలపట్ల కనీస అవగాహన లేకుండా పోతున్నది. దేశ భాషలందు తెలుగులెస్స అన్న నానుడి దేశ భాషలందు తెలుగు లెస్ అనే దురవస్థకు రాబోతోంది. తెలుగు ప్రజలు తమ మాతృభాషను కాపాడుకుంటూ ప్రపంచమంతా విస్తరించారు. ప్రపంచ వ్యాప్తంగా తెలుగుమాట్లాడేవారు 15కోట్ల దాకా ఉంటారని ఒక అంచనా. 2011 జనాభా లెక్కల ప్రకారం భారతదేశంలో దాదాపు 9కోట్ల మంది తెలుగు మాట్లాడే వారున్నారు. వాస్తవానికి తెలుగు మాధ్యమాన్ని పూర్తిగా నిర్వీర్యంచేస్తున్నది తెలుగుజాతి. తెలుగుకు పట్టిన ఈ 'తెగులు' ఈనాటిది కాదు. కాలక్రమేణ, అవిభక్త ఆంధ్రదేశం పూర్తిగామారిపోయి ప్రస్తుతం ఆంగ్ల దేశంగా రూపుదిద్దుకుంటోంది. అజంతాలతో ఉండటం వలన ఇటాలియన్ ఆఫ్ ద ఈస్ట్ అని సంబోధించబడిన, అద్భుత భాష అంతరించి పోకుండా మరల జవసత్వాలని అందించాల్సిన అవసరం ఉంది. •

# పరీక్షల ఒత్తిడిని తగ్గించుకోవడం ఎలా?


బి.మధుపాళి

మార్చి, ఏప్రిల్ మాసాలు భారత్‌లో వార్షిక పరీక్షల సీజన్‌గా పరిగణించబడుతున్నది. విద్యార్థినీవిద్యార్థులు, తల్లి తండ్రులు, పాఠశాల యాజమాన్యాలు మార్కులు, ర్యాంకుల వేటలో తమ కృషిని కొనసాగిస్తారు. పరీక్ష అంటేనే ఒక రకమైన ఒత్తిడి పెరుగుతుంది. మంచి ఫలితాలు సాధించాలనే ఆశావహ మానసిక ఒత్తిడి లేదా పాజిటివ్ స్ట్రెస్ ఉన్న యువత పరీక్షల్లో ఉత్తమ ఫలితాలను పొందుతారు. పరీక్షలకు తయారు అవుతున్న విద్యార్థులు అతిగా ఆలోచిస్తూ, ఏమవుతుందో అనే అనవసర ఆందోళనలు, తీవ్రమైన నెగెటివ్ ఒత్తిడులు పరీక్షల్లో ఫలితాలను తారుమారు చేస్తాయని తెలుసుకోవాలి. విద్యార్థులపై తల్లితండ్రులు, ఉపాధ్యాయులు, సహచర విద్యార్థుల ప్రభావం కూడా పరీక్షల ఒత్తిడిని పెంచుతుందని గమనించాలి. పరీక్షల్లో తాహత్తుకు మించి అత్యుత్తమ ఫలితాలు సాధించాలని లక్ష్యం పెట్టుకున్నయువతలో 'పరీక్షల ఆందోళన' తారస్థాయికి చేరి ఫలితాలను మరింత ప్రతికూలంగా ప్రభావితం చేస్తాయి. గత పరీక్షల్లో పొందిన మార్కులు లేదా ర్యాంకుల కన్న కొంతైనామెరుగైన ఫలితాలను సాధించాలనే ఆచరణయోగ్య లక్ష్యాలను నిర్దేశించుకోవాలి. మన శక్తి సామర్థ్యాలకు మించి మార్కులు లేదా ర్యాంకులు రావాలని ఆశపడడం వల్ల మన చదువులపైప్రతికూల ప్రభావాలు పడడంతోపాటు గతంకన్న తక్కువ స్థాయిలో ఫలితాలు వస్తాయి. పరీక్షలంటే అనవసర ఆందోళనలు మన శారీరక, భావోద్వేగ ప్రతికూలతలకు దారి తీస్తాయి. ముఖ్యంగా తల్లితండ్రులు, ఉపాధ్యాయులు పిల్లలపై అతిగా ఆశలు పెట్టుకోవడం, సహచరుల ఫలితాలను చూసి ఆత్మన్యూనతకు గురికావడం సాధారణంగా జరుగుతుంది. ప్రతికూల ఒత్తిడిపెరిగిన యువతలో ఏకాగ్రత సడలడం, ఆందోళనలు పెరిగి ఎక్కువ సమయం చదవకపోవడం జరుగుతుంది. పరీక్షలంటే భయం పెరిగిన యువతలో శారీరకంగా అతిగా చెమటలు పట్టడం, వాంతులు, జీర్ణసంబంధ సమస్యలు, గుండెవేగం పెరగడం, శ్వాస మందగించడం, తలనొప్పి, కోపం పెరగడం, అధిక బీపీ, ప్రతికూల ఆలోచనలు వెంటాడడం, భయదాడి (పానిక్ అటాక్) లాంటి అవలక్షణాలన్ని కనిపిస్తాయి. రాబోయే పరీక్షలకు ముందుగానే ప్రణాళికలు తయారు చేసుకొని చదవడం ప్రారంభించాలి. పరీక్షా ఫలితాలపట్ల అనవసర ఆలోచనలు మన ఏకాగ్రతను మింగేస్తాయి. సబ్జెక్టుల వారీగాప్రణాళికలు రాసుకొని ప్రాధాన్యతా క్రమంలో చదవడం మంచిది. చదివిన పాఠాలు ఎంతవరకు గుర్తున్నాయో తెలుసుకోవడానికి స్వయం పరీక్షలు రాయాలి. చదువుతున్న సమయంలో గంట లేదా రెండు గంటలకు ఒకసారి స్వల్ప విరామం తీసుకోవడం, దీర్ఘశ్వాసలు తీసుకోవడం ఏకాగ్రతను మెరుగుపరుస్తాయి. గత పరీక్షలో పొందిన మార్కులకన్న ఎక్కువరావాలనే లక్ష్యాలు మంచి ఫలితాలను ఇస్తాయి. నిన్నటికన్న నేడు మెరుగైతే మనం ప్రగతి బాటన నడిపినట్లే అని నమ్మాలి. మనం చదివేచదువుపై అనవసర ప్రతికూల ఆలోచనలకు స్వస్తిపలకాలి. నా శక్తి వంచన మేరకు చదువుతున్నాను, నేను మంచి ఫలితాలను సాధింగలను, నేను అనుకున్న ఫలితాలు పొందకపోయినా రానున్న పరీక్షల్లో మెరుగు పరుచుకోగలను లాంటి ఆత్మ విశ్వాసాన్ని పెంచే ఆశావహ ఆలోచనలు మన ప్రతిభను పెంచుతాయి. దినచర్యను నిర్ణయించుకొని, మధ్యమధ్య పాలు లేదా టీ లాంటివి తాగుతూ మానసిక ఆరోగ్య పరిరక్షణకు కృషిచేయాలి. చదవడాన్ని వాయిదా వేయవద్దు. చదువుతున్న పాఠంలోని ముఖ్యఅంశాలను అండర్‌లైన్ చేసుకోవడం మంచిది. గ్రాఫ్‌లు, లెక్కలు, డయా గ్రామ్స్, సూత్రాలు, సమీకరణాలు లాంటిఅంశాలను చదివే సందర్భంలో రాసుకుంటూ చదవడంమంచిది. ఒకసారిరాస్తే పదిసార్లు చదివినట్లే అని తెలుసుకోవాలి. ప్రతిరోజు కొన్ని నిమిషాలు శారీరక వ్యాయామానికి కేటాయించండి. పరీక్ష రోజునకనీసం 15, 30 నిమిషాల ముందు పరీక్ష కేంద్రానికి చేరే విధంగా ప్రణాళిక వేసుకోవాలి. పరీక్షకు వెళ్లే ముందు అతిగా తినడం మంచిది కాదు. పరీక్షకు ముందు రోజు సమయానికి నిద్రపోవాలి. సమయానికి చేరలేమేమో అనే ఆందోళనలు మన ఏకాగ్రతకు భంగంకలిగిస్తాయి. పరీక్ష హాలుకు తీసుకుపోవలసిన హాల్‌టికెట్, పెన్నులు, పెన్సిల్‌లు, ఇతర సామాగ్రినిముందుగానే సిద్ధం చేసుకోవాలి. ఒక్కనిమిషం ఆలస్యమైనా పరీక్ష హాల్‌లోకి అనుమతించరని గుర్తుంచుకోవాలి. •

# సామాజిక న్యాయదిశగా వర్గీకరణ అడుగులు

గురం రాంమోహన్ రెడ్డి

సామాజిక సమ న్యాయం దిశగా అడుగులు పడుతున్నాయి. మహోజ్వాలంగా సాగిన ఎం.ఆర్.పి.ఎస్. ఉద్యమం వర్గీకరణ రూపేణ ఫలితాలు అందేందుకు మార్గాలు సుగమవుతున్నాయి. ఎస్సీలకు, ఉపకులాలకు ఎ.బి.సి వర్గీకరణ రూపేణ విద్యా, ఉద్యోగ రంగాల్లో వాటను పొందనున్నారు. తెలంగాణ ప్రభుత్వం షెడ్యూల్డు కులాల రిజర్వేషన్ల వర్గీకరణకు కట్టుబడి వున్నామని అధికారికంగా ప్రకటించింది. ఇచ్చిన మాటకు కట్టుబడి వుండాలన్న సంకల్పంతో జస్టిస్ షమీమ్ అక్తర్ ఏకసభ్య కమీషన్ను నియమించింది. ఎస్సీలోని 59 కులాలు అభిప్రాయాలను ఆలోచనలను మనోగతాన్ని కమీషన్ సేకరించి, నివేదికి రూపొందించి ప్రభుత్వంకు అందజేసింది. ఏక సభ్య కమీషన్ అధ్యయనం చేసి రూపొందించిన నివేదికను రాష్ట్ర కేబినేట్ ఆమోదించి చట్ట సభలైన శాసనసభ, శాసన మండలలో ప్రవేశపెట్టి అధికారిక ప్రకటనను శాసన సభలో ముఖ్యమంత్రి శాసన మండలి ఆర్థికమంత్రి చేసి చర్చకు పెట్టారు. ఉభయ సభల్లో ప్రవేశ పెట్టిన జస్టిస్ షమీమ్ అక్తర్ నివేదికను అధికార పక్షంతోపాటు ప్రధాన రాజకీయ పక్షాలు బి.ఆర్.యస్., బి.జె.పి. ఎం.ఐ.ఎం, సి.పి.ఐ పార్టీల సభ్యులు ససమర్థించారు. ఎస్సీలకు, ఉపకులాలకు, మాలలకు సమన్యాయం దక్కే దిశగా అడుగులు పడటాన్ని అన్ని పార్టీలు స్వాగతించిన విషయం తెలిసిందే. తెలంగాణ ప్రభుత్వం వర్గీకరణ అమలు కోసం చట్టం చేయాలా, ఆర్డినెన్స్ తీసుకురావాలన్న యోచనలో నిమగ్నమైంది. గతంలో షెడ్యూల్డు కులాల రిజర్వేషన్లను ఎ.బి.సి.డిగా వర్గీకరణ చేసి విద్య ఉద్యోగ రంగాల్లో అమలు చేశారు. జస్టిస్ షమీమ్ అక్తర్ ఏకసభ్య కమిషన్ రిజర్వేషన్ల ఎ.బి.సి. మాత్రమే అమలు చేయాలని సూచించింది. 9 శాతం ఎస్సీలకు ఉపకులాలకు (ఎ గ్రూప్) 5 శాతం మాలలు ఇతర ఉపకులాలకు "డి గ్రూప్), 1 శాతం ఉపకులాలకు (సి గ్రూపు) మొత్తం 15 శాతం అమలు చేయాలని సూచించింది. ఎస్సీ జాబితాల్లోని మొత్తం కులాలకు సమన్యాయం దక్కే అవకాశం ఉంది. రాష్ట్ర జనాభాల్లో ఎస్సీలు 61 లక్షల 84 వేల 319 శాతం జనాభా వున్నట్లుగా తెలంగాణ ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన సామాజిక, ఆర్థిక విద్యా, ఉపాధి రాజకీయ సమగ్ర సర్వేలో వెల్లడైంది. మొత్తం తెలంగాణ జనాభలో ఎస్సీల శాతం 17.43 ఉన్నట్లు సర్వేలో తెలింది. సుప్రీమ్ కోర్టు భారత రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పునుఅమలు చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం చకచకగా నిర్ణయాలు తీసుకుంటుంది. ఎస్సీల (59 కులాల) జనాభా, అక్షరాస్యత ఉపాధి, విద్యా, ప్రభుత్వ ఉద్యోగాల నియమాకాలు, ఆర్థిక



స్థితిగతులను అధ్యాయనం చేసిన కమీషన్ రిజర్వేషన్ల వర్గీకరికరించి ప్రభుత్వంకు సిపార్సు చేసింది. కమీషన్ 199 పేజీల నివేదికలో ఎస్సీల్లోని 59 కులాలపై వివరణాత్మక అంశాలను పొందుపర్చి మూడు గ్రూపులుగా విభజించాలని సూచించిన నేపథ్యం వేగంగా ఆచరణ యోగ్యమైన నిర్ణయాలకు తెలంగాణ ప్రభుత్వం ఉపక్రమిస్తుంది. 2011 జనాభా గణన ప్రకారం గ్రూప్లో అత్యంత వెనుకబడి ఎవరు పట్టించుకోని ఎస్.సి. కులాలకు 1 శాతం, గ్రూపు 2లో మధ్యస్థంగా లబ్ధిపొందిన 18ఎస్.సి.కులాలకు 9 శాతం (జనాభాలో 62.748 శాతం) గ్రూపు 3లో మెరుగైన ప్రయోజనం పొందిన 26 ఎస్.సి. కులాలకు 5 శాతం (జనాభాలో 33,963 శాతం) రిజర్వేషన్లు కల్పించనున్నది. కమీషన్ గ్రూపు 1లో బావుర్, బుడజంగం, చలాటి, దక్కలి, జగ్గలి, పంబాద, పంబాలో, వంబండ, మాగ్, మన్నె, మస్తీ, మాంగ్ గరోడి, మాతంగి, మోహాతర్, ముండాల, సంబన్, స్రప్తు కులాలకు 1 శాతం రిజర్వేషన్లు వర్తించనున్నాయి. గ్రూపు 2లోని అరుంధతీయ, బైండ్ల, చమర్, మోచి, మూని, చమర్, రవిదాస్, చమర్ రోహిదాస్, చంచర్, చండాల, డోమ్, ఒంబరా, పైడి, పానో, ఎల్లమ్మ వాడ్లు గోడార్, జాంబువులు, ఎస్సీ మాదిగదాసు, మస్తీక, పామిడి, పంచమ, పరియ ప్రమగర, చిందోల్లు, యాటల, వల్లువన్, ఎస్.సి. కులాలకు 9శాతం రిజర్వేషన్ల అమలుకు ప్రభుత్వం అడుగులు వేస్తుంది. గ్రుపు3లోని ఆది ఆంధ్ర, ఆది ద్రావిడ, అనాముక్, అరేమాల, అర్వమాల, బ్యాగర, చలవాడి, డోర్, ఘాసి, చండి, శల్లీ, గోసంగి, హెలియా, హెలియాదాసరి, మాదాసి కురవ, మదారి కురవ, మహర్, మాల, మాలదాసరి, మాలదాసు, మాల హన్నాయ్ మాల జంగం, మాల మస్తీ, నేతకాని, మాలసన్యాసి, మిత అయ్యల్వార్, పాక్, మోత, రేల్లి కులాలకు 5 శాతం రిజర్వేషన్లు అమలు చేసే అవకాశం ఉంది. రిజర్వేషన్ల పరిధి నుండి క్రిమిలేయర్ను మినహాయించడానికి వర్గీకరణలోని 4వ నంబర్ (డి గ్రూపు) ను సిఫార్సు నుంచి తొలగించేలాని కమీషన్ సిపార్సు చేసిన క్రమమంలో ప్రస్తుతం గ్రూపు1, గ్రూప్2, గ్రూప్3 వర్గాలకు రిజర్వేషన్లు అమలు కానున్నాయి. 1999లో ప్రారంభమైన ఉద్యమ ఆకాంక్షలు నేరవేరడానికి బాటలు పడ్డాయి. ప్రకాశం జిల్లా ఇది మూడిలో ఎం.ఆర్.పి.ఎస్. ఉద్యమం ఆరంభమై మహాజ్వాలంగా గల్లి నుంచి హస్తిన వరకు 32 ఏళ్లపాటు కొనసాగి విజయ తీరాలకు చేరుకోబోతుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వలను కదిలించి, మెప్పించి ఒప్పించి ఎం.ఆర్.పి. ఎస్.ఉద్యమం దళిత బహుజనుల్లో శ్రామికు కులాల్లో ఉద్వేగాన్ని నింపి జయగీతం పాడనున్నది. ఇప్పటికే హర్యానా రాష్ట్ర ప్రభుత్వం గత అక్టోబర్ 19 నుంచి విద్యా ఉద్యోగ రంగాల్లో ఎస్సీ వర్గీకరణను అమలు చేస్తుంది. సుప్రీమ్ కోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పు మేరకు అన్ని రాష్ట్రాల్లో వర్గీకరణ అమలు కొరకు ఎం.ఆర్.పి.ఎస్. ఉద్యమబేరిమోగించనున్నది. •

# ఒటిటిలు 'ఎథిక్స్ కోడ్' పాటించాలి




## స్వీయనియంత్రణ సంస్థలు అశ్లీలకంటెంట్ నిషేధించాలి

### కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వశాఖ ఆదేశాలు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20:** ఇండియాస్ గాట్ లాటెంట్ కార్యక్రమంలో రణ్‌వీర్ అల్హాబాదియా చేసిన వ్యాఖ్యలు దేశంలో తీవ్ర దుమారంరేపాయి. ఈక్రమంలో ఐటి నిబంధనల్లోని కోడ్ ఆఫ్ ఎథిక్స్‌ను ఒటిటిలు, సామాజిక మాద్యమాలు తప్పనిసరిగా పాటించాలనికేంద్రం హెచ్చరించింది. చిన్నారులకు 'ఎ'రేటెడ్ కంటెంట్ అందుబాటులో లేకుండాచూడాలని ఆదేశించింది. సమాచార ప్రసార మంత్రిత్వశాఖ గురువారం ఈ మార్గదర్శకాలు విడుదలచేసింది. ఒటిటి ప్లాట్‌ఫామ్‌లు, సోషల్ మీడియాలోని అశ్లీల అసభ్యకరమైన కంటెంట్‌లపై ఫిర్యాదులు వచ్చాయి. ఐటి నిబంధనల్లోని నైతిక నియమావళిని ఖచ్చితంగా అనుసరించాలని సూచించింది. లేనిపక్షంలో ఆంక్షలు విధించాల్సి ఉంటుందని కూడా ప్రకటించింది. ఆన్‌లైన్ క్యూరేటెడ్ కంటెంట్‌పై సోషల్‌మీడియా తప్పనిసరిగా కేంద్రం చట్టాలను అనుసరించాల్సిందేనని అన్నారు. వయసు ఆధారిత నిబంధనలు విధిగా పాటించాలన్నారు. చట్టంనిషేధించిన కంటెంట్‌ను ప్రసారంచేయ కూడదని నిర్దేశించారు. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌ల కంటెంట్‌ను రెగ్యులేట్ చేయాలని సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలకు కేంద్రం స్పందించింది. స్వీయనియంత్రణ ఉన్న ఒటిటిలు నైతిక విలువలుపాటించాలన్నారు. ఐజిఎల్‌లో పాల్గొన్న ఒక వ్యక్తిని తల్లితండ్రుల గురించి శృంగారంపై ప్రశ్నించడంతో ప్రముఖ యూ ట్యూబర్ అల్హాబాదియాపై తీవ్రనిరసనలు వ్యక్తం అయ్యాయి. ఆతడి వ్యాఖ్యలపై పలువురు పార్ల మెంటు సభ్యులుకూడా తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేసారు.

సమయ్‌రైనాషోలో రణ్‌వీర్ ఈ వ్యాఖ్యలు చేసారు. దీనితో పలు రాష్ట్రాల్లో ఆతడిపై ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. ఇటీవల యూట్యూబర్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తనపై నమోదయిన ఎఫ్ఐఆర్‌లు అన్నింటినీ క్లబ్‌చేయాలని ఒక పిటిషన్‌లో పేర్కొన్నారు. విచారణలో భాగంగా సుప్రీంకోర్టు అల్హాబాదియా వ్యాఖ్యలపై అసహనం వ్యక్తంచేసింది. అశ్లీల కంటెంట్ నియంత్రించేందుకు చర్యలు తీసుకునే ఆలోచన ఉందా అని సుప్రీం కేంద్రాన్ని స్పందిం చింది. దీనిపై వివరణ ఇవ్వాలని నోటీసులుసైతం జారీచేసింది.



# భారత్‌లో టెస్లా తయారీ అన్యాయమే!

## మస్క్ పక్కన ఉండగానే ట్రంప్ వ్యాఖ్యలు

**వాషింగ్టన్, ఫిబ్రవరి 20:** అమెరికా దిగ్గజ విద్యుత్ కార్ల కంపెనీ టెస్లా భారత్‌మార్కెట్‌లోకి ఎంట్రీకి సిద్ధం అవుతోంది. ఇప్పటికే ఈ సంస్థ నియామకాలు, షోరూంల ఏర్పాటుకోసం ప్రయత్నాలు ప్రారంబించింది. అయితే ఈప్రక్రియ ఎంత మాత్రం ట్రంప్‌కు ఇష్టంలేదు. భారత్‌లో టెస్లా ఫ్యాక్టరీ ఏర్పాటుచేయాలనే టెస్లా అధినేత ఎలాన్‌మస్క్ ప్రణాళిక అమెరికాకు అన్యాయం చేయడమే అని అన్నారు. మస్క్ పక్కన ఉండగానే అమెరికా అధ్యక్షుడు ఈ వ్యాఖ్యలుచేసారు. ఇద్దరూకలిసి ఒక టివి ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. భారత్‌లోకి టెస్లా ఎంట్రీ ప్రణాళికలపై ట్రంప్ మాట్లాడారు. ప్రపంచంలోని ప్రతిదేశం అమెరికాను వాడుకోడానికి ప్రయత్నిస్తోందని, సుంకాలతో మానుంచి లబ్దిపొందాలని చూస్తున్నారని అందువల్లనే ఎలాన్‌మస్క్ తన కార్లను విక్రయించడం అసాధ్యం అవుతోందన్నారు. భారత్‌నే చూడండి ఆయన భారత్‌లో ఫ్యాక్టరీ ఏర్పాటుచేసేందుకు సిద్ధం అవుతున్నారు. ఆయన వరకూ అది మంచిదే కావచ్చు. కానీ అమెరికాపరంగా అది చాలా అన్యాయమైన నిర్ణయమని ట్రంప్ అన్నారు.

గతవారం ప్రధానిమోడీతో భేటీని ట్రంప్ గుర్తుచేసుకున్నారు. ఆ సమావేశంలో విద్యుత్ కార్లపై అధిక సుంకాల విషయాన్ని మోడీతో ప్రస్తావించినట్లు తెలిపారు. సుంకాలసమస్యను పరిష్కరించుకోవడంతోపాటు వీలయినంత సత్వరమే వాణిజ్య ఒప్పందంకోసం ఇరుదేశాలు కలిసి పనిచేసేలా నిర్ణయంచామని అన్నారు. ప్రధాని మోడీ అమెరికా పర్యటనలో టెస్లా అధినేతతో భేటీ అయ్యారు. తర్వాత కొన్నిరోజులకే ఈసంస్థ భారత్‌లో నియామకాలుచేపట్టింది. ఈ ఏడాది ఏప్రిల్‌నుంచే అమ్మకాలు ప్రారంభించనున్నది. అయితే కార్ల తయారీపై మాత్రం టెస్లా నిర్ణయాన్ని ప్రకటించలేదు. భారత ప్రభుత్వం నూతన ఈవీ పాలసీని ఆవిష్కరించిన సంగతి తెలిసిందే. కార్లతయారీ సంస్థలుదేశంలో కనీసం 500 మిలియన్ డాలర్లుపెట్టుబడి పెట్టడంతో ఇక్కడ ఫ్యాక్టరీని ఏర్పాటుచేస్తే దిగుమతి సుంకాలను 15శాతానికి తగ్గించేవిధంగా కేంద్రం కొత్తవిధానం తెస్తోంది. దీనితో మస్క్ భారత్‌లో టెస్లా తయారీకి సిద్ధం అవుతున్నారు.



### ఒకప్పటి బహిష్కృతనేత

# ఇపుడు ఢిల్లీ అసెంబ్లీ స్పీకర్

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20:** దేశరాజధాని ఢిల్లీ అసెంబ్లీలో ఒకప్పుడు అసెంబ్లీ మార్షల్స్ బలవంతంగా ఎత్తుకుని బయటకు తీసుకెళ్లిన వ్యక్తి ఇపుడు అదే ఢిల్లీ అసెంబ్లీకి స్పీకర్ అయ్యారు. రోహిణి ఎమ్మెల్యే విజేందర్‌గుప్తాను పార్టీ స్పీకర్‌గా ఎంపికచేసింది. సుమారు పదేళ్లక్రితం అసెంబ్లీనుంచి ఆయన బహిష్కరణకు గురయ్యారు. ఇందుకు సంబంధించిన పాత వీడియోలు ఇపుడు వైరల్ అవుతున్నాయి. 2015లో ఢిల్లీ అసెంబ్లీలో ఆప్ ఎమ్మెల్యే అల్కాలాంబాపై మరో ఎమ్మెల్యే ఓపీ శర్మ వివాదాస్పద వ్యాఖ్యలుచేసారు. దీనితో సభలో ఒక్కసారిగా ఆందోళనలు చెలరేగాయి. ఇందులోపాల్గొన్న బిజెపి ఎమ్మెల్యే అయిన విజేందర్‌గుప్తాను అప్పటి స్పీకరు ఆరోజు సాయంత్రం నాలుగు గంటలవరకూ సభనుంచి బహిష్కరించారు. అయితే బయటకు వెళ్లేందుకు ఆయన నిరాకరించడంతో మార్షల్స్ గుప్తాను భుజాలపై ఎత్తుకుని అసెంబ్లీనుంచి బయటకు తీసుకెళ్లారు. ఇందుకు సంబంధించిన ఫోటోలను ఆయన అభిమానులు ఇపుడు వైరల్ చేస్తున్నారు. ఢిల్లీ అసెంబ్లీ స్పీకర్‌గా తనను ఎంపికచేయడంపట్ల గుప్తా హర్షంప్రకటించారు. హైకమాండ్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## ముడా కేసులో 8వేల పేజీలతో

# లోకాయుక్త 'బి' రిపోర్టు!

**మైసూరు, ఫిబ్రవరి 20:** మైసూరు పట్టణాభివృద్ధి ప్రాధికారసంస్థ (ముడా) కుంభకోణంపై కర్ణాటక లోకాయుక్త ఎస్పీ టిజె ఉదేశ్ గురువారం ఎనిమిది పేజీల తాత్కాలిక బి రిపోర్టును కోర్టులో దాఖలుచేసారు. లోకాయుక్త అధికారుల బృందం ముడా దర్యాప్తునకు సంబంధించిన పత్రాలు నాలుగు బ్యాగ్‌ల్లో ప్రజాప్రతినిదుల కోర్టుకు తరలించారు. ఎస్పీ ఉదేశ్ మాట్లాడుతూ నిబంధనల ప్రకారం దర్యాప్తు జరుగుతోందన్నారు. కోర్టుకు సమర్పించిన పత్రాలు దర్యాప్తునకు సంబందించిన కీలకమూనవన్నారు. ముడా కుంభకోణం కేసులో సిఎం సిద్ధరామయ్యతోపాటు ఆయన భార్యకు లోకాయుక్త క్లీన్‌చిట్ ఇచ్చింది.

ఈ కుంభకోణంలో ఆరోపణలపై ఆధారాలు లేవని దాంతో కుంభకోణాన్ని నిరూపించలేమని పేర్కొంటూ లోకాయుక్త పోలీసులు సామాజిక కార్యకర్త స్నేహమయి కృష్ణకు లేఖరాసారు. ఐపిసి, అవినీతి నిరోధక చట్టం, కర్ణాటక బూసేకరణ చట్టం వంటి అనేక నిబంధనలను లేఖలోప్రస్తావించారు. అక్రమా లకు పాల్పడినట్ల ఎదుర్కొంటున్న సిఎం సిద్ధరామయ్య, ఆయన భార్య పార్వతితోపాటు నలుగురికి వ్యతిరేకంగా ఎలాంటి ఆధారాలు లేవని ఈకేసులో నలుగురు నిందితులపై వచ్చిన ఆరోపణలకు ఆధారాలులేక నిరూపితం కాలేదన్నారు. అభ్యంతరాలు తెలిపేందుకు స్నేహ మయికి వారంరోజులు గడువు ఇస్తున్నట్లు లేఖలో వెల్లడించారు.

కేసులో దర్యాప్తుసాగుతోందన్నారు. కేసులు నలుగురు నింది తులపై చట్టపరమైన చర్యలు సాధ్యంకాదని తుదినివేదికను కోర్టుకు అందించామని ఎస్పీ ఉదేశ్ అన్నారు. లోకా యుక్తపై సామాజిక కార్యకర్త ఫిర్యాదుదారుడు స్నేహ మయి కృష్ణ స్పందించారు. లోకాయుక్తపై ఆయన విమర్శలు కురిపించారు. రాజకీయ నేతలకు రక్షణ కల్పిస్తున్నారన్నారు. లోకా యుక్తపై తనకు సందేహాలునిజమని రుజువు చేసారన్నారు. లోకాయుక్త అధికారులు తమ



ఆత్మలను రాజకీయ నాయకులకు అమ్ముకున్నట్లు వ్యవహరించారని విమర్శించారు. తాను అవసరమైన అన్ని పత్రాలు ఇచ్చినప్పటికీ సిద్ధరామయ్య పార్వతి మల్లిఖార్జనస్వామి దేవరాజ్‌లపై ఎలాంటి ఆధారాలేలేవంటూ బీ రిపోర్టు నుదాఖలుచేయబోతున్నారని ఆరోపించారు.

# జెలెన్‌స్కీ ఒక సక్సెస్‌ఫుల్ కమెడియన్


## ఉక్రెయిన్ అధ్యక్షుడిపై ట్రంప్ వ్యాఖ్యలు వైరల్



**వాషింగ్టన్,ఫిబ్రవరి 20:** ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ ఒక విజయవంతమైన కమెడియన్ అని వ్యాఖ్యానించారు. అంతకుముందే తప్పుడు సమాచారం ఉచ్చులో ట్రంప్ ఉంటున్నారని, తనకు రేటింగ్ తగ్గిందని, ఈసారి ఎన్నికలు లేకుండానే జెలెన్‌స్కీ అధ్యక్షుడు కావాలని కలలు కంటున్నారన్న ట్రూత్‌లో పోస్టుచేసారు. దీనిపై జెలెన్‌స్కీ స్పందిస్తూ రష్యా ఇచ్చిన తప్పుడు సమాచారమే వాస్తవమన్న భ్రమలో ట్రంప్ ఉన్నారని తనకు 57శాతం రేటింగ్ ఉందని ప్రైవేటు ఏజెన్సీలే చెప్పాయని ప్రకటించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ట్రంప్ తప్పుడు సమాచార బబుల్‌లో కొనసాగుతున్నారని చేసిన వ్యాఖ్యలపై అమెరికా అధ్యక్షుడికి కోపం వచ్చింది. ఆయనొక సక్సెస్‌ఫుల్ కమెడియన్ అనిపించుకున్నారని అలాగే కొనసాగుతారని భావిస్తున్నట్లు పోస్టుచేసారు.అంతేకాకుండా రష్యాతో మొదట ఉక్రెయిన్ వివాదాన్ని ప్రారంభించిందని ట్రంప్ చెప్పుకొచ్చారు. 350 బిలియన్ డాలర్లు అమెరికా ఖర్చుచేసినా యుద్ధంలో విజయం సాధించలేకపోతున్నారని ట్రంప్ వ్యాఖ్యా నించారు. అమెరికా లేకుండా రష్యాసేనలను ఢీకొనడం కష్టమేనని గతంలోనే జెలెన్‌స్కీ చెప్పిన సంగతి తెలిసిందే. అమెరికా లేకుండా ఉక్రెయిన్ ఈసమస్యను ఎప్పటికీ పరిష్కరించుకోలేదని ట్రంప్ అన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌చేస్తున్న వ్యాఖ్యలు రష్యాకు మద్దతిచ్చేవిగా ఉన్నాయని, తనకు ఎన్నికల్లో రేటింగ్ నాలుగుశాతంగా ఉందని చేసిన వ్యాఖ్యలు రష్యా ఇచ్చిన తప్పుడు సమాచార మేనన్నారు. మొదట వివాదం తామే ప్రారంభించామని చెప్పడంకూడా విడ్డూరంగా ఉందని రష్యా ఉక్రెయిన్ యుద్ధంలోకి జెలన్‌స్కీ అమెరికాను లాగుతున్నారని ట్రంప్‌చేసిన వ్యాఖ్యలను కూడా ఆయన ఖండించారు. యూరోప్‌కంటే అమెరికా 200 బిలియన్ డాలర్లు వ్యయంచేసిందని, యూరోప్ సొమ్ములకు గ్యారంటీ ఉందని, అమెరికా ఎప్పటికీ వెనక్కి తీసుకోలేదని అన్నారు. ఈ యుద్ధం అమెరికాకంటే యూరోప్‌కే ఎక్కువ ప్రయోజనకరమని వేర్పాటుకు మద్యలో ఒక పెద్ద సముద్రం ఉందన్నారు.

## కుంభమేళాలో స్నానంచేస్తున్న మహిళల విడియోలు సోషల్ మీడియాలో చక్కర్లు

### కేసు నమోదు చేసిన యుపి పోలీసులు



**ప్రయాగ్‌రాజ్, ఫిబ్రవరి 20:** ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న కుంభమేళాకు భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తూనే ఉన్నారు. ఇప్పటివరకు 55కోట్ల మందికి పైగా భక్తులు త్రివేణీ సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించారు. ఈ క్రమంలో కుంభమేళాలో స్నానం చేస్తున్న మహిళా భక్తుల వీడియోలు విక్రయిస్తున్న రెండు సామాజిక ఖాతాలపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ మేరకు యుపి పోలీసు అధికారులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మహిళల గోప్యత, గౌరవానికి భంగం కలిగించే ఇలాంటి వీడియోలను కొన్ని ప్లాట్‌ఫామ్‌లలో అప్‌లోడ్ చేస్తున్నాయి. సోషల్ మీడియా మానిటరింగ్ టీమ్ దీన్ని గుర్తించింది. దీనిపై కొత్వాల్ పోలీస్‌స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో ఆ వీడియోలు అప్‌లోడ్ చేసిన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాను గుర్తించేందుకు మెటా నుంచి వివరాలు కోరినట్లు పోలీసులు వెల్లడించారు. మరోవైపు టెలిగ్రామ్ ఛానళ్లలో ఈ వీడియోలు విక్రయిస్తున్నట్లు మరో కేసు నమోదయింది. వీటిపై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మహాకుంభమేళాకు సంబంధించి అభ్యంతకరమైన, తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేసే సామాజిక మాధ్యమాలపై కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. జనవరి 13న మొదలైన మహా కుంభమేళా కార్యక్రమం ఫిబ్రవరి 26 వరకు కొనసాగనున్న విషయం తెలిసిందే. ఫిబ్రవరి 26 నాటికి త్రివేణీ సంగమంలో పుణ్యస్నానాలుచేసే భక్తులసంఖ్య 60 కోట్లుదాటే అవకాశంఉందని అంచనా వేస్తు న్నారు. తొలుత దీనికి 45కోట్లమంది మాత్రమేవస్తారని అంచనావేయగా ఊహించనిరీతిలో భక్తులు పోటెత్తారు.

# శ్రీలంకలో రైలు ఢీకొని ఆరు ఏనుగులు మృతి

**కొలంబో, ఫిబ్రవరి 20:** శ్రీలంకలో రైలు ఢీకొని ఆరు ఏనుగులు మృతి చెందాయి. ఈ ఘటన గురువారం తెల్లవారుజామున జరిగింది. రైలులోని ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బంది కలగలేదు. అయితే ఏనుగుల గుంపును ఢీకొన్న రైలు పట్టాలు తప్పింది. కొలంబోకు తూర్పున ఉన్న హబరానాలోని వైల్డ్ లైఫ్ రిజర్వ్ ఫారెస్టులో ఈ విషాద ఘటన చోటుచేసుకుంది. గాయపడిన రెండు ఏనుగులకు చికిత్స అందిస్తున్నారు. శ్రీలంకలో గత యేడాది ఏనుగుల వల్ల 170 మంది మృతి చెందారు. అయితే వేర్వేరు ఘటనల్లో 500 ఏనుగులు కూడా ప్రాణాలు కోల్పోయాయి. లంకలో సగటున ప్రతి యేడాది సుమారు 20 ఏనుగులు రైలు ఢీకొనడం వల్ల మృతి చెందుతున్నట్లు రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. అడవుల నరికివేత వల్ల జంతువులు మానవ ప్రదేశాల్లోకి వస్తున్నాయి. అటవీ ప్రాంతాల్లో రాత్రి పూట రైళ్లను నెమ్మది నడపాలని, హారన్లు ఇవ్వాలని డ్రైవర్లకు ఆదేశాలు ఉన్నట్లు అధికారులు చెప్పారు. శ్రీలంలో సుమారు ఏడువేల ఏనుగులు ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. బౌద్ధ మతస్తులు ఆ జంతువుల్ని పవిత్రంగా భావిస్తారు. ఏనుగుల్ని చంపితే అక్కడ జైలు శిక్ష లేదా జరిమానా విధిస్తారు.

## 30 యేళ్ల క్రితం కేసులో మహారాష్ట్ర మంత్రికి రెండేళ్ల జైలు..

**ముంబయి, ఫిబ్రవరి 20:** దాదాపు 30 ఏళ్ల క్రితం మోసానికి పాల్పడిన కేసులో ఎన్సీపి నేత, మహారాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి మాణిక్‌రావ్ కొకటేకు కోర్టు రెండేళ్ల జైలు శిక్ష విధించింది. మంత్రితో పాటు అతని సోదరుడికి జైలు శిక్షతో పాటు రూ.50 వేల జరిమానా విధిస్తూ నాసిక్ కోర్టు తీర్పు వెలువరించింది. నకిలీ పత్రాలు సృష్టించి, అక్రమాలకు పాల్పడి ప్రభుత్వ కోటాలో ఫ్లాట్‌లు పొందారని మాజీ మంత్రి దివంగత టిఎస్ డిఘూలే అప్పట్లో చేసిన ఫిర్యాదుతో కోకటే సోదరులపై కేసు నమోదైంది. 1995 నాటి ఈ కేసులో మొత్తం 10 మంది సాక్షులను విచారించిన నాసిక్ జిల్లా సెషన్స్ కోర్టు కోకతే సోదరులిద్దరినీ దోషులుగా తేల్చి శిక్షలు విధిస్తూ తీర్పు ఇచ్చింది. మరోవైపు, కోర్టు విచారణకు హాజరైన మంత్రి మాణిక్‌రావ్ మాట్లాడుతూ ఈకేసులో తనకుబెయిల్ మంజూరైందని తెలిపారు. ఈతీర్పుపై అప్పీల్‌కు వెళతానని చెప్పారు.

## జడ్జిలను విచారించే అధికారం తమకు ఉందన్న లోక్‌పాల్‌కు సుప్రీం నోటీసులు!

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20:** హైకోర్టు జడ్జిలను విచారించే అధికారం తమకు ఉందంటూ లోక్‌పాల్ జారీచేసిన ఉత్తర్వులపై సుప్రీంకోర్టు స్టే విధించింది. ఆ ఉత్తర్వులు ఆందోళనకర మంటూ ఈ సందర్భంగా అత్యున్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది.

ఇందుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం, లోక్‌పాల్ రిజిస్ట్రార్‌లకు నోటీసులు పంపింది. హైకోర్టు సిట్టింగ్ అదనపుజడ్జిపై దాఖ లైన రెండు ఫిర్యాదులను లోక్‌పాల్ విచారి స్తోంది. లోకాయుక్త చట్టం 2013 ప్రకారం హైకోర్టు జడ్జిలను విచారించే అధికారం తమకు ఉందంటూ జనవరి 27న ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలోనే సుప్రీంకోర్టు ఈ అంశాన్ని సుమోటోగా తీసుకుని విచారణ చేపట్టి స్టే విధించింది.

# తూర్పు ఐరోపా నుంచి అమెరికా దళాలు వెనక్కి!



**వాషింగ్టన్, ఫిబ్రవరి 20:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రష్యాకు అనుకూలంగా మరో కీలక నిర్ణయం తీసుకోబోతున్నట్లు కథనాలు వెలువడ్డాయి. ఈ మేరకు జర్మనీ పత్రిక బిల్డ్ కథనం ప్రచురించింది. దీని ప్రకారం.. 1990 తర్వాత నాటోలో చేరిన దేశాల్లో ఉన్న అమెరికా సేనలను వెనక్కి పిలిపించాలని ట్రంప్ ప్రభుత్వం భావిస్తోంది. దీంతో అల్బానియా, బల్గేరియా, క్రొయేషియా, ఎస్తోనియా, ఫిన్‌లాండ్, హంగేరీ, లాత్వియా, లిథువేనియా, మాంటెనెగ్రో, నార్త్ మెసిడోనియా, పోలాండ్, రొమానియా, స్లొవేకియా, స్లొవేనియా, స్వీడన్‌ల నుంచి దళాలు వెనక్కి వచ్చే అవకాశాలున్నాయి. వీటితోపాటు ఇటలీ, కొసావో నుంచి అమెరికా దళాలు వైదొలిగే అవకాశాలున్నాయి.

ముఖ్యంగా బాల్టిక్ దేశాల నుంచి దళాలను వెనక్కి రప్పించడంపై ట్రంప్ సానుకూలంగా స్పందించొచ్చని అధికార వర్గాలు నమ్ముతున్నాయని ఫైనాన్షియల్ పత్రిక పేర్కొంది. దీనిపై లథువేనియా అధ్యక్షుడు స్పందిస్తూ.. అమెరికా-ఐరోసా సైనిక సహకారం భవిష్యత్తుపై చర్చలు జరుగుతున్నట్లు వెల్లడించారు. అమెరికా దళాలను వెనక్కి తీసుకొంటుందనే సంకేతాలు ఇప్పటివరకు లేవన్నారు.

తూర్పుఐరోపాలోని పోలాండ్‌లో అమెరికా దళాలు అత్యధికంగా ఉన్నాయి. వీరి సంఖ్య 10,000కు పైగా ఉండొచ్చు. రష్యా- ఉక్రెయిన్ యుద్ధాన్ని ఎట్టి పరిస్థితుల్లోను ముగించేలా ట్రంప్ హడావుడిగా చర్యలు చేపట్టారు. కాస్తభూమితో పోయేదాన్ని యుద్ధం వరకూ తీసుకొచ్చారని జెల్‌న్‌స్కీనే ట్రంప్ నిందించారు. ఈ క్రమంలో తాజాగా తూర్పు ఐరోపా నుంచి సేనల విరమణ కూడా రష్యాకు సానుకూలంశం అవుతుంది.

**పెంటగాన్ రక్షణ బడ్జెట్‌ను తగ్గించుకోవాలని ఆదేశాలు**

పెంటగాన్‌న డిఫెన్స్ బడ్జెట్‌ను తగ్గించుకోవాలని అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సే ఆదేశాలు జారీ చేశారు. యేటా 8 శాతం చొప్పున తగ్గించుకొంటూ రావాలని పేర్కొన్నారు. ఈ కోతలను ఫిబ్రవరి 24 నాటికి సిద్ధం చేయాలని వెల్లడించారు. బడ్జెట్ తగ్గింపుల నుంచి 17 విభాగాలకు మాత్రమే మినహాయింపు ఇచ్చారు. వీటిల్లో అణ్వాయుధాలు, అమెరికా దక్షణ సరిహద్దుల్లో కార్యకలాపాలు, మిసైల్ డిఫెన్స్ ప్రోగ్రామ్‌లు వంటివి ఉన్నాయి. గతేడాది అమెరికా 850 బిలియన్ డాలర్లను రక్షణ కోసం వెచ్చించింది. 2023 నాటికి దీనిలో 300 బిలియన్ డాలర్లను తగ్గించాలని హెగ్సే లక్ష్యంగా పెట్టుకొన్నారు.

### ముఖ్య ఆర్థిక సలహాదారు అనంత నాగేశ్వరన్

# పదవీకాలం పొడిగింపు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20:** ముఖ్య ఆర్థిక సలహాదారు వి. అనంత నాగేశ్వరన్ పదవీకాలాన్ని కేంద్ర ప్రభుత్వం మరో రెండేళ్లు పొడిగించింది. ప్రధాని నరేంద్రమోడీ నేతృత్వంలోని కేబినెట్ నియామకాల కమిటీ ఆమోదం తెలిపింది. దాంతో నాగేశ్వరన్ మార్చి 31, 2027 వరకు పదవిలో కొనసాగుతారని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఆయన 2022, జనవరి 28న సిఇఎగా బాధ్యతలు స్వీకరించారు. ఆయన వివిధ ఆర్థిక విధానాలపై ప్రభుత్వానికి సలహాలు ఇవ్వడంతో పాటు కేంద్ర బడ్జెట్‌కు ముందు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే ఆర్థిక సర్వేను రూపొందించడం ఆయన కార్యాలయం బాధ్యత. మాజీ క్రెడిట్ సూయిస్ గ్రూప్ ఎజి, జూలియస్ బేర్ గ్రూప్ ఎగ్జిక్యూటివ్, విద్యావేత్త అయిన నాగేశ్వరన్.. కెవి సుబ్రమణియన్ స్థానంలో ప్రధాన ఆర్థిక సలహాదారుగా నియామకయ్యారు.

ఆసియాలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలో మందగమన సంకేతాల మధ్య 2024-25 ఆర్థిక సర్వే రాబోయే ఆర్థిక సంవత్సరానికి 6.3-6.8 శాతం వృద్ధి రేటును అంచనా వేసిన కొద్దివారాల తర్వాత.. నాగేశ్వరన్ పదవీకాలాన్ని పొడిగిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. కేంద్రం అంచనా ప్రకారం.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఆర్థిక వ్యవస్థ 6.4 శాతం వృద్ధి చెందుతుందని అంచనా. నాగేశ్వరన్ సిఇఎగా బాధ్యతలు స్వీకరించడానికి ముందు.. 2019 నుంచి 2021 వరకు ప్రధానమంత్రి ఆర్థిక సలహామండలిలో పార్ట్‌టైమ్ సభ్యుడిగా పని చేశారు. భారత్, సింగపూర్‌లో అనేక బిజినెస్ స్కూళ్లకు పని చేశారు. నాగేశ్వరన్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్, అహ్మదాబాద్ నుంచి పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్ (ఎంబిఎ) డిగ్రీని పొందారు. 1994లో మసాచుసెట్స్ విశ్వవిద్యాలయం నుంచి ఫైనాన్స్‌లో డాక్టరేట్ పట్టా అందుకున్నారు. ఆయన ఐఎఫ్ఎంఆర్ గ్రాడ్యుయేట్ స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్, క్రియా విశ్వవిద్యాలయంలో ఎకనామిక్స్‌లో విజిటింగ్ ప్రొఫెసర్‌గా ఉన్నారు.

# చైనాతో అమెరికా ఒప్పందం!

## వాణిజ్య యుద్ధ భయాల వేళ ట్రంప్ పచ్చజెండా

**వాషింగ్టన్, ఫిబ్రవరి 20:** దూకుడు నిర్ణయాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. చైనా విషయంలో మరో కీలక నిర్ణయం తీసుకునేందుకు సిద్ధం అవుతున్నారు. డ్రాగన్‌తో ట్రేడ్ వార్ డీల్ రూపుదాల్చే అవకాశం ఉందని తాజాగా వ్యాఖ్యలు చేశారు. 2020లోనే చైనాతో ఒక గొప్ప వాణిజ్య ఒప్పందం జరిగిందని మీడియాతో మాట్లాడుతూ గుర్తు చేశారు. రెండు దేశాల మధ్య ట్రేడ్‌వార్ జరుగుతుందన్న ఆందోళనల వేళ అగ్రరాజ్య అధ్యక్షుడి నుంచి ఈ వ్యాఖ్యలు రావడం గమనార్హం. ట్రంప్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఆయన నోటిలో టారిఫ్ పదమే వినిపిస్తోంది. దానికి తగ్గట్టే మిత్రులు, శత్రువులు అనే తేడా లేకుండా అన్ని దేశాలపై పరస్పర సుంకాలు విధిస్తానని తేల్చి చెప్పారు. వాణిజ్య లోటును తగ్గించుకోవడం కోసమే ఆయన దూకుడుగా వ్యవహరిస్తున్నారు.

చైనా నుంచి అమెరికాకు దిగుమతి చేసుకునే వస్తువులపై 10 శాతం సుంకాలు విధిస్తూ నిర్ణయం తీసుకున్నారు. దానికి చైనా కూడా కౌంటర్ ఇచ్చింది. అమెరికా నుంచి దిగుమతి అవుతున్న బొగ్గు, ద్రవీకృత సహజ వాయువుపై (ఎల్ఎన్‌జి) 15 శాతం సుంకం విధిస్తున్నట్లు చైనా ఆర్థిక మంత్రిత్వ శాఖ ప్రకటించిన సంగతి తెలిసిందే.

ముడి చమురు, వ్యవసాయ పరికరాలు, పెద్ద ఇంజిన్ల కార్లపై 10 శాతం సుంకాన్ని వసూలు చేయనున్నట్లు తెలిపింది. ఇలా ఒకరిపై ఒకరు పరస్పర సుంకాలు విధించుకుంటున్న తరుణంలో ట్రంప్ నుంచి ఈ స్పందన రావడం ప్రాధాన్యం సంతరించుకుంది.

# అబ్దుల్ కలాం రూపం మాట సజీవంగా నిలిపారు

## - స్వర్ణాంధ్ర విద్యార్థుల ముందడుగు - ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో తిరుగు లేదనిపించారు....

## - టెక్నాలజీకి మేధో సంపత్తిని జోడించారు...



**ప్రభాతవార్త నరసాపురం :** స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కాలేజ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో విప్లవాత్మక ముందడుగు వేసింది. భారత మాజీ రాష్ట్రపతి, ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలిచిన డాక్టర్ ఏ.పి.జె. అబ్దుల్ కలాం ని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా పునరుద్ధరించడం ద్వారా, తాము టెక్నాలజీ అభివృద్ధిలో ఎంత ముందంజలో ఉన్నామో నిరూపించింది. ఈ ప్రత్యేకమైన ఆవిష్కరణలో, కలాం మహనీయుని వాయిస్ మోడలింగ్, న్యూరల్ నెట్‌వర్క్స్, మరియు డీప్ లెర్నింగ్ ఆధారంగా రూపొందించిన ప్రత్యేకమైన మోడల్ సహాయంతో, ఆయన ప్రసంగ శైలిని, వాక్య నిర్మాణాన్ని, అంతర్‌దృష్టిని పునఃసృష్టించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా, విద్యార్థులు మరియు ప్రజలు నేరుగా కలాం గారి మాటలను వినే అవకాశం పొందారు. ఈ ప్రాజెక్ట్ వెనుక స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కాలేజ్ పరిశోధకులు, విద్యార్థులు, మరియు ప్రొఫెసర్ల కృషి అమోఘం. మేధోసంపత్తిని వాడుకుంటూ, టెక్నాలజీని సమర్థవంతంగా వినియోగిస్తూ, ఈ పథకం ద్వారా విద్యార్థులకు పరిశోధనా రంగంలో కొత్త అవకాశాలను అందించారు. ఈ సందర్భంగా స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కాలేజ్ చైర్మన్ కె. వి. సత్యనారాయణ మాట్లాడుతూ, "డాక్టర్ ఏ.పి.జె. అబ్దుల్ కలాం గారి కలలను సాకారం చేసే దిశగా మేము మరో అడుగు వేసినందుకు గర్విస్తున్నాము. భవిష్యత్ తరాలకు టెక్నాలజీ శక్తిని అర్థం చేసుకునేలా చేయడం మా ప్రధాన లక్ష్యం" అని పేర్కొన్నారు. కళాశాల డైరెక్టర్ అద్దాల



శ్రీహరి మాట్లాడుతు ప్రస్తుత పరిస్థితుల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సంబంధించిన అవకాశాలను సద్వినియోగ పరుచుకోవాలని విద్యార్థులకు తెలియజేశారు ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కె.వి.సత్యనారాయణ, ట్రెజరర్ కే.వెంకటేశ్వర స్వామి, డైరెక్టర్ అద్దాల శ్రీహరి, ప్రిన్సిపాల్ ఎస్.సురేష్ కుమార్,వైస్ ప్రిన్సిపాల్ ఏ గోపీచంద్ మరియు ఏఐ &ఎంఎల్ విభాగాధిపతి బొమ్మ రామకృష్ణ మరియు విభాగ సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

పశ్చిమగోదావరి,ఏలూరు వార్త

# పెదవేగి మండలంలో విద్యుత్ నిలిపివేత

**ఏలూరు రూరల్, ఫిబ్రవరి-20, ప్రభాతవార్త,:** పెదవేగి 132KV నుండి 33 KV కూచింపూడి సబ్ స్టేషన్ ఫీడర్ నందు చెట్ల కొమ్మలు తొలగించుట కొరకు 21 -02-2025 విద్యుత్ సరఫరా నిలివేయబడునని తూర్పుప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఏలూరు ఆపరేషన్ సర్కిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె. ఎం. అంబేద్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. దీని కారణంగా పెదవేగి మండలం, పెదవేగి సెక్షన్ పరిధిలో వున్న 33/11KV కూచింపూడి సబ్ స్టేషన్ పరిధిగల 11KV కుచింపూడి 11KV న్యాయంపల్లి 11KV గోవిందవారి గూడెం 11KV మైల్ఎనర్జీ ఇండస్ట్రియల్ మరియు కుచింపూడి 11KV 24 గంటల ఫీడర్ ఈ ఫీడార్ల కు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు విద్యుత్ అంతరాం కలుగునని మరియు 11KV గోవిందవారి గూడెం AGL ఫీడర్ న్యాయంపల్లి AGL ఫీడర్ 2.00 నుంచి 3 పెస్ కరెంట్ ఇవ్వబడునని రైతులు అందరు గమనించాలని కోరారు.

# రూ. 100 కోట్లు నష్టపోయాం..!

## -బర్డ్ ఫ్లూ కారణంగా పౌల్ట్రీ కుదేలైంది
## -పౌల్ట్రీ ఫెడరేషన్ రాష్ట్ర చైర్మన్ కేవీ సుబ్బారావు
## -తణుకులో పర్యటించిన కేంద్ర కమిటీ బృందం సభ్యులు
## -వ్యాక్సిన్లు అందుబాటులోకి తీసుకువస్తామని హామీ





**తణుకు, ఫిబ్రవరి 20(ప్రభాత వార్త):** బర్డ్ ఫ్లూ కారణంగా పౌల్ట్రీ పరిశ్రమ కుదేలైంది... దాదాపు రూ. 100 కోట్లు నష్టపోయాం... పౌల్ట్రీ పరిశ్రమను ఆదుకోవాలని రాష్ట్ర ఫెడరేషన్ నాయకులు కేంద్ర కమిటీ సభ్యులను విజ్ఞప్తి చేశారు. బర్డ్ ఫ్లూ వ్యాప్తి చెందిన తణుకు మండలం వేల్పూరు గ్రామంలో గురువారం కేంద్ర కమిటీ బృందంతోపాటు వైద్యులు పర్యటించారు. అంతకుముందు తణుకులోని చిట్టూరి హెరిటేజ్‌లో రైతులతో భేటీ అయ్యారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ పౌల్ట్రీ ఫెడరేషన్ చైర్మన్ కొమ్మలపాటి వెంకటసుబ్బారావు మాట్లాడుతూ బర్డ్ ఫ్లూ కారణంగా తలెత్తిన నష్టం కంటే జరిగిన ప్రచారం కారణంగా మరింత ఎక్కువ నష్టం జరిగిందన్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో దాదాపు రూ. 100 కోట్లు నష్టం జరిగిందన్నారు. భవిష్యత్తులో వైరస్‌లు తలెత్తకుండా కేంద్రం పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ముఖ్యంగా వ్యాక్సిన్లు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. బర్డ్ ఫ్లూ వ్యాప్తి చెందిన ప్రాంతాల్లో కంటే సమీపంలోని ఆరోగ్యంగా ఉన్న కోళ్లను ఖననం చేయడం వల్ల నష్టం తీవ్రత అధికంగా ఉందన్నారు. కేంద్ర పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఆర్‌జే బాచ్‌వాల్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఆయిదు ప్రాంతాల్లో బర్డ్ ఫ్లూ గుర్తించినట్లు చెప్పారు. ముఖ్యంగా ఆయా కోళ్ల ఫారాల్లో బయో సెక్యూరిటీ పాటించకపోవడంతోనే వైరస్ వ్యాప్తి అధికంగా ఉందన్నారు. బర్డ్ ఫ్లూ సోకిన కోళ్ల ఫారాల్లో పారిశుధ్యం క్రమబద్ధీకరించడం ద్వారా త్వరితగతిన నిలంధనలు సడలించేందుకు అవకాశం ఉంటుందన్నారు. గతంలో బర్డ్ ఫ్లూ వ్యాప్తి చెందిన ప్రాంతాల్లో 3 కిలోమీటర్లు నిబంధన 1 కిలోమీటర్‌కు కుదించినట్లు చెప్పారు. రాబోయే రోజుల్లో వైరస్‌ల దాడి చేయకుండా వ్యాక్సిన్లు అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు. చికెన్ వినియోగంపై పేజాలు: పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ దామోదర్‌నాయుడు బర్డ్ ఫ్లూ నేపథ్యంలో పౌల్ట్రీ పరిశ్రమను ఆదుకునే ఉద్దేశంతో రాబోయే రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా చికెన్, ఎగ్ మేళాలు నిర్వహిస్తామని పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ డాక్టర్ టి.దామోదర్‌నాయుడు అన్నారు. గురువారం తణుకులో కేంద్రబృందం, వైద్యులతో కలిసి పర్యటించిన డాక్టర్ దామోదర్‌నాయుడు అనంతరం మీడియాతో మాట్లాడారు. వదరోసారి ఇలాంటి ఉపద్రవాలు తలెత్తకుండా శాఖ తరఫున చర్యలు తీసుకుంటామన్నారు. చికెన్, గుడ్లు తినకూడదనే అపోహలు నమ్మవద్దని ఉడకబెట్టిన గుడ్లు, వండిన చికెన్ నిరభ్యంతరంగా తినవచ్చని చెప్పారు. కోళ్లఫారాల్లో బయోసెక్యూరిటీ నిర్వహించడం వల్ల త్వరగా పౌల్ట్రీ రైతులు కోలుకోవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బెంగళూరులోని దక్షిణభారత ప్రాంతీయ డీసీజ్ లేబొరేటరీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్రహెగ్డే, ఐకార్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వెటర్నరీ ఎపిడెమియాలజీ అండ్ డీసీజ్ ఇన్‌ఫార్మాటిక్స్ (నివేది) సీనియర్ సైంటిస్టు డాక్టర్ ఎండీ ముదాసార్, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హై సెక్యూరిటీ యానిమల్ డీసీజెస్ (ఎన్ఐహెచ్ఎస్ఏడీ -భోపాల్) సీనియర్ సైంటిస్టు డాక్టర్ మనోజ్‌కుమార్, గన్నవరం ఎన్టీఆర్ పశువైద్యశాల ప్రొఫెసర్ డాక్టర్ కేవీ సుబ్రహ్మణ్యం, పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ కె.మురళీకృష్ణ, డిప్యూటీ డైరెక్టర్ వి.ప్రసాద్, మండల పశువైద్యాధికారి కరణం శంకరం తదితరులు పాల్గొన్నారు.

# వికసిత్ భారత్ సాధన లక్ష్యంగా కేంద్ర బడ్జెట్.

## - కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ



**భీమవరం ఫిబ్రవరి 20 ప్రభాతవార్త :** ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో " సబ్ కా సాత్ - సబ్ కా వికాస్ - సబ్ కా విశ్వాస్ " లక్ష్యంగా దేశంలోని అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి ధ్యేయంగా కేంద్రం బడ్జెట్ ప్రవేశ పెట్టడం జరిగిందని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. గురువారం భీమవరంలోని కేవీస్ రాజు కన్వెన్షన్ లో పశ్చిమగోదావరి జిల్లా భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో బీసీ నర్సాపురం పార్లమెంట్ కన్వీనర్ సుభాష్ రాజు అధ్యక్షతన కేంద్ర బడ్జెట్ పై మేధావుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య వక్తగా హాజరైన మాజీ ఎమ్మెల్సీ పివిఎన్ మాధవ్ మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం మధ్యతరగతి ప్రజలకు మేలు చేయాలని సంకల్పంతో పదికోటి కేంద్ర ప్రభుత్వానికి లక్ష కోట్ల రూపాయలు పన్ను రూపంలో నష్టం వాటిల్లిన లెక్కచేయకుండా 12 లక్షల ఆదాయం వచ్చేవారికి పన్ను నుండి మినహాయింపు ఇవ్వడం సాహసోపేత నిర్ణయం అన్నారు. గత ప్రభుత్వాలలాగ ఓట్ల కోసం కాకుండా దేశ దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని ప్రవేశపెట్టిన బడ్జెట్ అని వికసిత్ భారత్ - 2047 నాటికి భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా మార్చాలనే లక్ష్యాన్ని చేరుకునేలా ఈ బడ్జెట్ ఉందని , ఆంధ్రప్రదేశ్ కు బడ్జెట్లో భారీ కేటాయింపులు చేశారని అన్నారు. ముఖ్యంగా పోలవరం , అమరావతి ల నిర్మాణానికి నిధులు కేటాయించడంతో పాటు విశాఖ స్టీల్ ప్లాంట్ కు ప్రత్యేక ప్యాకేజ్ ఇవ్వటం కూడా జరిగిందని మాధవ్ చెప్పారు. కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ మాట్లాడుతూ బడ్జెట్ పై మేధావులు, వ్యాపారులతోపాటు అన్ని వర్గాల వారికి అవగాహన కల్పించడం కోసం దేశవ్యాప్తంగా మేధావుల సదస్సులు ప్రధాని మోదీ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్నారన్నారు. గత ప్రభుత్వ హయాంలో నత్త నడకన సాగిన జల జీవన్ మిషన్ 2028 వరకు పెంచడం వల్ల మన రాష్ట్రానికి చాలా ప్రయోజనం చేకూరుతుందన్నారు. బడ్జెట్లో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి భారీ కేటాయింపులు జరిగాయన్నారు. ఈ కార్యక్రమంలో మొదట భీమవరం ఛాంబర్ ఆఫ్ కామర్స్ సెక్రెటరీ కాగిత రమణ, తాడేపల్లిగూడెం ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు ఈతకోట తాతాజీ, భీమవరం బార్ అసోసియేషన్ అధ్యక్షులు న్యూటన్, ప్రొఫెసర్లు కృష్ణ చైతన్య, సునీల్ కుమార్ లు మాట్లాడుతూ బడ్జెట్ అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూర్చే విధంగా ఉందని తెలిపారు. పెద్ద సంఖ్యలో వ్యాపారులు, న్యాయవాదులు, విద్యార్థులతోపాటు బీజేపీ,జనసేన,టీడీపీ కి చెందిన పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# నేస్తం.... నీ బిడ్డకు చేదోడుగా మేమున్నాం - చిన్నారి భవితకు చేదోడుగా తండ్రి స్నేహితులు

**మొగల్తూరు.... (ప్రభాతవార్త).:** మానవత్వం దాతృత్వం కనుమరుగవుతున్న నేటి కాలంలో తమతో పాటు ఆరో తరగతి నుండి పదో తరగతి వరకు చదివి ఈ మధ్యనే అనారోగ్యంతో మరణించిన స్నేహితుని యొక్క ఏడు సంవత్సరాల పాప భవిష్యత్తు లో చదువు నిమిత్తం ఆర్థికంగా ఆదుకున్న స్నేహితులు. కాళీపట్నం మొగల్తూరు మండలం పెప్పర్ల వారి తోట ఉన్నత పాఠశాలలో 1995-96 సంవత్సరంలో 10వ తరగతి చదివిన విద్యార్థులు తమతో పాటు చదివిన స్నేహితుడు పంపన చిరంజీవి ఇటీవల అనారోగ్యం పాలై అకస్మాత్తుగా మరణించగా ఎంతో కుమిలిపోయారు. స్నేహితుడి కుటుంబం కష్టంలో ఉండటంతో ఆదుకోవాలని నిర్ణయించుకున్నారు. ఆయనకు ఏడు సంవత్సరాల పాప ఉంది. అతని మరణంతో ఆ కుటుంబం ఒక్కసారిగా దిక్కుతోచనిదిగా అయింది. పాప భవిష్యత్తు కోసం మేమున్నామంటూ స్నేహితులంతా కలిసి 102500/ఆర్థిక సహాయాన్ని పాప పేరిట తొమ్మిది సంవత్సరాల ఏడు నెలల కాలానికి రెట్టింపు అయ్యేట్లుగా ఫిక్స్ డిపాజిట్ చేశారు. చింతారావు మరియు పోలంకి బాలకృష్ణ కలిసి వెళ్లి పాస్ బుక్ ను చిరంజీవి కుటుంబ సభ్యులకు అందజేయడం జరిగింది. ఆర్థిక సహాయం లో తన వంతుగా కొట్టు చింతారావు రూ 50 వేలు మరియు మిగతా స్నేహితులంతా కలిసి 52500/రూపాయలు సమకూర్చి ఇచ్చారు. ఆ విధంగా స్నేహితుడి యొక్క కుటుంబానికి అసరాగా నిలిచారు. కష్టంలో ఉన్న స్నేహితుడి కుటుంబాన్ని ఆదుకోవడం తమందరూ భావించి చేయూతగా నిలిచారు. నేస్తం కోసం తోటి స్నేహితులంతా కలిసి చేసిన మంచి పనిని గ్రామ సర్పంచ్ పలువురు అభినందించారు. 1995-96.10 వ తరగతి విద్యార్థుల బృందం స్నేహమేరా జీవితం స్నేహమే మన పెన్నిధి అని మరోసారి చాటి చెప్పారు. పాప భవిష్యత్తు కోసం స్నేహితులంతా ఒక్కటిగా నిలిచారు. చిన్నారికి వెన్ను దన్నుగా ఉన్నారు. మిత్రమా మా అందరిని వదిలి వెళ్లిపోయినా మన బంధం అంత గొప్పదని చాటి చెప్పారు.



# నాటు సారాయి స్థావరాలపై ఎక్సైజ్ పోలీసులు దాడి



**చింతలపూడి... (ప్రభాత వార్త)** చింతలపూడి ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ పరిధి లో గల చింతలపూడి పట్టణ పరిధిలో గల ఒడ్డుగూడెం గ్రామస్వైన మల్లె మార్తేశ్వర రావును బడు లీటర్ల నాటు సారాయితో చింతలపూడి ఎక్సైజ్ స్టేషన్ సిఐ,ఎస్ఐ మరియు సిబ్బంది తో కలిసి అరెస్టు చేయడమైనది. అదేవిధంగా ఈరోజు ఏలూరు ఎక్సైజ్ సూపరింటెండెంట్ టాస్క్ ఫోర్స్ టీమ్ ఎస్సై మహమ్మద్ ఆరిఫ్ మరియు వారి సిబ్బందితో కలిసి చింతలపూడి మండలం రాఘవాపురం గ్రామంలో దాడులు జరిపి నాటు సారా విక్రయదారుడు అయిన ఇంజుమూరి రాంబాబు మరియు అతనికి నాటు సారా సరఫరా చేసే నాగిరెడ్డిగూడెం గ్రామస్తుడైన భూక్య శ్రీను అరెస్టు చేసి వారి వద్ద నుండి 25 లీటర్ల నాటు సారాయి మరియు సారాయి రవాణా చేయుచున్న మోటార్ సైకిల్ ను స్వాధీన పరుచుకొని కేసు నమోదు చేయడమైనది! అలాగే రాఘవాపురం గ్రామం పాత నాటు సారాయి ముద్దాయి అయినా ఇంజుమూరి రాంబాబు చింతలపూడి తాసిల్దార్ సమక్షంలో బైండోవర్ చేయడమైనది.ఈ దాడులలో స్టేషన్ చింతలపూడి ఎక్సైజ్ ఎస్.ఐ. లు ఎ.వి.ఎల్.నరసింహ రావు,అబ్దుల్ ఖలీల్ మరియు సిబ్బంది పాల్గొన్నారు అని ఎక్సైజ్ సి.ఐ. పి.అశోక్ తెలిపినారు

# జ్ఞాన జ్యోతి శిక్షణ ద్వారా నైపుణ్యాల అభ్యసనం



**వేలేరుపాడు, ఫిబ్రవరి 20,(ప్రభాతవార్త :** సమగ్ర శిక్ష, ఐసిడిఎస్ ఆధ్వర్యంలో వేలేరుపాడు మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జ్ఞాన జ్యోతి శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. జాతీయ విద్యా విధానం 20-20 ద్వారా పిల్లలకు నైపుణ్యాల అభ్యసన కోసం ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది. మూడవరోజు జ్ఞాన జ్యోతి శారీరక అభివృద్ధి,భాషా అభివృద్ధి మరియు మేధోఅభివృద్ధి సంబంధించిన కృత్యములు ప్రదర్శనలు నిర్వహించారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ కె.మయూరి మాట్లాడుతూ అంగన్వాడీ టీచర్స్ అందరికి కూడా 120 రోజుల సర్టిఫికెట్ కోర్సుకు ట్రైనింగ్ ఇస్తున్నామని,అంగన్ వాడి కార్యకర్తలు శిక్షణను సద్వినియోగం చేసుకొని అంగన్ వాడి సెంటర్లో ఎన్రోల్మెంట్ పెంచడానికి, విద్యాభ్యాసం మెరుగుపరచడానికి కృషి చేయాలని సూచించారు.

# లారీ తో పాటు బియ్యమును స్వాహా చేసిన ముఠా గుట్టు రట్టు

**ఏలూరు క్రైమ్, ఫిబ్రవరి 20,(ప్రభాత వార్త :** ఏలూరు రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ది. 29.01.2025 వ తేదీన FCI గోడౌన్ దగ్గర Cr.No. 39/2025 u/o% 303(2) బి.ఎన్.ఎస్ గా కేసు నమోదు చేసినారు. దీనిపై ఏలూరు జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివ కిషోర్ ప్రత్యేకంగా దర్యాప్తు బృందాలను ఏర్పాటు చేయడమైనది.

**అరెస్ట్ వివరణ :** ఏలూరు జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివ కిషోర్ ఆదేశాల ప్రకారం ఏలూరు సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ డి.శ్రావణ్ కుమార్ పర్యవేక్షణలో ఏలూరు వన్ టౌన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ జి.సత్యనారాయణ కి రాబడిన సమాచారం మేరకు ఈరోజు అనగా 20.2.2025 వ తేది ఉదయం ఏలూరు వన్ టౌన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ జి.సత్యనారాయణ ,ఏలూరు రూరల్ ఎస్ఐ .దుర్గాప్రసాద్ మరియు సిబ్బందితో కలిసి నేషనల్ హైవే- 16 పక్కన, బాదంపూడి హౌసింగ్ బోర్డ్ కాలనీ శివారు దత్తాత్రేయం వెనక పంట పొలాల్లోని ఖాళీ రేకుల షెడ్డు ప్రక్కన మణికంఠ ఫౌండేషన్ దగ్గరలో ఏలూరు రూరల్ పోలీస్ స్టేషన్ లో 29.01.2025 వ తేదిన నమోదు Cr.No.39/2025u/o 303(2),111(2)(a),3(5),317(2) BNS దొంగిలించబడిన 290 బియ్యం బస్తాలు ఉన్నవని,వాటిని దొంగిలించిన ముద్దాయిలు, వైజాగ్ ప్రాంతంలో అమ్మటానికి ముగ్గురు వ్యక్తులు సిద్ధపడుతున్నారని సమాచారం తెలిసి అక్కడకు వెళ్లి ఏలూరు వన్ టౌన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ సదరు ముగ్గురిని అదుపులోకి తీసుకోవడం జైనది తెలియజేసారు.ఈ దొంగతనం కేసులో మొదట లారీ తో సహా బియ్యమును ఎఫ్ సి ఐ గోడౌన్ వద్ద జన్నాపల సుధాకర్ ,తండ్రి చలపతిరావు, వయసు 42 సంవత్సరములు, కులము కాపు, శ్రీ గార్డెన్స్ కొత్తూరు రోడ్డు, నయారా పెట్రోల్ బంక్ వద్ద ఏలూరు మండలం అను అతను దొంగిలించి, దొంగిలించిన బియ్యమును లారీ తో సహా నడిపల్లి గ్రామం, పెదవలి మండలం,కి చెందిన దూడల ధనరాజు, మరియు ఉంధ్రాజవరం గ్రామం ఉంధ్రాజవరం మండలానికి చెందిన కొల్లేపర మణికంఠ సహాయంతో బియ్యపు బస్తాలతో ఉన్న లోడు ని ముగ్గురికి కలిసి ప్రై స్థలంలో అన్లోడ్ చేసి, కొన్ని రోజు దాచిఉంచి, ఈరోజు సదరు ముగ్గురు ముద్దాయిలు అమ్మకుందామని వెళ్ళగా సదరు ముగ్గురు ముద్దాయిలను , 290 బస్తాల బియ్యమును, బియ్యంతో దొంగిలించబడిన లారీని కూడా స్వాధీనపరుచుకున్నారు. దర్యాప్తులో పాల్గొన్న ఏలూరు వన్ టౌన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ జి .సత్యనారాయణ , ఏలూరు సీసీఎస్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ సిహెచ్ .రాజశేఖర్ , ఏలూరు రూరల్ పి ఎస్ ఎస్ ఐ సిహెచ్ .కె .దుర్గాప్రసాద్ , ఏలూరు వన్ టౌన్ పి ఎస్ ఎస్ ఐ -కె .నాగబాబు మరియు ఏలూరు రూరల్ ,వన్ టౌన్ పీఎస్ సిబ్బందిని, సీసీఎస్ సిబ్బందిని ఎస్పీ, డిఎస్పి అభినందించారు.


# కూటమి అభ్యర్థికి ఓట్లకై ప్రచారం



**ప్రభాతవార్త నరసాపురం:** కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి, పేరాబత్తుల రాజశేఖర్ ను గెలిపించాలని కోరుతూ,పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం లో భాగంగా, గురువారం ప్రభుత్వ చీఫ్ విప్ మరియు నర్సాపురం నియోజకవర్గ శాసన సభ్యులు బొమ్మిడి నాయకర్ ఆధ్వర్యంలో , గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ ఎన్నికల ప్రచారంలో తెలుగుదేశం పార్టీ నర్సాపురం నియోజకవర్గ ఇంచార్జ్ పొత్తూరి రామరాజు ఈ ప్రచారంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా గురువారం నరసాపురం నియోజకవర్గం నర్సాపురం మండలంలోని రాజులంక, మరిపిప్ప, దర్భరేవు, వేములదీవి ఈస్ట్ మరియు వెస్ట్ బియ్యపు తిప్ప లో పలువుట్ల ఉన్న గ్రాడ్యుయేట్ ఓటర్స్ ని కలిసి, కరపత్రాలను పంపిణీ చేసి, మీ 1.వ ప్రాధాన్యత ఓటు పేరా బత్తుల రాజశేఖరంకు వేసి గెలిపించవలసిందిగా ఓటర్లను కోరి అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో వాతడి ఉమా ఒడుగు పినుబాబు ,ఉంగరాల నాగరాజు ,ఆద్దాల ప్రసాద్, గన్నబాబు,దండు రాజ్యలక్ష్మి ,(గంధి నాని ,దేవిరెడ్డి రామచంద్ర రావు, వడ్డీ ఆదినారాయణ ,ఉంగరాల గిరి వాసు ,ఉలిశెట్టిములస్వామి, దావీద్ ,ఉంగరాల నాగేశ్వరావు,గోపి జనసేన టీడీపీ బిజెపి నాయకులు జన సైనికులు వీర మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల గొంతుక పిడిఎఫ్ - ప్రశ్నించే వారిని పెద్దల సభకు పంపుదాం.ఎమ్మెల్సీ ఐవి

**ప్రభాతవార్త నరసాపురం:** ఈనెల 27వ తేదీన జరగబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలలో ప్రోగ్రెసివ్ డెమొక్రటిక్ ఫ్రంట్ ( పిడిఎఫ్) తరఫున బరిలో నిలిచిన దిడ్ల వీర రాఘవులను మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరావు కోరారు.గురువారం నరసాపురం లో పలు విద్యాసంస్థలు, నివాస ప్రాంతాలలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాసనమండలిలో నిరుద్యోగులు, ఉద్యోగస్తుల విద్యార్థులు,సాధారణ ప్రజానీకం కోసం, వారి సంక్షేమం కోసం పోరాడేది పిడిఎఫ్ సభ్యులే అని అన్నారు.అధికారంలోకి వచ్చి 8 నెలలు అయినా ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేని కూటమి కి ఎమ్మెల్సీ ఎన్నికలలో ఓటు అడిగే హక్కు లేదన్నారు.రాష్ట్రంలో వేల సంఖ్యలో ఉ పాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్న వాటిని భర్తీ చేయకుండా నిరుద్యోగులను ప్రభుత్వం మోసం చేసిందని అన్నారు.సుదీర్ఘకాలం ఉపాధ్యాయుడిగా, వివిధ సంఘాల నాయకుడిగా పని చేసిన అనుభవం ఉన్న దిడ్ల వీర రాఘవులు శాసనమండలికి పంపితే ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తారని అన్నారు. ప్రజా సమస్యల పట్ల అవగాహన ప్రశ్నించే నిబద్ధత కలిగిన వ్యక్తి దిడ్ల వీర రాఘవులు. ఉ భయగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఓటర్లు అందరూ సీరియల్ నెంబర్ 14లో వీర రాఘవులు పేరు వద్ద మొదటి



ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు.మేధావుల సభగా పేరొందిన శాసనమండలికి రాజకీయ నిరుద్యోగులను పంపొద్దని ఆయన కోరారు. ఈ ప్రచారంలో ప్రజాసంఘాల నాయకులు కొల పెద్దిరాజు, ముచ్చర్ల త్రిమూర్తులు,మంచిలి నీలకంఠం, పోగాకు పూర్ణ, పోగాకు నారాయణరావు,వి.వాసు, టి.ప్రసాద్,రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## పేలూరుజిల్లాలో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించిన అమెరికా ప్రతినిధుల బృందం



ఏలూరు/ఉంగుటూరు, ఫిబ్రవరి, 20 : ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయ (ఏపీసీఎన్ఎఫ్) కార్యక్రమాన్ని బలోపేతం చేయడం కోసం రాష్ట్రంలో పేదలందున్న పర్యటనలో భాగంగా అమెరికా కు చెందిన పెగాసస్ క్యాపిటల్ ప్రతినిధుల బృందం గురువారం 20 వ తేదీన ఏలూరు జిల్లాలోని ఉంగుటూరు మండలంలోని ఎ . గోకవరం మరియు భీమడోలు మండలంలోని వడ్డిపర్రు, కోడూరుపాడు గ్రామాలను సందర్శించింది. ఈ బృందంలో వైట్ హౌస్ మాజీ జాతీయ వాతావరణ సలహాదారు గినా మెకార్తీ, పెగాసస్ క్యాపిటల్ వ్యవస్థాపకుడు, చైర్మన్, సీఈఓ క్రేగ్ కాట్ మరియు ప్రొడ్యూసర్స్ సంస్థ వ్యవస్థాపకుడు, సీఈఓ కీత్ అగోడా ఉన్నారు.

# ఎమ్మెల్సీ ఎన్నికలలో పేరాబత్తులను గెలిపించండి - పట్టభద్రులకు ఎమ్మెల్యే చిర్రి వినతి

**జీలుగుమిల్లి, ఫిబ్రవరి-20, (ప్రభాతవార్త):** ఈ నెల 27వ తేదీన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో పేరాబత్తుల రాజశేఖర్ కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని పట్టభద్రులను పోలవరం శాసనసభ్యులు చిర్రి బాలరాజు కోరారు. గురువారం మండలంలోని జీలుగుమిల్లి జిల్లా పరిషత్ హై స్కూల్, బర్రింకలపాడు గిరిజన గురుకుల పాఠశాల, కామాలలో పట్టభద్రుల వద్ద ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలవరం శాసనసభ్యులు చిర్రి బాలరాజు ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార కార్యక్రమంకు పాల్గొని ఉపాధ్యాయులతో మాట్లాడుతూ గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు రాజశేఖర్ కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి మెజారిటీతో గెలిపించాలని అని విజ్ఞప్తి చేశారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం నిర్ణయించిన వ్యక్తి పేరాబత్తుల రాజశేఖర్, తమరు ఎంతో ఉత్తమమైన వ్యక్తి ఉపాధ్యాయ వృత్తిలో ఉంటే లోటుపాట్లు పూర్తిగా గుర్తెరిగిన వ్యక్తి అని తమ సమస్యలు ఏమున్నా అందరు కలిసి వ్యక్తికి పరిష్కారం చేస్తామని ఎమ్మెల్యే గారి సమర్థుడు కాబట్టి రాజశేఖర్ కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని అని కోరారు.



# పరీక్షల నిర్వహణ పై'సి.ఎస్' వీడియో కాన్ఫరెన్స్





భీమవరం ఫిబ్రవరి 20 ప్రభాతవార్త :అమరావతి ఏపీ సచివాలయంలోని సిఎస్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి గురువారం ఏపీపీఎస్సీ, గ్రూప్-2 పరీక్షలు, ఇంటర్మీడియట్ పరీక్షలు, పి4 మోడల్ సర్వే, ఎంఎస్ఎంఈ సర్వే, జిల్లా వారీగా పెర్ఫోష్షన్ ట్రాకింగ్, తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ లు, సంబంధిత ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, డిఆర్ఓ మొగిలి వెంకటేశ్వర్లు తదితరులు కాలక్టరెట్ నుంచి పాల్గొన్నారు. అనంతరం అధికారులతో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులతో మాట్లాడుతూ ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో నిర్వహించే గ్రూప్-2 పరీక్షల కోసం అన్ని ఏర్పాట్లు చేపట్టాలని అధికారులని ఆదేశించారు. ఈనెల 23వ తేదీన ఆదివారం నిర్వహించే ఏపీపీఎస్సీ గ్రూప్-2 పరీక్షలను అన్ని ముందస్తు ఏర్పాట్లు పూర్తిచేసి పగడ్బందీగా నిర్వహించాలన్నారు. పరీక్షల కోసం అవసరమైన స్టేషనరీని చెక్ లిస్ట్ ప్రకారం సిద్ధంగా పెట్టుకోవాలన్నారు. అలాగే జిల్లాలో మార్చి 1వ తేదీ నుంచి 20వ తేదీ వరకు నిర్వహించే ఇంటర్మీడియట్ పరీక్షల కోసం ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. ఇంటర్మీడియట్ పరీక్షలకు డిఆర్ఓ ఇంచార్జిగా ఉంటారన్నారు. పరీక్షల ప్రశ్నాపత్రం మూమెంట్ ను పోలీసులు తనిఖీలు చేయాలన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి ఎం వెంకటేశ్వర్లు, జిల్లా పంచాయతీ అధికారి బి అరుణ శ్రీ, సిపిఓ శ్రీనివాసరావు జిల్లా పరిశ్రమల సంస్థ జనరల్ మేనేజర్ యు. మంగపతి రావు, డి ఐ ఈ ఓ నాగేశ్వరరావు, భీమవరం మున్సిపల్ కమిషనర్ రామచంద్రా రెడ్డి తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# సాయి దుర్గ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ కు ఆరోగ్య మంజూరు



జంగారెడ్డి గూడెం ప్రభాత వార్త: జంగారెడ్డిగూడెం సాయిదుర్గ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ కు డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య సేవ (ఆరోగ్యశ్రీ ) రావటం హర్షించదగిన విషయమని చింతలపూడి శాసనసభ్యులు సోంగా రోషన్ కుమార్ హర్షం పట్టించారు. సాయిదుర్గ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ కు ఆరోగ్యశ్రీ వచ్చిన సందర్భంగా గురువారం హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ ఆర్థోపెడిక్ సర్జన్ అత్తిలి పోశే శ్వరరావు, మేనేజింగ్ డైరెక్టర్ తూ టికుంట సాయికుమార్ చింతలపూడిలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం మర్యాదపూర్వకంగా కలిసి ఎమ్మెల్యే రోషన్ కుమార్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆరోగ్య శ్రీ ద్వారా రోగులను ఆరోగ్య వంతులుగా చేయాలని,త్వరలోనే హాస్పిటల్ కు వచ్చి కార్యక్రమం ప్రారంభిస్తానని తెలిపారు.

# విద్యారంగ సమస్యలు పరిష్కరం చేయాలి



జంగారెడ్డిగూడెం, ప్రభాత వార్త : పి డి ఎస్ యు రాష్ట్ర కమిటీ పిలుపు లో బాగంగా జంగారెడ్డి గూడెం ఆర్ డి ఓ ఆఫీసులో ఏ ఓ జి సి ఎన్ చంద్రశేఖర్ కి రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగా సమస్యలు పరిష్కారం చేయాలని వినతి పత్రం ఇవ్వడం జరిగినది. ఈ కార్యక్రమానికి హాజరైన పి డి ఎస్ యు జాతీయ కన్వీనర్ కమిటీ సభ్యులు ఈ. భూషణం మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్లో ఉన్న 3,500 కోట్ల ఫీజు బకాయిలను విడుదల చేయాలని, విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకోవడానికి అడ్డుగా ఉన్న జీవో నెంబర్ 77ను రద్దు చేయాలని అన్నారు. యుజిసి డ్రాఫ్ట్ సవరణను కేంద్ర ప్రభుత్వం ఉ పాసహరించుకోవాలని, రాష్ట్రాల ఫెడరల్ హక్కులను అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీ తల్లికి వందనం పథకాన్ని తక్షణమే అమలు చేసి ప్రతి విద్యార్థికి 15 వేల రూపాయలు ఇవ్వాలని, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 50వేల ఉపాధ్యాయ పోస్టులను మెగా డీఎస్సీ ద్వారా భర్తీ చేయాలని, అన్ని రంగాలలో ఉన్న 2 లక్షల 50 వేల పోస్టులను భర్తీ చేయాలని, హాస్టల్ విద్యార్థులకు మెస్ కాస్మోటిక్ చార్జీలు పెంచాలని, వసతి గృహాలకు సొంత భవనాలు నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పి డి ఎస్ యు జిల్లా ఉపాధ్యక్షులు బి. వినోద్, లా విద్యార్థి కె. విజయశేఖర్, కె. ప్రసాద్ పాల్గొన్నారు.

### జంగారెడ్డిగూడెం 132 కేవీ పరిధిలో గల అన్ని విద్యుత్ సబ్ స్టేషన్ లకు దశలవారీగా విద్యుత్ నిలిపివేత

జంగారెడ్డిగూడెం,ప్రభాత వార్త: జంగారెడ్డిగూడెం 132 కేవీ, విద్యుత్ ఉపకేంద్రం నందు విద్యుత్ మరమ్మత్తు పనులు దృష్ట్యా 132 కేవీ జంగారెడ్డిగూడెం విద్యుత్ ఉపకేంద్రము పరిధిలోగల జంగారెడ్డిగూడెం, బుట్టాయిగూడె, కొయ్యలగూడెం,జీలుగుమిల్లి,కుక్కునూరు,వేలేరుపాడు మండలాల నందు గల అన్ని విద్యుత్ సబ్ స్టేషన్స్ కి 21వ తేదీ శుక్రవారం వ్యవసాయ మనకు సంబంధించి త్రీఫేస్ విద్యుత్తును ఉదయం 7 గం.ఎ. నుండి సాయంత్రం 6 గం.ఎ లోపు దశలవారీగా ఇవ్వడం జరుగుతుంది. కావున విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించవలసిందిగా కోరారు.

# క్షయ వ్యాధి పట్ల అప్రమత్తత అవసరం

## - వైద్యాధికారిణి జ్యోతి




చాట్రాయి, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త :జాతీయ క్షయ వ్యాధి నివారణ వారోత్సవాలను చాట్రాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ ఎం జ్యోతి మాట్లాడుతూ ఎవరికైనా రెండు వారాల మించి దగ్గు, సాయంకాలంలో జ్వరం, క్రమేపి బరువు తగ్గుతూ, ఆకలి మందగించడం లాంటి లక్షణాలు కనిపిస్తే వైద్య సిబ్బంది ని గానీ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులను గానీ సంప్రదించాలని చెప్పారు. కఫం ద్వారా టీబీ వ్యాధిని నిర్ధారణ చేసే "ట్రూ నాట్ ఎంటీబి టెస్ట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లేబరేటరీలో అందుబాటులో ఉందని, దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. వైద్య సేవలు, ఉచితంగా మందులు అందజేస్తామని తెలిపారు. అశ్రద్ధ చేసినా, మందులు అసంపూర్తిగా వాడినా మొండి క్షయ వ్యాధిగా మారుతుందని దీనికి మల్టీ డ్రగ్ తెరపి మందులు వాడాల్సి వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ టిబి ల్యాబ్ సూపర్వైజర్ రామాంజనేయులు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ జివి రమణ, హెల్త్ సూపర్వైజర్ జానకి, ల్యాబ్ టెక్నీషియన్ గాయత్రి , బి ఎన్ నాయక్ ,వైద్య సిబ్బంది పాల్గొన్నారు

# రైతులు తెచ్చిన ఆయిల్ పామ్ గెలలు ఏరివేత ఆపాలి



ఏలూరు రూరల్, ఫిబ్రవరి-20, ప్రభాతవార్త,: ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, ఆయిల్ పామ్ రైతుల సంఘం ఆధ్వర్యంలో పెదవేగి ఆయిల్ ఫెడ్ కర్మాగారం వద్ద గురువారం ఆయిల్ పామ్ రైతులు ధర్నా నిర్వహించారు. ఆయిల్ పామ్ రైతుల సమస్యలు పరిష్కరించాలంటూ రైతులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. గ్రేడింగ్ పేరుతో ఏరివేసిన గెలలతో ఆయిల్ పామ్ రైతులు నిరసన వ్యక్తం చేశారు. ముందుగా రైతు సంఘం నాయకులు ఏరివేసిన గెలలను పరిశీలించారు. ఈ ధర్నాను ఉద్దేశించి ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ఆయిల్ రికవరీ శాతం (ఓ.ఇ.ఆర్) పేరుతో రైతులు తెచ్చిన ఆయిల్ పామ్ గెలలు గ్రేడింగ్ పేరుతో ఏరివేయడం అన్యాయమని విమర్శించారు. పెట్టుబడి పెట్టి రైతులు ఎంతో కష్టపడి చేసిన గెలలు ఏరివేయడంతో ఆయిల్ పామ్ రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పాత మిషనరీ తో ఆయిల్ ఫెడ్ కర్మాగారం నడుస్తోందని రికవరీ శాతం పెంచాలని ప్రభుత్వం,ఆయిల్ ఫెడ్ ఉన్నతాధికారులు ఆదేశాలతో పక్కానికి వచ్చిన గెలలు సైతం ఏరివేయడం తగదన్నారు. నూతన టెక్నాలజీ మిషనరీ తో కొత్త ఫ్యాక్టరీ నిర్మాణం చేయకుండా పాత మిషనరీతో రికవరీ శాతం పెంచడం ఎట్లా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. రైతులను ఇబ్బందులు గురిచేసి ఆయిల్ ఫెడ్ కర్మాగారాన్ని ప్రైవేటీకరణ చేసేందుకు ప్రభుత్వం ఆలోచన చేస్తున్నట్లుగా ఉందన్నారు. రైతుల తెచ్చిన ఆయిల్ పామ్ గెలలు ఏరివేత ఆపాలని డిమాండ్ చేశారు. రైతులు నష్టపోకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇప్పటికైనా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి కొత్త ఆయిల్ ఫెడ్ కర్మాగారం నిర్మాణానికి నిధులు కేటాయించి ఆయిల్ పామ్ రైతులను ఆదుకోవాలన్నారు. ఆయిల్ పామ్ రైతుల సమస్యలు పరిష్కరించాలని లేనిపక్షంలో ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఆయిల్ పామ్ రైతులు బొల్లు రామకృష్ణ, మన్నె బాబూరావు మాట్లాడుతూ పెట్టుబడి ఖర్చులు పెరిగిపోయాయని, దిగుబడి రావడంలేదని చెప్పారు. ఆయిల్ పామ్ గెలల ధర కాస్త పెరిగిందని రైతులు సంతోషిస్తున్న ఈ సమయంలో దిగుబడి రాక నష్టపోతున్నామని, పైగా గెలలు గ్రేడింగ్ పేరుతో ఏరి వేయడంతో మరింతగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయిల్ ఫెడ్ యాజమాన్యం స్పందించి రైతులకు న్యాయం చేయాలని కోరారు. అనంతరం ఆయిల్ ఫెడ్ మేనేజర్ సుధాకర్ తో రైతు సంఘం నాయకులు ఫోన్లో సంప్రదించగా సమస్యను పరిష్కరిస్తామని, రైతులతో చర్చలు జరుపుతామని హామీ ఇచ్చారు. డిప్యూటీ మేనేజర్ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. అధికారుల హామీతో రైతులు ఆందోళన విరమించారు.

# ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని



ఏలూరు రూరల్,ఫిబ్రవరి-20, ప్రభాతవార్త :గురువారం ఉదయం దెందులూరు నియోజకవర్గం దెందులూరు మండలంలోని పోలీస్ స్టేషన్, మండల అభివృద్ధి కార్యాలయం సహా పలు ప్రభుత్వ కార్యాలయాల లోని పట్టభద్రులకు పలు గ్రామాల్లోని పట్టభద్రులకు కర పత్రాలు అందించి, కూటమి నాయకులతో కలిసి విస్తృత స్థాయి ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించిన దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్.

# లారీలకు ఉపాధి కల్పించాలి



లింగపాలెం ఫిబ్రవరి 20 ప్రభాతవార్త..... అందజేసిన చింతలపూడి పరిధిలో ఉన్న లారీలకు ఉపాధి కల్పించాలని ఎమ్మెల్యే సొంగ కుమార్ గారికి వినతిపత్రం అందజేసిన చింతలపూడి శ్రీ ఆంజనేయ లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్. చింతలపూడిలో లారీ ఓనర్స్ అసోసియేషన్ స్థాపించి 25 సంవత్సరాలు అవుతుంది మా లారీ అసోసియేషన్ పరిధిలో ఉన్న లోడ్లు మా లారీలతో మేము తోలుకుంటున్నాం ,ప్రభుత్వం ఆదేశాల మేరకు చింతలపూడి లారీ అసోసియేషన్ పరిధిలో ఉన్న ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా అసోసియేషన్ తరపున రవాణా చేయుచున్నాము కానీ ఇప్పుడు మొక్కజొన్న రవాణా చెయ్ విషయంలో 15 మంది కాంట్రాక్టర్లు చింతలపూడి , లింగపాలెం పరిధిలో మొక్కజొన్న టెండర్లు వేసి చింతలపూడి , లింగపాలెం లారీలకు ఉపాధి కల్పించకుండా వేరే ప్రాంతం నుంచి లారీలను తీసుకొచ్చి ఆ లారీలను తిప్పుతున్నారు ఇలా చేయడం వలన చింతలపూడి పరిధిలో ఉన్న లారీలకు ఉపాధి కోల్పోతున్నాము. కనుక చింతలపూడి లింగపాలెం పరిధిలో లారీలకు రవాణా ఉపాధి కల్పించాలని రవాణా రేట్లు కూడా పెంచాలని ఎమ్మెల్యే సొంగ రోషన్ కుమార్ గారిని కోరిన లారీ ఓనర్స్ అసోసియేషన్.

## సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం విజయవంతం చేయాలి



పెనుమంట్ర, ఫిబ్రవరి-20, ప్రభాతవార్త: పెనుమంట్ర మండలంలోని గురు, శుక్రవారాల్లో సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు, రైతులు దీనిని విజయవంతం చేయాలని మండల వ్యవసాయ అధికారి ఏ జ్యోషిల గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అయితే ఈనెల 20వ తేదీన రైతులు తమ పొలం గట్ల లో ఉన్నటువంటి సజీవ ఎలుకల బొరియలను గుర్తించి వాటిని మట్టితో పూడ్చాలన్నారు. శుక్రవారం తెరచి ఉన్న ఎలుకల బొరియల వద్ద బ్రోమోడయోలిన్ 0 25% నూకలు, నూనె తో కూడిన ఎర మందును ఉంచాలాన్నారు. ఈ సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమంలో మండలము లోని రైతులందరూ పెద్ద ఎత్తున పాల్గొనీ విజయవంతం చేయాలని అన్నారు. ప్రతి గ్రామ సచివాలయం అలాగే రైతు సేవా కేంద్రాల వద్ద ఎలుకల మందు 2 పాళ్ళు ,నూకలు 96 పాళ్ళు, నూనె 2 పాళ్ళు చొప్పున 100 గ్రా విషపుయరను తయారు చేసి ఉచితంగా పంపిణీ చేస్తామన్నారు.

# చంద్రశేఖర్ దంపతులకు ఘన సన్మానం



నూజివీడు, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త: రెవెన్యూ శాఖలో 30 సంవత్సరాలుగా సేవలందించి , పదవీ విరమణ చేసిన డి.వి. బి.చంద్రశేఖర్ దంపతులకు గురువారం ఘనంగా సన్మానం నిర్వహించారు. నూజివీడు నియోజకవర్గం లోని పలు గ్రామాల్లో గ్రామ కార్యదర్శి, వీ.ఆర్వో, సీనియర్ అసిస్టెంట్, వివిధ హోదాలలో అంచలంచెలు గా ఎదిగి ఉద్యోగ బాధ్యతలు నిస్వార్ధంగా నిర్వర్తించి, ఈ ప్రాంత ప్రజల మన్ననలను పొందారు. నూజివీడు మండలం ముక్కొల్లుపాడు గ్రామంలో దీర్ఘకాలికంగా సేవలందించారు. అనంతరం పదోన్నతి పై ముసునూరు , చాట్రాయి, నూజివీడు మండలాల రెవెన్యూ కార్యాలయంలో ఆర్. ఐ, సీనియర్ అసిస్టెంట్ గా విధులు నిర్వహించారు. ఆయన ఎక్కడ విధులు నిర్వహించినా పారదర్శకంగా ఉండేవారు. టిడిపి, జనసేన, వైసీపీ వర్గాల నాయకులకు అందరితో కలివిడిగా ఉండేవారు. రాజకియా వైశమ్యభేదాలు లేకుండా అందరికీ సమానంగా పనిచేసేవారు. రమణక్కపేటలోని స్థానిక శాంతినికేతన్ విద్యాలయంలో జరిగిన సన్మాన కార్యక్రమం లో పలువురు వక్తలు మాట్లాడుతూ చంద్రశేఖర్ దంపతుల సేవలపై ప్రశంసల వర్షం కురిపించారు. వారి శేషజీవితం ఆరోగ్యంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో ముసునూరు ఎంపీపీ కొండా దుర్గభవాని మాట్లాడుతూ చంద్రశేఖర్ దంపతులు ఎంతో సేవాభావం కలిగి ఉంటారని, వారి వారి వృత్తులలో నిజాయితీగా ప్రజలకు సేవలు అందించడమే కాకుండా వారి స్వగ్రామంలో కూడా అనేక మందికి ఆర్థికంగా , సామాజికంగా సేవలందించారని పేర్కొన్నారు. నేటి యువత ఈ దంపతులను ఆదర్శంగా తీసుకొని ప్రజలకు సేవ చేయాలని పిలుపునిచ్చారు. ఈ రోజుల్లో చాలామంది ప్రభుత్వ ఉద్యోగం అంటే గర్వంగా ఉంటారని, చంద్రశేఖర్ దంపతులు ఏటువంటి భేషజం లేకుండా ప్రజలకు సేవలు అందించే విషయంలో ముందుకొమ్మున ఉండేవారన్నారు. చంద్రశేఖర్ తమ గ్రామంలో జన్మించడం తమ అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు పి. నాగబాబు , శాంతినికేతన్ ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# రాజశేఖర్ ను అత్యధిక మెజార్టీతో గెలిపించండి



టి. నర్సాపురం, ఫిబ్రవరి-20, ప్రభాతవార్త: ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అఖండ విజయం చేకూర్చాలని తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యదర్శి జయవరపు శ్రీరామ మూర్తి పట్టభద్రులకు విజ్ఞప్తి చేశారు. బుధవారం జగ్గవరం గ్రామంలో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీరామ మూర్తి మాట్లాడుతూ ఎమ్మెల్సీ అభ్యర్థి రాజశేఖర్ ను అకండ విజయం చేకూర్చాలని కోరారు. అనంతరం హైస్కూలు ఉపాధ్యాయులను సచివాలయం సిబ్బందిని గ్రాడ్యుయేట్స్ కలిశారు. అనంతరం మండల పార్టీ అధ్యక్షులు నాయుడు రామకృష్ణ గౌడ్ మాట్లాడుతూ గ్రాడ్యుయేట్స్ కు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని నిరుద్యోగ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు వెల్ది నాగబాబు, లింగారెడ్డి శీను, భీమవరపు జగ్గయ్య ,అద్దంకి రాంబాబు, ఓబిలి నేనీ రాంబాబు, వేముల సూర్యనారాయణ తదితరులుపాల్గొన్నారు ఈనెల 27న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకుని, కూటమి అభ్యర్థి రాజశేఖర్ కు ఘన విజయం చేకూర్చాలని జగ్గవరం హై స్కూల్ ఉపాధ్యాయులతోపాటు సచివాలయం సిబ్బందిని కలిసి ఓటు వేయమని గ్రాడ్యుయేషన్ ఓట్ ను రాజశేఖర్ గారికి వేసి గెలిపించాలని జయవరపు కోరారు. ఈ ప్రచారంలో.. మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నాయుడు రామకృష్ణ గౌడ్,వెలిది నాగబాబు, లింగారెడ్డి శ్రీను, భీమవరపు జగ్గయ్య, అద్దంకి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఉద్యోగ, కార్మికుల, సమస్యలు పరిష్కరించాలి



**ఏలూరు టౌన్, ఫిబ్రవరి 20,ప్రభాత వార్త :** కూటమి ప్రభుత్వం మున్సిపల్ ఉద్యోగ, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏ.పి. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఏలూరు జిల్లా కార్యదర్శి భజంత్రీ శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏపీ మున్సిపల్ వర్కర్ స్ యూనియన్ రాష్ట్ర సమితి ఇచ్చిన పిలుపుమేరకు ఏలూరు నగర సమితి ఆధ్వర్యంలో స్థానిక శాసనసభ్యులు బడేటి రాధాకృష్ణయ్య (చంటి) కి సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు. అనంతరం భజంత్రీ శ్రీనివాసరావు మాట్లాడుతూకూటమి ప్రభుత్వం ఆప్కాస్ రద్దు పరుస్తూ రాష్ట్ర క్యాబినెట్ లో ఆమోదించినట్లు పత్రికల ద్వారా వార్తలు వస్తున్న నేపథ్యంలో కాంట్రాక్టు,ఔట్ సోర్సింగ్ ఉద్యోగకార్మికుల ను క్రమబద్ధీకరించి, ఉద్యోగ,వేతన భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. అపరిష్కృతంగా ఉన్న 3 సంవత్సరాల సరెండర్ లీవ్, ఎన్ కాష్మెంట్,3 డిఏలు తక్షణమే విడుదల చేయాలన్నారు. రాబోయే బడ్జెట్ సమావేశాలలో ఈ సమస్యల మీద అసెంబ్లీలో వివరించాలని శ్రీనివాసరావు కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నగర కోశాధికారి కసంకోట నాగేంద్ర,పుచ్చ శంకర్,మీసాల చంద్రమౌళి, గోవాడ మల్లేశ్వరరావు, కసింకోట రమణ,అల్లం పెద్దిరాజు, ధనియాల రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

## ద్విచక్రవాహనంను ఢీ కొట్టిన కారు.



ఏలూరు రూరల్, ఫిబ్రవరి-20, ప్రభాతవార్త,: దెందులూరు మండలం సత్యనారాయణపురం గ్రామ శివారులో మోటార్ సైకిల్ మీద వెళ్తున్న భార్యాభర్తలను వెనక నుండి వచ్చిన కారు ఢీకొట్టగా భార్యాభర్తలకు తీవ్ర గాయాలు అవగా స్థానికంగా ఉన్న ప్రజలు వెంటనే 108 అంబులెన్స్ ఫోన్ చేసి ఏలూరు సర్వజన ఆస్పత్రికి తరలించడం జరిగింది.

## లయన్స్ క్లబ్ ఆద్వర్యంలో పేదలకు ఆహార పొట్లాలు పంపిణీ



ఉండి, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త :లయన్స్ క్లబ్ ఉండి మండల కమిటీ ఆద్వర్యంలో గురువారం పలువురు నిరుపేదలకు ఆహార పొట్లాలను పంపిణీ చేసారు. మండలంలోని ఎన్ ఆర్ పి అగ్రహారం గ్రామంలో కన్నెగంటి రూత్ కళ స్వగృహం నందు క్లబ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా క్లబ్ అద్యక్షులు సత్తి బ్రహ్మారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యవర్గ సమావేశంలో పలువురు మాట్లాడుతూ జిల్లా ద్వితీయ గవర్నర్ గా ఆర్ వి ఎస్ సూర్యనారాయణరాజును బలపరచ వలసిందిగా ఆకివీడు లయన్స్ క్లబ్ కోరారు. దీంతో క్లబ్ సబ్యులందరూ ఆమోదంగా చప్పట్లుకొట్టారు. అనంతరం రుద్రరాజు నరసరాజు, క్లబ్ కార్యదర్శి ముదునూరి శివరామరాజు మాట్లాడుతూ లయన్స్ క్లబ్ కు అనేక సేవా కార్యక్రమాలు చేసిన ఆర్ వి ఎస్ ను ఎన్నుకోవాలి అన్నారు. వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ గాదిరాజు రంగరాజు, క్లబ్ డిసి మెంబర్ కన్నెగంటి రూత్ మాట్లాడారు. అనంతరం పేదలకు బ్రహ్మారెడ్డి ఆర్థిక సౌజన్యంతో పేదలకు ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వెంకన్న బాబు హరనాథ్ రాజు, జగన్నాధరాజు, అనంతలక్ష్మి, కాశీ విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## రైతులు విశిష్ట సంఖ్య నమోదు చేసుకోవాలి.. వ్యవసాయ అధికారి హబీబ్ భాషా



లింగపాలెం కామవరపు కోటా.. ఫిబ్రవరి 20 ప్రభాతవార్త...కామవరపు కోట మండల రైతు సేవా కేంద్రంలో రైతు విశిష్ట సంఖ్య నమోదు కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా వ్యవసాయ అధికారి హబీబ్ భాషా మాట్లాడుతూ ప్రభుత్వం నుండి ఏ లబ్ధి పొందాలన్నా రైతులు విశిష్ట సంఖ్య నమోదు చేసుకోవాలని తద్వారా ప్రభుత్వం ఇచ్చే సౌకర్యాలు పొందుతారని మండలంలోనిరైతులు ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు ఈ కార్యక్రమంలో చింతలపూడి సహాయ సంచాలకులు నాగ కుమార్ వ్యవసాయ అధికారి. సి పవన్ కుమార్ ఏ ఈ ఓ లు పాల్గొన్నారు.

## సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం



మొగల్తూరు ఫిబ్రవరి 20 ప్రభాతవార్త. మొగల్తూరు మండలంలో గురువారం సామూహిక ఎలుకల నిర్మూల న కార్యక్రమం మొగల్తూరు మండల వ్యవసాయ అధికారి ఆధ్వర్యంలో నిర్వహించారు ఈ కార్యక్రమంలో భాగంగా 20వ తేదీ ఎలుక కన్నం గుర్తించడం 21వ తేదీ తరచుకున్న ఎలుక కన్నాల దగ్గర ప్రభుత్వం ద్వారా ఉచిత పంపిణీ చేస్తున్నటువంటి బ్రహ్మా డైలీ న్ అనే మందును నూకలు మరియు నూనె కలిపి న విషపు ఎరను 10 గ్రాములు పొట్లాలుగా కట్టి రైతులకు పంపిణీ చేయడం జరుగుతుందని కావున రైతు సోదరులందరూ ఈ అవకాశాన్ని గమనించి వినియోగం చేసుకోవాలని మొగల్తూరు మండల వ్యవసాయ అధికారి రైతులకు సూచించారు

# విగ్రహ ప్రతిష్టకు పూజలు



కాళ్ళ ఫిబ్రవరి 20, (ప్రభాతవార్త) : మండలంలోని కలవపూడి లో నూతనంగా నిర్మించిన శ్రీ ఉమా భీమేశ్వర స్వామి వారి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ నెల 15 నుండి ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తున్నారు. 21న ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. 15న గోపూజ, వేద స్వస్తి, మూర్తులకు స్నపనం, ఆలయశాల ప్రదక్షిణం, ప్రవేశ బలి, గురు అనుజ్ఞ, దీప ప్రజ్వలన, గణపతి పూజ, పుణ్యాహవాచనం, మార్జనలు, పంచగవ్యప్రాసన, రిత్విక్ వరుణ, దీక్షా ధారణ, కంకణ ధారణ, అఖండ స్థాపన అస్త్ర రాజార్చనలతో ప్రారంభమయ్యాయి. లక్షణోధారణ, జలాధివాసం, బింబు శుద్ధి క్షీరాదివాసం, నవ కలశ స్నపన, ఆదివా సాంగ ఆమాలు హెూమాలు, దశ మృత్తిక స్నపణము, శాంతి కుంభ స్థాపన, యాగశాల అర్చన, తదితర పూజలు నిర్వహించారు. యంత్ర స్థాపన బింబస్థాపన అష్ట బంధనం కలాన్యాసం జీవం న్యాసం, మహాకుంభ దర్శనం గోపుష్ట దర్శనం మహా పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఉమా భీమేశ్వర స్వామి వారి విగ్రహాలు, గణపతి, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, నవగ్రహాలు, నందీశ్వరుడు, ఆదిశంకరాచార్యులు, కాలభైరవుడు, మరికొన్ని విగ్రహాలు ప్రతిష్టించడానికి పూజలు నిర్వహిస్తున్నారు. రంగ రంగ వైభవంగా ఈ ప్రతిష్ట మహోత్సవాలను పుల్లటికుర్తి భోగేశ్వర శర్మ ఆశీస్సులతో గణపతి శర్మ ఆచారత్వమున శేష మణిదీప్ శర్మ బ్రహ్మత్వంలో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం విగ్రహ ప్రతిష్ట మహోత్సవం అనంతరం అన్న సమరాధన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## నూజివీడు త్రిబుల్ ఐటీ విద్యార్థులకు పరుపుల పంపిణీ



నూజివీడు, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త:పీ.యూ.సి మొదటి సంవత్సరం విద్యార్థులకు అధికారులు గురువారం పరుపులను పంచి పెట్టారు. కార్యక్రమంలో భాగంగా నూజివీడు క్యాంపస్ డైరెక్టర్ , రిజిస్ట్రార్ ప్రో. అమరేంద్ర కుమార్ విద్యార్థులతో సంభాషించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకుని వాటిని పరిష్కరిస్తారని హామీ ఇచ్చారు. ఈ సందర్భం గా ఆర్జీయూకేటీ నూజివీడు క్యాంపస్ విద్యార్థులకు ప్రత్యేకంగా వాట్సాప్ గవర్నెన్స్ మొదలు పెట్టామని, ఆ నెంబర్ ద్వారా విద్యార్థుల సమస్యలను తెలియచేయటం ద్వారా త్వరితగతిన సమస్యలు పరిష్కరించబడతాయి అని పేర్కొన్నారు. అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డా. లక్ష్మణరావు మాట్లాడుతూ మౌలిక సదుపాయాలను సక్రమంగా వినియోగించుకోవాలని తెలియజేశారు. డీన్ అకాడమిక్స్ డా. చిరంజీవి మాట్లాడుతూ మొదటి సంవత్సరం నుంచి విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలని సూచించారు. కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ రాజశేఖర్ మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షలకు సంబంధించి ఎటువంటి సందేహాలు ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని తెలియజేశారు. చీఫ్ వార్డెన్ డా. లక్ష్మణ్ రావు మాట్లాడుతూ ఆర్జీయూకేటీ నూజివీడు క్యాంపస్ పరిపాలన విభాగం విద్యార్థులు పట్ల స్నేహపూర్వక భావం కలిగి వున్నారు అని ఎటువంటి సమస్యలను అయినా వెంటనే పరిష్కరించటానికి కృషి చేస్తున్నారు అని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో డిఎస్డబ్ల్యు బ్రహ్మ స్వాములు, వార్డెన్ మధు, అసోసియేట్ డీన్ వెల్ఫేర్ బుచ్చిరామ్ ఇతర అధ్యాపకులు, కేర్ టేకర్లు, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం మెస్ హాల్స్ ను సందర్శించి ఆహార పదార్థాల వంట ప్రక్రియ ను పర్యవేక్షించి, రుచి చూసి సంతృప్తి చెందారు.

# చిరంజీవి బ్లడ్ బ్యాంక్‌లో మణిశర్మ రక్తదానం

తెలుగు చిత్ర పరిశ్రమలో ఎవరెస్ట్ శిఖరం మెగాస్టార్ చిరంజీవి. వెండితెరపై నటనతో పాటు డాన్సులతోనూ అలరించే ఆయన చిరంజీవి ఐ అండ్ బ్లడ్ బ్యాంక్‌ను స్థాపించి తన అభిమానుల సహకారంతో ఎనలేని సేవా కార్యక్రమాలను నిర్వహిస్తోన్న సంగతి తెలిసిందే. చిరంజీవి మానస పుత్రిక అయిన చిరంజీవి బ్లడ్ బ్యాంక్‌లో అభిమానులు, సినీ సెలబ్రిటీలు ఎందరో రక్తదానం చేస్తుంటారు. తాజాగా ప్రముఖ సంగీత దర్శకుడు మణిశర్మ రక్తదానం చేసి చిరంజీవిపై తనకున్న అభిమానాన్ని చాటుకున్నారు. ఇలా మణిశర్మ రక్తదానం చేయటం ఇది రెండోసారి కావటం విశేషం.



'రక్తదానం'తో లక్షలాది ఆపన్నుల ప్రాణాలు నిలపాలన్న చిరంజీవి ఆశయాన్ని తమ సంకల్పాన్ని భావించి రక్తదానం చేసిన అభిమానులెందరో.. వారిలో తన స్వరాలతో ప్రేక్షకుల్ని మైమరపించే స్వరబ్రహ్మ 'మణిశర్మ' ఒకరు. చిరంజీవి పిలుపును కర్తవ్యంగా భావించి నేడు ఈ మహత్కార్యంలో భాగమై రక్తదానం చేసిన మణిశర్మ మరెందరికో స్ఫూర్తిగా నిలిచారు. పాటలకు స్వరాలు కూర్చడమే కాదు.. మానవత్వానికి చిరునామాగా నిలవడమూ తెలుసునని నిరూపించారు మణిశర్మ. ఈ సందర్భంగా మెలోడీ బ్రహ్మ మణిశర్మ మాట్లాడుతూ "ఎప్పటి నుంచో రక్త దానం చేయాలని అనుకుంటున్నాను. నేను నా సంగీతాన్ని చిరంజీవి సినిమాలకు అందించటం ద్వారా అభిమానాన్ని చాటుకున్నాను. ఇప్పుడు రక్తదానంచేయటం అనేది సంతోషంగా ఉంది. నా వంతు కర్తవ్యంగా భావిస్తున్నాను. లక్షలాది మంది ఇందులో భాగమైయ్యారు. అందులో నేను ఒక బొట్టులాగా ఇప్పుడు చేరాను. ఇలాంటి మంచి కార్యక్రమంలో అందరూ భాగం కావాలి" అన్నారు.

# మహా కుంభమేళాలో 'ఓదెల 2' టీజర్ లాంచ్

తమన్నా భాటియా హైలీ యాంటిసిపేటెడ్ మూవీ ఓదెల 2, ఇది 2021లో హిట్ అయిన ఓదెల రైల్వే స్టేషన్‌కి సీక్వెల్. అశోక్ తేజ దర్శకత్వంలో మధు క్రియేషన్స్, సంపత్ నంది టీమ్‌వర్క్స్ బ్యానర్స్ పై నిర్మాత డి మధు నిర్మిస్తున్న ఈ చిత్రం ఇప్పటికే హ్యూజ్ బజ్ క్రియేట్ చేసింది. నాగ సాధు పాత్రలో తమన్నా పెరోషియస్, స్టన్నింగ్ పోస్టర్స్ క్యురియాసిటీని పెంచాయి. ఓదెల2 మేకర్స్ ఎక్సయిటింగ్ అప్డేట్‌తో వచ్చారు. ఈ సినిమా టీజర్ ఫిబ్రవరి 22న కాశీ మహా కుంభమేళాలో లాంచ్ చేయనున్నారు. కాశీ మహా కుంభమేళాలో లాంచ్ కానున్న మొట్టమొదటి టీజర్ ఓదెల 2 కావడం విశేషం. ఈ సందర్భంగా మేకర్స్ రిలీజ్ చేసిన టీజర్ అనౌన్స్‌మెంట్ పోస్టర్‌లో కుంభమేళా బ్యాక్ డ్రాప్‌లో నాగసాధుగా కనిపించిన తమన్నా లుక్ డివైన్ వైబ్‌తో పవర్ ఫుల్‌గా వుంది. ఈ చిత్రం కోసం ప్రేక్షకులను అలరించే బ్రెత్ టేకింగ్ స్టంట్స్‌ని పెర్ఫామ్ చేయడానికి తమన్నా భాటియా ఇంటెన్స్ ట్రైనింగ్ తీసుకున్నారు. ఓదెల2 భారీ బడ్జెట్, హై క్వాలిటీ ప్రొడక్షన్ వాల్యూస్‌తో రూపొందిస్తున్నారు. ఈ సినిమా ఓ అద్భుతమైన సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌ని ఇవ్వబోతోంది. ఎంగేజింగ్ కథనాలతో థ్రిల్లింగ్ యాక్షన్‌ను బ్లెండ్ చేయడంలో పాపులరైన సంపత్ నంది ఈ చిత్రాన్ని సూపర్ విజన్ చేస్తున్నారు. ఓదెల 2కి కాంతార ఫేం అజనీష్ లోక్‌నాథ్ మ్యూజిక్ అందిస్తున్నారు. ప్రముఖ డీవోపీ సౌందర్‌రాజన్ ఎస్ సినిమాటోగ్రఫీని నిర్వహిస్తారు. ఆర్ట్ డైరెక్షన్ రాజీవ్ నాయర్. డైనమిక్ టెక్నికల్ టీమ్‌తో ఓదెల 2 ఒక మరపురాని సినీ ప్రయాణంగా రూపొందుతోంది. తారాగణం: తమన్నా భాటియా, హెబ్బా పటేల్, వశిష్ట ఎన్ సింహా, యువ, నాగ మహేష్, వంశీ, గగన్ విహారి, సురేందర్ రెడ్డి, భూపాల్, పూజా రెడ్డి, సాంకేతిక సిబ్బంది: నిర్మాత: డి మధు, క్రియేటెడ్ బై: సంపత్ నంది.



బ్యానర్లు: మధు క్రియేషన్స్, సంపత్ నంది టీమ్‌వర్క్స్ దర్శకత్వం: అశోక్ తేజ, డీవోపీ: సౌందర్ రాజన్ ఎస్., సంగీతం: అజనీష్ లోక్‌నాథ్, ఆర్ట్ డైరెక్టర్: రాజీవ్ నాయర్ పీఆర్వో: వంశీశేఖర్, మార్కెటింగ్: ఫస్ట్ షో.

# 'శివంగి' స్టన్నింగ్ ఫస్ట్ లుక్



ఆనంది, వరలక్ష్మి శరత్‌కుమార్ ప్రధాన పాత్రలలో దేవరాజ్ భరణి ధరణ్ దర్శకత్వంలో ఫస్ట్ కాపీ మూవీస్ బ్యానర్‌పై నరేష్ బాబు పి. నిర్మించిన పవర్ ఫుల్ విమెన్ సెంట్రిక్ ఫిల్మ్ శివంగి. జాన్ విజయ్, డాక్టర్ కోయ కిషోర్ కీలక పాత్రల్లో నటించారు. ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌ని బ్లాక్ బస్టర్ డైరెక్టర్ అనిల్ రావిపూడి లాంచ్ చేశారు. ఈ సినిమా ఎంత పవర్ ఫుల్, సెన్సేషనల్ కథతో వుండబోతోందో ఫస్ట్ లుక్ చూస్తే అర్థమౌతోంది. నల్లలుంగీ, చొక్కాతో కాళ్ళపై కళ్ళు వేసుకొని సోఫాలో డైనమిక్‌గా కూర్చున్న ఆనంది లుక్ స్టన్నింగ్ వుంది. విమెన్ సెంట్రిక్ సినిమాలలో శివంగి గ్రౌండ్ బ్రేకింగ్ కథ స్క్రీన్ ప్లేతో వుండబోతోంది. ఫస్ట్ లుక్ సినిమాపై చాలా క్యురియాసిటీని పెంచింది. ఈ చిత్రానికి ఎ.హెచ్ కాషిఫ్-ఎబినేజర్ పాల్ మ్యూజిక్ అందిస్తున్నారు. భరణి కె ధరన్ డివోపీ గా వర్క్ చేస్తున్నారు. రఘు కులకర్ణి ఆర్ట్ డైరెక్టర్. ఈసినిమా పోస్ట్‌ప్రొడక్షన్ చివరి దశకు చేరుకుంది. మార్చి 7న ఈ సినిమాని రిలీజ్ చేయనున్నట్లు మేకర్స్ తెలియజేశారు. నటీనటులు: ఆనంది, వరలక్ష్మి శరత్‌కుమార్,జాన్ విజయ్, డాక్టర్ కోయ కిషోర్, దర్శకత్వం: దేవరాజ్ భరణి ధరన్, నిర్మాత: నరేష్ బాబు పి, సంగీతం:ఎ.హెచ్ కాషిఫ్ - ఎబినేజర్ పాల్, డీవోపీ: భరణి కె.ధరన్.


కాజల్ అగర్వాల్ నయా లుక్

# 'స్వప్నాల నావ'.. 'సిరివెన్నెల'కి గొప్ప ట్రిబ్యూట్

మనసంతా నువ్వే, నేనున్నాను వంటి బ్లాక్ బస్టర్ సినిమాలు అందించిన దర్శకులు డా.వి.ఎన్.ఆదిత్య లేటెస్ట్‌గా స్వప్నాల నావ అనే యూట్యూబ్ మ్యూజిక్ వీడియో రూపొందించారు. డల్లాస్‌కి చెందిన ప్రవాసాంధ్రుడు, ప్రముఖ సాఫ్ట్ వేర్ ఇంజినీర్ అయినటువంటి శ్రీ గోపీకృష్ణ కొటారు శ్రీ క్రియేటివ్ మ్యూజిక్ అండ్ ఎంటర్టైన్మెంట్ అనే నిర్మాణ సంస్థను స్థాపించి తొలి ప్రయత్నంగా స్వప్నాల నావ మ్యూజిక్ వీడియోని నిర్మించారు. నిర్మాత గోపికృష్ణ కుమార్తె శ్రీజ కొటారు ఈ పాటను ఆలపించడమే కాకుండా నటించడం కూడా విశేషం. ఇక ఈ స్వప్నాల నావ థీమ్ విషయానికి వస్తే, చదువులో ఒకసారి ఫెయిలయిన విద్యార్థినీ విద్యార్థులను మోటివేట్ చేసే పాట ఇది.. దివంగత స్టార్ లిరిసిస్ట్ అయినటువంటి శ్రీ సిరివెన్నెల సీతారామశాస్త్రి దివ్య స్మృతికి అంకితంగా దీనిని మలిచారు. ప్రముఖ గాయకుడు, సంగీత దర్శకుడు పార్థసారథి నేమాని సంగీత దర్శకత్వంలో యశ్వంత్ ఆలూరు ఈ పాటకి సాహిత్యం సమకూర్చారు. సిరివెన్నెల సీతారామశాస్త్రి అంటే దర్శకులు డా. వీ.ఎన్.ఆదిత్యకి, నిర్మాత గోపీకి, సంగీత దర్శకుడు పార్థసారథి నేమానికి, గీతరచయిత యశ్వంత్ ఆలూరుకి ఎంతో అభిమానం. వీ.ఎన్.ఆదిత్య సూపర్ హిట్ సినిమా మనసంతా నువ్వేలో కూడా సిరివెన్నెల సింగిల్ కార్డ్ పాటలు రాయడమేకాకుండా, ఈనాటికీ గుర్తుండిపోయే ఓ మంచి పాత్రని కూడా చేశారు. ఇప్పుడు స్వప్నాల నావతో సిరివెన్నెల గొప్పతనాన్ని, ఆయనపై ఉన్న అభిమానాన్ని గొప్పగా చాటి చెప్పారు ఈ టీమ్.



అందుకే ప్రేక్షకుల నుండి స్వప్నాల నావకి విశేషాదరణ లభిస్తోంది. తాజాగా శ్రీ క్రియేటివ్స్ యూ.ఎస్.ఏ.యూట్యూబ్ ఛానల్‌లో రిలీజైన ఈపాటకు 1 మిలియన్ వీక్షణలు (పది లక్షల వ్యూస్) నమోదయ్యాయి. దీంతోమేకర్స్ సంతోషం వ్యక్తంచేస్తూ వీక్షకులకి, మీడియా వారికి, కృతజ్ఞతలు తెలిపారు. ఇక స్వప్నాల నావని వీక్షించిన వాళ్లలో చాలా మంది ప్రేక్షకులు టాలీవుడ్ గర్వించదగ్గ దిగ్గజ రైటర్ కమ్ లిరిసిస్ట్ అయినటువంటి సిరివెన్నెలసీతారామశాస్త్రికి డా.వీ.ఎన్.ఆదిత్య గొప్పట్రిబ్యూట్ ఇచ్చారు అంటూ ఆయన్ని అభినందిస్తున్నారు. ఓ.ఎమ్.జీ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై ప్రముఖ సినీ నిర్మాత శ్రీమతి మీనాక్షి అనిపిండి దీనికి సమర్పకురాలుగా వ్యవహరించారు. మాస్టర్ ట్రైలన్ అనే చైనా పిల్లవాడు కూడా నటించిన స్వప్నాల నావకు క్రూ: ఛాయా గ్రహణం: బుజ్జి.కె. సహకారం: యూనస్, సహ దర్శకత్వం: ఇర్షాద్, శ్రీహరిదత్త, రాహుల్ తేజ, ఎడిటింగ్: వికాస్, శేషు, స్టైలింగ్: శ్రుతి, నైలో.

# 'శబ్దం' థ్రిల్లింగ్ స్పైన్-చిల్లింగ్ ట్రైలర్

'వైశాలి'తో సూపర్‌హిట్‌ని అందించిన హీరో ఆది పినిశెట్టి, దర్శకుడు అరివళగన్‌లు రెండోసారి మరో ఇంట్రస్టింగ్ సూపర్‌నేచురల్ క్రైమ్ థ్రిల్లర్ 'శబ్దం' కోసం చేతులు కలిపారు. 7జి ఫిల్మ్స్ శివ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇప్పటికే రిలీజైన ప్రమోషనల్ కంటెంట్‌కి మంచి రెస్పాన్స్ వచ్చింది. మేకర్స్ 'శబ్దం' ట్రైలర్‌ని రిలీజ్ చేశారు. 'వెయ్యి గబ్బిలాలు చెవిలో అరుస్తున్నట్లు వుంటుంది డాక్టర్' అనే వాయిస్‌తో మొదలైన ట్రైలర్ ఆద్యంతం థ్రిల్లింగ్ స్పైన్‌చిల్లింగ్ ఎలిమెంట్స్‌తో కట్టిపడేసింది. ట్రైలర్ ఆడియో హాలోజినేషన్ కాన్సెప్ట్‌తో ఆడియన్స్‌కి సరికొత్త అనుభూతిని ఇచ్చింది. మేకర్స్ సూపర్ నేచురల్ థ్రిల్లర్‌ని చాలా డిఫరెంట్ ప్రజెంట్ చేశారు. ట్రైలర్ సీట్ ఎడ్జ్ ఎక్స్ పీరియన్స్‌ని ఇచ్చింది. ఆది పినిశెట్టి పారానార్మల్ ఇన్వెస్టిగేటర్ క్యారెక్టర్‌లో తన ఇంటెన్స్ పెర్ఫార్మెన్స్‌తో ఆకట్టుకున్నారు. లక్ష్మీమీనన్ క్యారెక్టర్ చాలా ఇంట్రస్టింగ్‌గా వుంది. అరుణ్ బత్మ నాభన్ అందించిన విజువల్స్ సినిమాలో లీనమయ్యేలా చేశాయి. ఎస్ థమన్ బ్యాక్ గ్రౌండ్ స్కోర్ సస్పెన్స్‌ని మరింతగా పెంచుతుంది. జాతీయ అవార్డు గ్రహీత సాబు జోసెఫ్ ఎడిటింగ్ షార్ప్‌గా వుంది. మనోజ్ కుమార్ ఆర్ట్ డైరెక్టర్. 'శబ్దం' ఫిబ్రవరి 28న ఆంధ్రాలో ఎన్ సినిమాస్, నైజాంలో మైత్రి డిస్ట్రిబ్యూషన్ ద్వారా విడుదల కానుంది. టెర్రిఫిక్ ప్రిమైజ్, అద్భుతమైన పెర్ఫార్మెన్స్, హాంటింగ్ ట్రైలర్‌తో సినిమాపై అంచనాలు మరింతగా పెరిగాయి. నటీనటులు: ఆది పినిశెట్టి, సిమ్రాన్, లైలా, లక్ష్మీ మీనన్, రెడిన్ కింగ్స్లీ, ఎం.ఎస్.భాస్కర్, రాజీవ్ మీనన్.



# 'జాట్' డబ్బింగ్ ప్రారంభం

బాలీవుడ్ లెజెండ్ సన్నీ డియోల్, మాస్ డైరెక్టర్ గోపీచంద్ మలినేని మోస్ట్ ఎవైటెడ్ మూవీ "జాట్" విడుదలకు సిద్ధమవుతోంది. ప్రతిష్టాత్మక మైత్రి మూవీ మేకర్స్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్లపై డైనమిక్ ప్రొడ్యూసర్స్ నవీన్ యెర్నేని, వై రవిశంకర్ నిర్మించిన ఈ చిత్రం ఏప్రిల్ 10, 2025న థియేటర్లలో విడుదల కానుంది. తాజాగా ఈ సినిమా డబ్బింగ్‌ని ప్రారంభించారు మేకర్స్. ఇప్పటికే జాట్ టీజర్ అందరినీ ఆకట్టుకొని సినిమా మోస్ట్ బ్లాస్ట్ యాక్షన్ డ్రామాగా వుండబోతోందని హామీ ఇచ్చింది. ఈ చిత్రంలో రణదీప్ హుడా, వినీత్ కుమార్ సింగ్, సయామి ఖేర్, రెజీనా కాసాండ్రా కీలక పాత్రలు పోషిస్తున్నారు. "జాట్" చిత్రానికి సంగీతం థమన్ ఎస్, రిషి పంజాబీ సినిమాటోగ్రఫీ, నవీన్ నూలి ఎడిటింగ్, అవినాష్ కొల్లా ప్రొడక్షన్ డిజైన్‌ను నిర్వహిస్తున్నారు. అనల్ అరసు, రామ్ లక్ష్మణ్, వెంకట్ కొరియోగ్రఫీ చేసిన యాక్షన్ సన్నివేశాలు ప్రేక్షకులను కట్టిపడేస్తాయని హామీ ఇస్తున్నాయి. ఆడియన్స్ అడ్రినలిన్ రష్‌తో కూడిన సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ అందించే జాట్ కోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. తారాగణం: సన్నీ డియోల్, రణదీప్ హుడా, వినీత్ కుమార్ సింగ్, సయామి ఖేర్, రెజీనా కసాండ్రా, సాంకేతిక సిబ్బంది: రచన, దర్శకత్వం: గోపీచంద్ మలినేని, నిర్మాతలు: నవీన్ యెర్నేని, వై రవిశంకర్, టిజి విశ్వ ప్రసాద్, బ్యానర్లు: మైత్రి మూవీ మేకర్స్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, సంగీతం: థమన్ ఎస్, డిఒపి: రిషి పంజాబీ, ఎడిటర్: నవీన్ నూలి, ప్రొడక్షన్ డిజైనర్: అవినాష్ కొల్లా, సిఇఒ: చెర్రీ, ఎక్జిక్యూటివ్ నిర్మాతలు: బాబా సాయి కుమార్ మామిడిపల్లి, జయ ప్రకాష్ రావు (జేపీ), యాక్షన్ కొరియోగ్రాఫర్: పీటర్ హెయిన్, అన్ల్ అరసు, రామ్ లక్ష్మణ్, వెంకట్, డైలాగ్స్: సౌరభ్ గుప్తా, రైటింగ్ టీం: ఎం వివేక్ ఆనంద్, నిమ్మగడ్డ శ్రీకాంత్, శ్రీనివాస్ గవిరెడ్డి, మయూఖ్ ఆదిత్య కృష్ణ కాస్ట్యూమ్ డిజైనర్లు: భాస్కి (హీరో), రాజేష్ కమర్సు, పబ్లిసిటీ డిజైనర్: గోపి ప్రసన్న, విఎఫ్ఎక్స్: దక్కన్ డ్రీమ్స్, పిఆర్ఒ: వంశీశేఖర్, మార్కెటింగ్: ఫస్ట్ షో.



# ఇకపై మీకు నచ్చే సినిమాలే చేస్తా: విశ్వక్ సేన్

మాస్ కా దాస్ విశ్వక్ సేన్ ఇటీవలే లైలా మూవీతో ప్రేక్షకుల ముందుకొచ్చారు. రామ్ నారాయణ్ దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద పెద్దగా రాణించలేకపోయింది. ఈ మూవీలో విశ్వక్ సేన్ లేడీ గెటప్‌లో అభిమానులను అలరించాయి. అయితే ఈ చిత్రం రిలీజ్‌కు ముందే వివాదానికి దారి తీయడంతో కలెక్షన్లపై తీవ్ర ప్రభావం పడింది. దీంతో బాక్సాఫీస్ వద్ద వసూళ్ల విషయంలో తీవ్రంగా నిరాశపర్చింది. ఈ నేపథ్యంలో హీరో విశ్వక్ సేన్ తాజాగా ఓ లేఖ విడుదల చేశారు. అభిమానులు ఆశించిన స్థాయిలో సినిమాలు చేయలేకపోయానని ట్విట్టర్ వేదికగా వెల్లడించారు. విశ్వక్ సేన్ తన లేఖలో రాస్తూ, 'అందరికీ నమస్కారం..ఇటీవల నా సినిమాలు అందరూ కోరుకునే స్థాయికి చేరుకోలేకపోయాయి. నా చివరి సినిమాకు వచ్చిన నిర్మాణాత్మక విమర్శలను పూర్తిగా అంగీకరిస్తున్నాను. నన్ను నమ్మి, నా ప్రయాణానికి మద్దతునిచ్చిన నా అభిమానులకు, నాకు ఆశీర్వాదంగా నిలిచిన వారికి హృదయపూర్వక క్షమాపణలు. నా ప్రాధాన్యం ఎప్పుడూ కొత్తదనం తీసుకురావడమే, కానీ ఆ ప్రయత్నంలో మీ అభిప్రాయాలను నేను గౌరవిస్తున్నా. ఇకపై నా ప్రతి సినిమా క్లాస్, మాస్ ఏదైనా సరే అసభ్యత ఉండదు. నేను ఒక చెడు సినిమా తీస్తే, నన్ను విమర్శించే హక్కు మీరు ఉంది. ఎందుకంటే నా ప్రయాణంలో ఎవ్వరూ లేని సమయంలో నన్ను ప్రేమతో ముందుకు నడిపించింది మీరే' అని రాసుకొచ్చారు. అంతేకాకుండా నా కెరీర్ ప్రారంభం నుంచి నేను ఎంచుకున్న కథలను మీరు ఎంతగా ప్రేమించారో తెలుసు. ఇకపై కేవలం సినిమా మాత్రమే కాదు, నా ప్రతి సన్నివేశం కూడా మీ మనసుకు తగిలేలా ఉండాలని నిర్ణయించుకున్నా. అంతేకాకుండా, నా మీద విశ్వాసం ఉంచిన నిర్మాతలు, పంపిణీదారులందరికీ నాకృతజ్ఞతలు తెలియ చేస్తున్నా. అలాగే నా కథానాయకులు, దర్శకులు, రచయితలు నాకు వెన్నెముకగా నిలిచి, నన్ను మలిచిన ప్రతి ఒక్కరికీ నా హృదయ పూర్వక ధన్యవాదాలు. మీ అందరి నిర్మాణాత్మక విమర్శలకు ధన్యవాదాలు. మీ అందరి నిర్మాణాత్మక విమర్శలకు ధన్యవాదాలు. త్వరలోనే మరో బలమైన కథతో ముందుకు వస్తా. నా మంచి, చెడు కాలాల్లో నన్ను నమ్మిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు. మీ మద్దతు నాకు ఎంతో ప్రాముఖ్యం అని ఆ లేఖలో రాశారు.



# 'ఎన్‌టిఆర్ నీల్' షూటింగ్ షురూ

మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్‌కు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. కె.జి.యఫ్ సిరీస్, సలార్ వంటి చిత్రాలతో బ్లాక్ బస్టర్స్ సాధించిన సెన్సేషనల్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ ఇప్పుడు ఎన్టీఆర్ వంటి మాస్ హీరోతో చేతులు కలిపిన సంగతి తెలిసిందే. ఎన్టీఆర్ నీల్ పేరుతో గత ఏడాదిలో పూజా కార్యక్రమాలను పూర్తి చేసుకున్న ఈ మూవీపై అంచనాలు భారీ స్థాయిలో ఉన్నాయి. ఇద్దరు మాస్ ఇమేజ్ ఉన్న స్టార్స్ కాంబోలో రాబోతున్న ఈ మూవీ కోసం అందరూ ఎదురు చూస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ గురువారం నుంచి రామోజీ ఫిల్మ్ సిటీలో ప్రారంభమైంది. అందరూ ఆశ్చర్య పోయేలా 3వేల మంది జూనియర్ ఆర్టిస్టులతో భారీ యాక్షన్ ఎపిసోడ్ చిత్రీకరణతో షూటింగ్ మొదలైంది. ఎన్టీఆర్ వచ్చే షెడ్యూల్ నుంచి షూటింగ్‌లో పాల్గొనబోతున్నారు. ఎన్టీఆర్, ప్రశాంత్ నీల్ కాంబో ఎలాంటి మ్యాజిక్ క్రియేట్ చేస్తుందోనని అందరి కళ్లు ఇప్పుడు ఈ సినిమాపైనే ఉన్నాయి. తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో ఈ భారీ పాన్ ఇండియా చిత్రం జనవరి 9, 2026లో ప్రపంచ వ్యాప్తంగా గ్రాండ్ లెవల్లో విడుదలవుతుంది. ముందుగానే రిలీజ్ డేట్ అనౌన్స్ చేయటంతో అభిమానులతో పాటు సినీ ప్రేక్షకులు సైతం సినిమా షూటింగ్ ఎప్పుడెప్పుడు మొదలవుతుందా అని ఎదురు చూడసాగారు. ఆ సమయం రానే వచ్చేసింది. రానున్న సంక్రాంతి థియేటర్స్‌కు ఈ చిత్రం సరికొత్త పండుగను తీసుకొస్తుందనటంలో సందేహం లేదు. డైరెక్టర్ ప్రశాంత్ నీల్ అంటే బ్లాక్ బస్టర్ చిత్రాలకు కేరాఫ్.. ఆయన ఇప్పుడు ఎన్టీఆర్‌తో తెరకెక్కిస్తోన్న చిత్రాన్ని సరికొత్త మాస్ విజన్‌తో ఆవిష్కరించనున్నారు. ఇప్పటి వరకు తారక్‌ను చూడనటువంటి మాస్ అవతార్‌లో ప్రెజెంట్ చేయనున్నారు. దీంతో వీరిద్దరి క్రేజీ కాంబినేషన్ సరికొత్త బెంచ్ మార్క్‌ను క్రియేట్ చేస్తుందనటంలో సందేహం లేదు. ప్రెస్టీజియస్ బ్యానర్స్ మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ నిర్మాణంలో అన్‌కాంప్రమైజ్డ్‌గా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ఆడియెన్స్‌కు సరికొత్త సినిమాటిక్ ఎక్స్‌పీరియెన్స్‌ను అందించనున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ బ్యానర్స్‌పై కళ్యాణ్ రామ్, నవీన్ ఎర్నేని, రవి శంకర్ యలమంచిలి, హరికృష్ణ కొసరాజు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. భువన్ గౌడ సినిమాటోగ్రఫీ అందిస్తోన్న ఈ చిత్రానికి రవి బస్రూర్ సంగీతాన్ని సమకూరుస్తున్నారు. చలపతి ప్రొడక్షన్ డిజైనర్‌గా పని చేస్తున్నారు. ఈ ప్రెస్టీజియస్ మూవీలో ఇంకా టాప్ యాక్టర్స్, టెక్నీషియన్స్ అందరూ భాగమవుతున్నారు. నటీనటులు: మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్, సాంకేతిక వర్గం: నిర్మాణ సంస్థలు మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్, రచన, దర్శకత్వం: ప్రశాంత్ నీల్, నిర్మాతలు: కళ్యాణ్ రామ్ నందమూరి, నవీన్ ఎర్నేని, రవి శంకర్ యలమంచిలి, హరికృష్ణ కొసరాజు, ప్రొడక్షన్ డిజైన్: చలపతి, సినిమాటోగ్రఫీ: భువన్ గౌడ, సంగీతం: రవి బస్రూర్.



## మెదడుకు మేలుచేసే కొర్రలు



కొర్రబియ్యాన్ని ఫాక్స్ టెయిల్ మిల్లెట్ అంటారు. చిన్నగా నలుసంతా ఉంటే వీటిని నక్శతోకతో పోల్చడం తమాషానే కదూ! ఆడ ఉంచితే ఇది గొప్ప పోషకాహారం. ఇవి తెలుపు, పసుపు రంగుల్లో దొరుకుతాయి. వీటితో జావ, రొట్టెలు, ఇడ్లీలు, గారెలు, ఉప్మా, కిచిడీ, ప్యాన్‌కాక్, సలాడ్, పలావ్, దోక్లా, వెజ్జీ బౌల్, లడ్డూ, ఖీర్, హల్వా, ఇలా ఎన్నో వంటకాలు చేసుకోవచ్చు. కొర్రలు ఎంత మేలు చేస్తాయంటే.

- వీటిలో ప్రొటీన్లు, క్యాల్షియం, భాస్వరం, మెగ్నీషియం, ఐరన్, పీచు, విటమిన్ బి3, బి6, బి9, బి12 ఉన్నాయి. తింటే, కండరాలు, ఎముకలు పటిష్టంగా ఉంటాయి. హాయిగా నిద్రపడుతుంది.
- ! రోగనిరోధక శక్తి పెరుగుతుంది. జీర్ణప్రక్రియ బాగుంటుంది. ఇది ప్రో బయాటిక్గా పనిచేస్తుంది. ఊబకాయం రాదు. ఒత్తిడి తగ్గి ఉల్లాసంగా ఉంటారు. మెదడు పనితీరు మెరుగుపడుతుంది. మధుమేహం నుంచి ఉపశమనం కలుగుతుంది. కొలెస్ట్రాల్ స్థాయి క్రమబద్ధంగా ఉంటుంది. రక్తపోటు అదుపులో ఉంటుంది.

కొర్రలు కప్పు, మినప్పప్పు అరకప్పు, కాస్త ఉప్పు, అర చెంచా మెంతులు తీసుకోవాలి. కొర్రలు, మినప్పప్పులను ఆరు గంటల పాటు విడివిడిగా నానబెట్టి మెంతులు, ఉప్పు జోడించి గ్రైండ్ చేయాలి. ఈ పిండిని సుమారు పది గంటలు నానబెట్టి ఇడ్లీలు వేసి రోటి పచ్చడి లేదా సాంబార్ తింటే ఎంతో బలం. ■

# కలిసొచ్చిన అదృష్టం

నమ్ముకొని ఓటేసిన ప్రజల సంక్షేమానికి అనునిత్యం పాటుపడాలి. ఈ మాటలే తన మనసులో నింపుకొని ముందుకుసాగుతున్నా రేఖా గుప్తా. విద్యార్థి దశ నుంచే రాజకీయాలపై మక్కువ చూపిన ఆమె తొలుత ఆర్ఎస్ఎస్‌లో చేరారు. ఆపై ఢిల్లీ యూనివర్సిటీ విద్యార్థి సంఘం నాయకురాలిగా, అధ్యక్షురాలిగా సేవలందించారు. ఇక చదువు పూర్తయ్యాక పాలిటిక్స్‌వైపే అడుగులేసిన ఆమె భాజపాలో చేరి వివిధ హోదాల్లో ప్రజలకు సేవలందించారు. ఇన్నేళ్లలో తన రాజకీయ చతురతతో పార్టీ నాయకుల మనసుగెలుచుకున్న ఇప్పుడు ఢిల్లీ ప్రజల మనసులు కొల్లగొట్టారు. అందుకే అసెంబ్లీ ఎన్నికల్లో విజయదుందుభి మోగించారు. భారతీయ జనతా పార్టీ పాలిత పదునాలుగు రాష్ట్రాలలో ఎక్కడా మహిళ ముఖ్యమంత్రిగా లేరు. అదే ఆమె పాలిట వరమయ్యింది. ఆమె షాలిమార్ బాగ్ నుంచి గెలిచిన రేఖా గుప్తా. తొలిసారి గెలిచిన వారికి ఇంత కీలకమైన పదవిని సాహసించి ఒక మహిళకు ఇవ్వడం బహుశా ఇదే మొదటిసారి అనుకోవాలి. చదువుకునే రోజుల్లోనే ఎబివిపి కార్యకర్తగా విద్యార్థి రాజకీయాల్లో ప్రవేశించిన రేఖాగుప్తా ఇపుడు ఢిల్లీ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా గురువారం ఉదయం ప్రమాణస్వీకారం చేశారు. పార్టీ విభాగంలో నమ్మకమైన క్రియాశీలక కర్యకర్తగా పనిచేయడంలో ఆమె ఇప్పుడు ఢిల్లీ సిఎం కాగలిగారు. ఢిల్లీ యూనివర్సిటీ విద్యార్థి సంఘం అధ్యక్షురాలిగా పనిచేశారు. ఎంతమంది సిఎం అభ్యర్థిత్వాన్ని ఆశించినా పార్టీ అగ్రనాయకత్వం



> ఇంటి నుంచి బయటకు వచ్చేటప్పుడు సిఎంను అవుతానని నాకు తెలియదు. 48 మంది ఎమ్మెల్యేల్లో ఒకరిగా భాజపా శాసనసభాపక్ష సమావేశానికి వెళ్లాను.కానీ పర్వేష్ వర్మ నా పేరు ప్రతిపాదించిన తర్వాతే తెలిసింది. 'తన మీద పార్టీ ఉంచిన నమ్మకమే తనకు కొత్త శక్తిని ఉత్తే జాన్ని కొత్త శిఖరాలకు తీసుకెళ్లే నిబద్ధతతో పనిచేస్తా'

రేఖాగుప్తా వైపు మొగ్గు చూపడానికి ఒక ఆచరణాత్మక వ్యూహమే ఆమె పట్ల సానుకూల వైఖరికి అడుగులు వేశాయి.మహిళా కావడంతో పాటు వైశ్య(బనియా) సామాజికవర్గం కూడా కలిసొచ్చింది. ఆప్ అధినేత కేజ్రీవాల్‌ది కూడా బనియా సామాజికవర్గమే. మాజీ సిఎం ఈ రెండు అంశాలనూ బిజెపి అధిష్టానం దృష్టిలో ఉంచుకొంది. ఆమెకు విధేయత ఉంది. 50 ఏళ్ల రేఖ వివాదాలకు దూరంగా ఉంటారు. హరియాణా లోని జుల్నాలో 1974 జులై 19న జన్మించిన రేఖా గుప్తా.. ఢిల్లీ యూనివర్సిటీ పరిధిలోని దౌలత్‌రామ్ కళాశాలలో బికాం చదివారు. ఆ సమయంలోనే (1992) ఎబివిపి ద్వారా విద్యార్థి రాజకీయాల్లోకి ప్రవేశించారు. 1995-96లో ఢిల్లీ వర్సిటీ విద్యార్థి సంఘం కార్యదర్శిగా పని చేశారు. 1996-97లో అధ్యక్షురాలుగా సేవలందించారు. మేరార్‌లోని చౌధరీ చరణ్ సింగ్ విశ్వవిద్యాలయం నుంచి న్యాయశాస్త్ర పట్టా పుచ్చుకున్నారు. ప్రస్తుతం న్యాయవాదిగా పనిచేస్తున్నారు. 1998లో మనీష్ గుప్తాను వివాహం చేసుకున్నారు. ఆయన 'కోటక్ లైఫ్ ఇన్సూరెన్స్'లో పనిచేస్తున్నారు. ఈ జంటకు ఇద్దరు పిల్లలు. 2007-12లో ఉత్తర పీతంపుర మున్సిపల్ కౌన్సిలర్‌గా విజయం సాధించారు. అనంతరం దక్షిణ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. మేయర్‌గా తన పదవీ కాలంలో లైబ్రరీలు, పార్కులు స్విమ్మింగ్ పూల్స్ అభివృద్ధిలో తనదైన ముద్ర చూపించారు. ఆర్థికంగావెనుకబడిన మహిళల కోసం 'సుమేధ యోజన' కార్యక్రమాలకు అంకుర్పణ చేసిన నేతగా ఢిల్లీ ప్రజలకు చిరుపరిచితులే. అదే ఆమెకు కలిసొచ్చింది. శాలీమార్ బాగ్ నుంచి ఆమె ఆప్ అభ్యర్థి వందన కుమారిపై 29,596 ఓట్ల మెజారిటీతో గెలిచారు. శాసనసభా పక్ష నేతగా 50 ఏళ్ల ఓబిసి నేత రేఖా గుప్తాను ఏకగ్రీవంగా ఎనుకున్నారు. సుష్మా స్వరాజ్ షీలా దీక్షిత్, అతిశీల తర్వాత ఢిల్లీ ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించనున్న నాలుగో మహిళా ఆమె నిలిచారు. 2023 ఎన్నికల్లో రాజస్థాన్‌లో బిజెపి గెలిచినా అక్కడ బలమైన నేతగా ఉన్న వసుంధర రాజేని పక్కనబెట్టి కొత్తగా ఎన్నికైన భజన్‌లాల్‌శర్మను సిఎం పీఠంపై కూర్చోబెట్టడంతో పార్టీలో మహిళా సిఎంలు లేరనే లోటు కనిపించింది. దాన్ని ఇప్పుడు ఢిల్లీ ద్వారా భర్తీ చేసింది. బిజెపి నుంచి 9 మంది మహిళలు పోటీ చేయగా నలుగురు గెలిచారు. రేఖా గుప్తాకు గతంలో ఎమ్మెల్యేగానో, ఎంపిగానో చేసిన అనుభవం లేదు.కానీ రాజకీయంగా సుదీర్ఘ అనుభవం ఉంది. ఆమెకు కుటుంబానికి 'సంఘ్' నేపథ్యముంది. ఆర్ఎస్ఎస్‌లో ఆమెకు సన్నిహితసంబంధాలు ఉన్నాయి. సంఘ మహిళా సంబంధిత కార్యక్రమాల్లో ఆమె పాల్గొనేవారు. ప్రస్తుతం పార్టీ మహిళా మోర్చా జాతీయ ఉపాధ్యక్షురాలుగా, పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యురాలిగా ఉన్నారు. బిజెపి నుంచి సుష్మా స్వరాజ్,ఉమాభారతి, వసుంధర రాజే, ఆనందీబెన్ పటేల్ తర్వాత ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టనున్న 5వ మహిళగా,దేశంలో వివిధ పార్టీల నుంచి సీఎం పదవి చేపట్ట నున్న 18వ అతిథిగా రేఖ గుప్తా నిలిచారు. ■



## షార్ట్స్‌తో సూపర్‌హిట్ !

**ఇంతింతై వటుడంతై అన్నట్టుగా సోషల్ మీడియాలో** తక్కువ నిడివి వీడియోలు ట్రెండ్ సృష్టిస్తున్నాయి. ముఖ్యంగా యూట్యూబ్లో షార్ట్స్ హవా, దీనికి క్రియేటర్ల సృజనాత్మకతా ఓ కారణం. పాప్ కల్చర్, వార్తలు, ఫ్యాషన్లు, బ్యూటీ, వ్యక్తిత్వ వికాసం, ఆహారం, నేర్చుకోవడం.. ఇలా ఎన్నో విభాగాల్లో యూట్యూబ్ షార్ట్స్ చూస్తున్నారు. లోకల్ ట్రెండ్స్ స్ఫూర్తితో వీడియోలు చేస్తూ వాటిని గ్లోబల్ కల్చర్ మార్చేస్తున్నారు క్రియేటర్లు షార్ట్స్ ఫార్మాట్ని నిమిషం నుంచి మూడు నిమిషాలకు పెంచుతూ యూట్యూబ్ మార్పు తెచ్చాక మరింత ప్రభావవంతంగా కంటెంటిని చూపిస్తున్నారు కొందరు. షార్ట్స్ ట్రెండ్తో విజయవంతమైనవాళ్లలో ప్రియాల్ కుక్రేజా ఒకరు. తన పేరుతోనే ఏప్రిల్ 2021 యూట్యూబ్ ఛానెల్ మొదలు పెట్టిందీమె. మొదట లాంగ్ ఫార్మాట్ వీడియోలు చేస్తే హిట్ కాలేదు షార్ట్స్ చేసి పెడితే మంచి స్పందన వచ్చింది. ఈమె వీడియోల్లో కొన్ని ట్రెండింగ్ సెక్షన్లో కనిపించేవి. అప్పట్నుంచీ వినోదం, హాస్య విభాగాల్లో షార్ట్స్ చేస్తుందీ ఢిల్లీ అమ్మాయి. చాలా వీడియోలకు కోట్లలో వీక్షణలు వచ్చాయి. ఏడాదికే పది లక్షలు, రెండేళ్లకు కోటి మంది సబ్స్రైబర్లు ఉంటే నాలుగేళ్లలో ఆ సంఖ్య నాలుగు కోట్లకు చేరింది. సామాన్యుల జీవితంలో ఎదురయ్యే సంఘటనలతో వీడియోలు తీస్తా చివర్లో హాస్యం తెప్పించే ట్విస్ట్ పెడతా. పాపులర్ పాటలు, బయట ప్రపంచంలో ఏం జరుగుతుందో తెలుసుకుంటూ షార్ట్స్ చేస్తా మీకంటూ ఒక ప్రత్యేకత ఉంటే ఒరిజినల్ కంటెంట్ సృష్టించండి. ట్రెండ్స్ ఫాలో అవుతూ, నిరంతరం వీడియోలు అప్లోడ్ చేస్తే విజయం సాధించవచ్చుఖ అంటూ తన అనుభవాల్ని చెబుతుంది ప్రియాల్. ■



## ఎర్రెర్రని ఎండుమిర్చి చట్నీ

మేమోసారి రాజస్థాన్ వెళ్లినప్పుడు అక్కడివారి చిల్లీ అనియన్ చట్నీ నచ్చింది. ఎలా చేయాలో ఒక పెద్దావిడని అడిగి తెలుసుకున్నాను. ఇంటికి తిరిగొచ్చాక చేస్తే.. మా వాళ్లంతా బాగుపడింది. ఈ చట్నీకి కశ్మీరీ ఎండుమిర్చి 20, ఉల్లిపాయలు ఏడెనిమిది, చింతపండు నిమ్మకాయంత, ధనియాలు, సోంపు, జీలకర్ర టేబుల్‌స్పూన్ చొప్పున, కరివేపాకు రెండు రెబ్బలు, పొట్టు తీసిన వెల్లుల్లి రెబ్బలు ముప్పావు కప్పు, సన్నగా తరిగిన అల్లం ముక్కలు చెంచా, నూనె కప్పు, తాలింపు దినుసులు తీసుకోవాలి. ఎలా చేయాలంటే ముందుగా ఉల్లిపాయల పొట్టు తీసి ముక్కలు కోయాలి. ఎండుమిర్చి తొడిమెలు తీసి రెండు మూడు ముక్కలుగా కత్తిరించాలి. కప్పు వేడినీళ్లు పోసి పక్కనుంచాలి. చింతపండును కడిగి, వేడినీళ్లతో నానబెట్టాలి ధనియాలు, సోంపు, జీలకర్రలను సన్న పెద్ద మీద వేయించి చల్లారాక గ్రైండ్ చేయాలి. అదే జార్లో ఉల్లిపాయ ముక్కలు, వెల్లుల్లి, కరి వేపాకు, వానిన ఎండుమిర్చి, చింతపండు వేసి మెత్తగా గ్రైండ్ చేయాలి. కడాయిలో నూనె వేడయ్యాక ఆవాలు, మినపప్పు, వెల్లుల్లి, జీలకర్ర వేయాలి. అవి వేగాక కరివేపాకు, ఇంగువ, మిర్చి మిశ్రమం చేసి ఐదారు నిమిషాలు వేగనిచ్చి దించేస్తే సరిపో తుంది. ఎర్రెర్రగా నోరూరించే మిర్చి ఉల్లి చట్నీ తయారైపో తుంది. ■



## చిలుకలతో స్నేహం !

రాధిక సోనావనేశు చిలుకలు, పిచ్చుకలు, బుల్బుల పిట్ట, టైలర్ బర్డ్ వంటి పక్షులు కిలకిలరావాలతోనే తెల్లవారుతుంది. తన బాల్కనీలో ఈ స్నేహితుల సందడి లేకపోతే ఈమెకు రోజు గడవదు. పక్షులనెంతో ప్రేమించే ఈమె, వీటితో తనకు స్నేహం ఏర్పడింది కొవిడ్‌లోనే అంటుంది. ఖఆ సమయంలో ఎవరికివారు ఇళ్లల్లో ఒంటరిగా గడిపేవారు. అప్పుడే వీటితో పరిచయం ఏర్పడింది. అయితే ఇదంతా అనుకున్నంత తేలికగా జరగలేదు. ఓరోజు రెండు మూడు చిలుకలు నా బాల్కనీలో వాలాయి వాటి కళ్లల్లో భయం కనిపించింది, దగ్గరకెళితే ఎగిరిపోయాయి. ఎలాగైనా వాటితో స్నేహం చేసింది. మరుసటి రోజు తెలవారుతుండగానే బాల్కనీలోకి వెళ్లి, వాటికిష్టమైన గింజలు వేశా. అలా రెండు మూడు రోజుల తర్వాత ధైర్యంగా మా బాల్కనీలో గింజలను తిన డానికి రావడం మొదలైంది. మెల్లగా నాకు స్నేహి తులయ్యాయి. రెండు మూడు నెలలకే 30కి పైగా చిలుకల తోపాటు రకరకాల పిట్టలు నా ముందు వాలేవి. కబుర్లు చెబుతూ నా చేత్తోనే ప్రేమగా వాటికి ఆహా రాన్ని అందిస్తుంటే సమయ మెలా గడిచిందో తెలిసేది కాదు. అప్పటి నుంచి మా మధ్య ఏర్పడిన స్నేహ బంధం ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది. పక్షుల పెంపకం పర్యావరణానికీ మంచిది. అలాగే మనకీ ఒత్తిడి చూరమవుతుంది. అలాగని వాటిని పంజరాల్లో బందీగా ఉంచకూడదు. స్వేచ్ఛగా ఎగరనిస్తూ ప్రేమగా పెంచాలిఖ అని చెప్పే రాధికది మహారాష్ట్రలోని ఔరంగాబాద్. ఎంబీఏ చేసి పుణెలో ఓ ప్రైవేటు బ్యాంకులో విధులు ఉంటే ఈ పక్షి ప్రేమికురాలిని అభినందిం చడమే కాదు, వీలైతే అనుసరిద్దాం! ■




## వీటికి దూరంగా ..



మధుమేహం ఉన్నవారితో పాటు, అధిక బరువు తగ్గాలనుకునే కొంతమంది చక్కెరకు బదులుగా కృత్రిమ తీపి పదార్థాలను తీసుకుంటుంటారు. అయితే ఇది ఆరోగ్యానికి అంత మంచిది కాదంటున్నారు నిపుణులు ఈ క్రమంలో కృత్రిమ తీపి పదార్థాల విషయంలో జాగ్రత్తగా ఉండాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కొన్ని ఆహార పదార్థాల్లాగే కృత్రిమ తీపి పదార్థాలు కూడా అందరికీ పడకపోవచ్చు. కొంతమందిలో వీటిని తీసుకోవడం ద్వారా కడుపుబ్బరం, జీర్ణ సంబంధిత సమస్యలు వచ్చే అవకాశం ఉంటుంది. కాబట్టి వీలైనంతవరకు వీటికి దూరంగా ఉండడమే మంచిదంటున్నారు.



**క్యాలరీల విషయంలో......** కృత్రిమ తీపి పదార్థాల్లో క్యాలరీలు తక్కువగా ఉంటాయి. కొన్ని పదార్థాల్లో అయితే అసలు క్యాలరీలే ఉండవు. అందుకే కొంతమంది తమ ఫిటెనెస్ కాపాడుకోవడానికి, బరువు తగ్గడానికి ప్రయత్నించే వారు కూడా కృత్రిమ తీపి పదార్థాలను తమ ఆహారంలో భాగం చేసుకుంటారు.. అయితే ఆరోగ్యకరమైన బరువు ఉండాలంటే శరీరానికి అవసరమైన నిర్ణీత క్యాలరీల విషయంలో రాజీ పడకూడదంటున్నారు నిపుణులు.

**సహజసిద్ధమైనవే.!.....** కృత్రిమ తీపి పదార్థాలు సహజ సిద్ధంగా లభించే పదార్థాలను ఎప్పటికీ భర్తీ చేయలేవు. కాబ తక్కువ క్యాలరీలు ఉన్న తీపి పదార్థాల కోసం సహజంగా లభించే పదార్థాలను ఉపయోగించడం మంచిదంటున్నారు నిపుణులు. వీటిని తీసుకోవడం వల్ల కేవలం రుచి మాత్రమే కాకుండా ఆ ప్రయోజనాలను కూడా పొందే అవకాశం ఉంటుంది.



**నిపుణులను సంప్రదించాలి...**

అలాగే మధుమేహ కృత్రిమ తీపి పదార్థాలను వాడే విషయంలో సంబంధిత వైద్యులను సంప్రదించడం మంచిది.

నీటి మోతాదు తగ్గకుండా...మనం ఆరోగ్యంగా ఉండాలంటే రోజూ తగినన్ని నీళ్లు తీసుకోవడం తప్పనిసరి. అయితే కొంతమంది కృత్రిమ తీపి పదార్థాలు ఉన్న పానీయాలు తీసుకున్నప్పుడు నీళ్లు తాగరు. కానీ, ఇలాంటప్పుడు కూడా నీళ్లు తాగాలంటున్నారు నిపుణులు. నీళ్లు శరీరంలోని మలినాలను తొలగించి డీహైడ్రేషన్‌కు గురి కాకుండా కాపాడతాయి. అయితే ఇంతకు చెప్పుకొన్నట్లు కృత్రిమ తీపి పదార్థాలు ఉండే పానీయాలు, పదార్థాలకు ముందుగా దూరంగా ఉండడము మంచిదంటున్నారు నిపుణులు.

## ఆనందంగా జీవించాలి..

ధర్మరాజు మాయాజూదంలో ఓడిపోయాడు. నియమం మేరకు తమ్ములతో కలిసి అరణ్యవాసం, అజ్ఞాతవాసం పూర్తిచేశాడు. తదుపరి జరగాల్సిన కార్యక్రమాలన్నీ పూర్తయ్యాయి. వాళ్లంతా తాము పడిన కష్టాల గురించి మాట్లాడుకుంటున్న సందర్భంలో మనం ఎన్ని ఇబ్బందులు పడినా చివరికి ధర్మమే జయించింది అని ధర్మరాజు చెప్పగా.. కష్టాన్ని వెన్నంటి ఆనందం ఉంటుంది. మోహం వల్ల సంతోషం కలిగే మాట నిజమే కానీ అది శాశ్వతం కాదు, కలిగినంత త్వరగానే మాయమోతుందన్న పెద్దల మాటను గుర్తుచేసు కున్నారు సోదరులు. కీచకుడు ద్రౌపది అందం చూసి మోహించాడు. ఆమెని సొంతం చేసుకోవాలన్న దుర్బుద్ధితో వెంటాడుతూ వేధించ సాగాడు. అది గమనించిన భీమసేనుడు యుద్ధానికి దిగాడు. కీచకుడు హతమయ్యాడు. మోహావేశంతో కూడిన పరవశం అతడితోనే అంతమయింది సీతమ్మను చెరపట్టిన రావణుడు తాను గొప్ప ఘనకార్యం చేశానని అహం కారంతో విర్రవీగాడు. నిత్యం అశోకవనానికి వెళ్లి, శ్రీరాముణ్ణి నిందిస్తూ ఆనందించేవాడు. కానీ రాముడు వానరసేనతో లంకకు వెళ్లాడు. రావణాసురుణ్ణి సంహరించాడు. అక్కడితో లంకేశ్వరుడి అహంకారంతో కూడిన ఆనందం ముగిసింది. అల్ప సంతోషం కంటే నిత్యం ఉండే ఆనందసిద్ధి కోసం మనం ప్రయత్నించాలి.. పరమశివుణ్ణి పతిగా పొందటం కోసం పార్వతీదేవి కఠోర తపస్సు చేసింది. బలిష్టమైన పురుషులకు మాత్రమే సాధ్యమయ్యే మహా తపస్సు స్త్రీమూర్తి అయిన పార్వతి చేసిందంటూ సప్తరుషులు ఎంతగానో ప్రశంసించారు. అద్వైత ఆనందాన్ని పొందటం కోసమే ఆమె తపస్సు చేసిందని కాళిదాసు కుమారసంభవంలో వివరించాడు. దర్మం ఉత్కృష్టమైంది అన్నది పురాణవచనం. ■



ఆధ్యాత్మికం

## ఈ రిబ్బన్ కథ?



1806లో ఎయిడ్స్‌పై అవగాహన కోసం రెడ్ రిబ్బన్‌కు ప్రాణం పోశారు. తరువాత క్యాన్సర్పై అవగాహన కలిగించడంలోనూ రిబ్బన్ని ఉపయోగిస్తున్నారు. నేషనల్ క్యాన్సర్ ఇన్ కోర్సు ప్రకారం ఒక్కో క్యాన్సర్‌కి ఒక్కో రిబ్బన్ని కేటాయించారు.

- ! రొమ్ము క్యాన్సర్ గులాబీ
- లుకేమియా వారింజ
- ! చర్మ క్యాన్సర్ నలుపు
- ఊపిరితిత్తుల క్యాన్సర్ తెలుపు
- బోన్ క్యాన్సర్ పసపు!!

అండశయ క్యాన్సర్ టీల్ బ్లూ!! థైరాయిడ్ క్యాన్సర్ నీలం, గులాబీ, టీల

- ఎండోమెట్రి యల్ క్యాన్సర్ పీచ్
- సర్వైకల్ క్యాన్సర్ టీల్ అండ్ వైట్ రిబ్బన్
- యోని (లియోమియోసార్కోమా) క్యాన్సర్ వంకాయ వర్ణం
- అన్ని రకాల క్యాన్సర్లకీ లావెండర్ (ఊదా) ■

## కురుల ఆరోగ్యానికి మెంతి

ఇతర ఆకు కూరలతో తాజా మెంతికూర కొంచెం తక్కువ వినియోగిస్తాం కదూ! నిజానికి ఇది చాలా శ్రేష్టమైంది. ఇందులో ఎ,సి,ఇ విటమిన్లు, కెరోటిన్, క్యాల్షియం, ఐరన్, సోడియం, కాపర్, మెగ్నీషియం, జింక్, పొటాషియం, సెలయం, మాంగనీస్, ప్రొటీన్లు విస్తారంగా ఉన్నాయి. రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. కొలెస్ట్రాల్ నియంత్రణలో ఉంటుంది. ఇన్సులిన్ స్థాయి సమంగా ఉంటుంది". మధుమేహం అదుపులో ఉంటుంది. ఉబ్బసం, కడుపుబ్బరం తగ్గుతాయి. యాంటీఆక్సిడెంట్లు విస్తారంగా ఉన్నందున వ్యాధి నిరోధకంగా పనిచేస్తుంది. ఇందులోని విటమిన్ దంతాలు, ఎముకలను ఆరోగ్యంగా, దృఢంగా ఉంచుతుంది. బాలింతలకు పాలు పడతాయి.. ఫోలిక్ యాసిడ్ గర్భిణీలకు మేలు చేస్తుంది. ■



## ఐ-లీగ్ జాతీయ ఫుట్‌బాల్ టోర్నీలో..
# హైదరాబాద్ శ్రీనిధి డెక్కన్ విజయం
### 2-1 తేడాతో రాజస్థాన్ యునైటెడ్ ఓటమి

**ఢిల్లీ:** ఐ-లీగ్ జాతీయ ఫుట్బాల్ టోర్నమెంట్‌లో హైదరాబాద్‌కు చెందిన శ్రీనిధి డెక్కన్ ఫుట్బాల్ క్లబ్ (ఎఫ్సీ) జట్టు ఐదో విజయం నమోదు చేసింది. జైపూర్‌లో జరిగిన మ్యాచ్‌లో శ్రీనిధి డెక్కన్ ఎఫ్సీ 2-1 గోల్స్ తేడాతో రాజస్తాన్ యునైటెడ్ ఎఫ్సీ జట్టును ఓడించింది. 10 మ్యాచ్‌ల తర్వాత రాజస్తాన్ జట్టుకు ఇది తొలి ఓటమి కావడం గమనార్హం. శ్రీనిధి జట్టు తరఫున ఏంజెల్ ఒరెలియన్ (43వ నిమిషంలో), డేవిడ్ కాస్టనెడా మునోజ్ (73వ నిమిషంలో) ఒక్కో గోల్ చేశారు. రాజస్తాన్ యునైటెడ్ జట్టుకు మైకోల్ కబ్రెరా (75వ నిమిషంలో) ఏకైక గోల్ అందించాడు. ఈనెల 25న జరిగే తదుపరి మ్యాచ్‌లో డెంపో స్పోర్ట్స్ క్లబ్‌తో హైదరాబాద్ శ్రీనిధి డెక్కన్ ఎఫ్సీ జట్టు తలపడుతుంది. 12 జట్లు పోటీపడుతున్న ఈ ఐ-లీగ్‌లో 15 మ్యాచ్ పూర్తి చేసుకున్న శ్రీనిధి జట్టు 19 పాయింట్లతో ఎనిమిదోస్థానంలో ఉంది.



## జాతీయ పారా అథ్లెట్‌లో..
# తెలంగాణ అమ్మాయికి స్వర్ణం

**న్యూఢిల్లీ:** జాతీయ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణకు స్వర్ణ పతకం లభించింది. చెన్నైలో జరుగుతున్న ఈ టోర్నీలో తెలంగాణ అమ్మాయి, అంతర్జాతీయ పారాథ్లెట్ జివాంజి దీప్తి 400 మీటర్ల విభాగంలో విజేతగా నిలిచింది.

దీప్తి అందరికంటే వేగంగా, అందరి కంటే ముందుగా 57.82 సెకన్లలో గమ్యానికి చేరి పసిడి పతకాన్ని సొంతం చేసుకుంది. హర్యానాకు చెందిన పూజా 1:08.21 సెకెన్లలో గమ్యాన్ని చేరుకుని రజతం సొంతం చేసుకోగా, హర్యానాకే చెందిన భువి అగర్వాల్ కాంస్యం దక్కించుకుంది.








## మహిళల ప్రీమియర్ లీగ్‌లో..
# ఢిల్లీ క్యాపిటల్స్ రెండో విక్టరీ
### 7 వికెట్ల తేడాతో యుపి వారియర్స్ ఓటమి

**న్యూఢిల్లీ:** మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) టీ20 టోర్నీలో ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు రెండో విజయం నమోదు చేసుకుంది. వడోదర వేదికగా జరిగిన పోరులో ఢిల్లీ క్యాపిటల్స్ 7 వికెట్ల తేడాతో యూపీ వారియర్స్‌పై నెగ్గింది. అనాబెల్ సదర్లాండ్ ఆల్‌రౌండ్ ప్రదర్శన కనబర్చడం వల్ల ఈ విజయం సాధ్యమైంది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన యూపీ వారియర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 166 పరుగులు చేసింది. ఢిల్లీ ప్లేయర్లలో ఓపెనర్ కిరణ్ నవగిరె (27 బంతుల్లో 51; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు) శుభారంభం అందివ్వగా, శ్వేత సెహ్రావత్ (37; 4 ఫోర్లు, 1 సిక్స్) హెన్రీ (15 బంతుల్లో 33 నాటౌట్; 3 ఫోర్లు, 3 సిక్సులు) రాణించారు. ఢిల్లీ బౌలర్లలో అనాబెల్ 2 వికెట్లు తీసింది. అనంతరం లక్ష్యఛేదనలో ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు 19.5 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 167 పరుగులు చేసింది. మెగ్ లానింగ్ (49 బంతుల్లో 69; 12 ఫోర్లు) కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడగా, ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అనాబెల్ (41 నాటౌట్; 4 ఫోర్లు), మరిజాన్ కాప్ (29 నాటౌట్; 4 ఫోర్లు), షఫాలీ వర్మ (26; 3 ఫోర్లు, 1 సిక్స్) కీలక పరుగులు చేశారు. యూపీ వారియర్స్ బౌలర్లలో సోఫియా, దీప్తి శర్మ, గ్రేస్ హ్యారిస్ తలా ఒక వికెట్ తీశారు.

## ఖతర్ ఓపెన్ టెన్నిస్ టోర్నీలో..
# బోపన్న జోడీ శుభారంభం



**న్యూఢిల్లీ:** ఖతర్ ఓపెన్ ఏటీపీ-500 టెన్నిస్ టోర్నీ పురుషుల డబుల్స్ విభాగంలో రోహన్ బోపన్న (భారత్)-నునో బోర్గెస్ (పోర్చుగల్) జోడీ సంచలన విజయంతో శుభారంభం చేసింది. దోహాలో జరిగిన తొలి రౌండ్ మ్యాచ్‌లో బోపన్న-బోర్గెస్ ద్వయం 7-6 (7/2), 7-6 (7/4)తో రెండో సీడ్ సిమోన్ బొలెలీ-ఆండ్రియా వావాసోరి (ఇటలీ) జంటను బోల్తా కొట్టించింది. 89 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో బోపన్న ద్వయం ఏడు ఏస్లు సంధించింది. మ్యాచ్ మొత్తంలో రెండు జంటలు తమ సర్వీస్‌లను నిలబెట్టుకోవడంతో టైబ్రేక్‌లు అనివార్యమయ్యాయి. టైబ్రేక్స్‌లో బోపన్న-బోర్గెస్ పైచేయి సాధించి విజయాన్ని అందుకోవడంతో పాటు, క్వార్టర్ ఫైనల్ బెర్తును ఖరారు చేసుకున్నారు.

# ఛాంపియన్స్ ట్రోఫీలో డేంజరస్ టీమ్
### టీమిండియాకు టెర్రర్
### మూడో మ్యాచ్‌కు ఇబ్బందులు

**న్యూఢిల్లీ:** ఛాంపియన్స్ ట్రోఫీలో భారత జట్టుకు ఇబ్బందులు మూడో మ్యాచ్ నుంచి ఎదురుకానున్నాయి. టోర్నీ మూడో మ్యాచ్‌లో న్యూజిలాండ్ జట్టుతో తలపడేందుకు టీమిండియా సిద్ధమైంది. ఐసీసీ ఈవెంట్లలో భారత జట్టుకు కివీస్ పెద్ద తలనొప్పిలా మారింది. ఎల్లప్పుడూ టీమిండియాపై ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తూనే ఉంది. ఈసారి భారత్, న్యూజిలాండ్ జట్లు ఒకే గ్రూప్‌లో ఉన్నాయి. ఈ నెల 23 ఆదివారం దుబాయ్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో రెండు జట్లు తలపడనున్నాయి. గత ఎడిషన్‌లో, భారత జట్టు తమ గ్రూప్‌లో అగ్రస్థానంలో నిలిచి ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్‌కు చేరుకుంది. కానీ, చివరికి పాకిస్తాన్ చేతిలో ఓడిపోయింది. మరోవైపు, న్యూజిలాండ్ తమ గ్రూప్‌లో చివరి స్థానంలో నిలిచింది. మూడు మ్యాచ్‌ల్లో ఒక్కటి కూడా గెలవలేకపోయింది. అయితే, రాబోయే ఎడిషన్‌లో టోర్నమెంట్ గెలవడానికి భారత్, న్యూజిలాండ్ రెండూ ఫేవరెట్‌లలో ఉన్నాయి. 2025 ఛాంపియన్స్ ట్రోఫీకి భారతదేశం సిద్ధమవుతుండగా, న్యూజిలాండ్‌ను చూసి టీం ఇండియా కాస్తంత భయపడుతోంది. ఐసీసీ ఏ ఈవెంట్‌లోనైనా నాకౌట్ మ్యాచ్‌లలో న్యూజిలాండ్ ఎల్లప్పుడూ భారతదేశాన్ని ఇబ్బంది పెడుతుంది. 2000 సంవత్సరంలో, కివీస్ జట్టు ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్లో భారత్‌ను ఓడించింది. సెమీఫైనల్స్ లో 2019 ప్రపంచ కప్ నుంచి భారత జట్టును ఓడించింది. ఇటీవల పాకిస్థాన్‌లో జరిగిన ముక్కోణపు సిరీస్‌లోని తొలి మ్యాచ్‌లో న్యూజిలాండ్ 78 పరుగుల భారీ తేడాతో పాకిస్థాన్‌ను ఓడించింది. తదుపరి మ్యాచ్‌లో దక్షిణాఫ్రికాపై 305 పరుగుల లక్ష్యాన్ని ఛేదించి 6 వికెట్ల తేడాతో సులభంగా ఓడించింది. చివరికి పాకిస్తాన్‌పై ఫైనల్ మ్యాచ్‌ను కూడా గెలుచుకుంది. ఇక ఛాంపియన్స్ ట్రోఫీకి ముందే న్యూజిలాండ్ బ్యాటింగ్ లైనప్ ఫామ్‌ను కనుగొంది. ట్రైసిరీస్‌లో, అనేక మంది కివీస్ బ్యాట్స్‌మెన్స్ ఫామ్‌ను కనుగొన్నారు. ఐసీసీ ఈవెంట్‌లోకి వెళ్లే ముందు పూర్తి విశ్వాసంతో బరిలోకి దిగనుంది. ఈ టోర్నమెంట్‌లో కేన్ విలియమ్సన్ మూడు ఇన్నింగ్స్‌లలో 112.50 సగటుతో 225 పరుగులు చేసి అత్యధిక పరుగులు సాధించిన ఆటగాడిగా నిలిచాడు. గ్లెన్ ఫిలిప్స్ (మూడు మ్యాచ్‌ల్లో 154 పరుగులు), డారిల్ మిచెల్ (మూడు మ్యాచ్‌ల్లో 148 పరుగులు), డెవాన్ కాన్వే (రెండు మ్యాచ్‌ల్లో 145 పరుగులు) వంటి బ్యాట్స్‌మెన్ కూడా పరుగుల స్కోరు చేసిన వారిలో ఉన్నారు.





ఆట





## హాకీ ప్రొ లీగ్‌లో..
## భారత్ పురుషుల జట్టు
# సంచలనం
### వరల్డ్ ఛాంపియన్ జర్మనీపై 1-0తో గెలుపు
### స్పెయిన్ చేతిలో భారత్ మహిళల టీం ఓటమి

**న్యూఢిల్లీ:** అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్ఐహెచ్) ప్రొ లీగ్‌లో భారత పురుషుల జట్టు సంచలనం సృష్టించింది. ప్రపంచ చాంపియన్ జర్మనీ జట్టుతో భువనేశ్వర్‌లో జరిగిన రెండో రౌండ్ రెండో మ్యాచ్‌లో టీమిండియా 1-0 గోల్ తేడాతో విజయం సాధించింది. ఆట నాలుగో నిమిషంలో గుర్జంత్ సింగ్ చేసిన గోల్‌తో భారత్ 1-0తో ఆధిక్యంలోకి వెళ్లింది. ఆ తర్వాత చివరి వరకు ఈ ఆధిక్యాన్ని కాపాడుకుంటూ వచ్చిన భారత్ చివరకు విజయాన్ని ఖరారు చేసుకుంది.

అంతకు ముందు జర్మనీతో జరిగిన రెండో రౌండ్ తొలి మ్యాచ్‌లో భారత్ 1-4 గోల్స్ తేడాతో పరాజయం పాలైంది. మరోవైపు భారత మహిళల జట్టుకు మరో ఓటమి ఎదురైంది. స్పెయిన్ జట్టుతో జరిగిన రెండో రౌండ్ రెండో లీగ్ మ్యాచ్‌లో భారత జట్టు 0-1తో ఓడిపోయింది.

స్పెయిన్ తరఫున సెగూ మార్టా (49వ నిమిషంలో) ఏకైక గోల్ సాధించింది.

# చదువు మానేయాలన్న నిర్ణయం బాధించింది: బిల్ గేట్స్



వాణిజ్యం

**వాషింగ్టన్, ఫిబ్రవరి 20:** మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాప కుడు బిల్ గేట్స్ (బిల్ గేట్స్) తన కాలేజీ జీవితం గురించి పలు ఆసక్తికర విష యాలు. హార్డు యూనివర్సిటీలో చదువు మానేయాలనే నిర్ణయం తీసుకున్న ప్పుడు చాలా బాధపడినట్లు చెప్పా రు. సోర్స్ కోడ్ మై బిగినింగ్స్ పేరుతో తాను తీసుకొచ్చిన పుస్తకంలో ఆసక్తికర విషయా లన్నీ తాజాగా పాల్గొన్న ఓ కార్యక్రమంలో పంచుకున్నారు. కళాశాల రోజులు చాలా ఆహ్లాదకరంగా గడిచాయని, ఆనాటి రోజులను గుర్తుకు తెచ్చుకున్నారు. హార్వర్డ్‌లో బాగా ఎంజాయ్ చేశాను. మనస్తత్వ శాస్త్రం, ఆర్థిక శాస్త్రం, చరిత్రకు సంబంధించిన తరగతులను ఆస్వాదించేవాడిని. తెలివైన వాళ్లతో సమయం గడపడం నాకు నచ్చేది. ఆసక్తికరమైన విషయాలపై రాత్రిళ్లు చర్చించేవాళ్లం అని గేట్స్ అన్నారు.

1975లో సాఫ్ట్‌వేర్ కంపెనీ తొలి సీఈవోగా బాధ్యతలు చేపట్టేందుకు హార్వర్డ్ యూని వర్సిటీలో చదువు మానేయాల్సి వచ్చిందని బిల్ గేట్స్ ఏర్పాటు చేసింది. ఆ నిర్ణయం తీసుకోవడం చాలా బాధను కలిగించింది. డిగ్రీ పూర్తిచేసేందుకు హార్వర్డ్‌కు తిరిగి వెళ్లాలనిపించింది. అయితే వచ్చిన అందిపుచ్చు కొనేందుకు తాను, తన స్నేహితుడు అయిన పాల్‌అలెన్ను, కళాశాలను విడిచిపెట్టాల్సి వచ్చిందని గేట్స్ చెప్పారు. ఆసమయంలో గేట్స్, అలెన్ ఇద్దరూ కంప్యూటర్ల కోసం ఒక సాఫ్ట్‌వేర్‌ను సృష్టించగలిగితే కొత్త పరిశ్రమలో ముందంజలో ఉండగలమని భావించారు. అలా రెండేళ్లు మైక్రోసాఫ్ట్‌ను నడుపుతూనే తన చదువును బ్యాలెన్స్ కోసం ప్రయత్నించారు. తన చదువు పూర్తి చేయడానికి మరో స్నేహితుడు. మైక్రోసాఫ్ట్ ప్రోగ్రామర్ అయిన రిక్ వీలాండ్ సాయం తీసుకోవాలనుకున్నారు. కానీ అది కుదరలేదు. ఇక చివరకు చదువు మానే యాల్సి వచ్చిందని చెప్పారు. ఇదిలా ఉంటే, సోర్స్ కోడ్ పుస్తకాన్ని మూడు భాగాలుగా తీసుకొస్తున్నారు. వాల్యూమ్ 1లో తన చిన్ననాటి సంగతులు, డ్రగ్స్‌తో ప్రయోగం లాంటి వివరాలను మాత్రమే గేట్స్ ప్రస్తావించారు. తన ఉద్యోగ జీవితం, మైక్రోసాఫ్ట్ ప్రయాణం, మెలిందా గేట్స్‌తో వివాహం, దాతృత్వ కార్యక్రమాలకు చోటు కల్పించలేదు. భవిష్యత్తులో విడు దల చేసే పుస్తకాల్లో వాటి గురించి వివరించే అవకాశం ఉంది. 2000 సంవత్సరం వరకు మైక్రోసాఫ్ట్ సిఇఒగా గేట్స్ విధులు నిర్వర్తించారు. తన పదవీకాలంలో కంప్యూటర్ పరిశ్రమలో విప్లవాత్మక మార్పులను తీసుకొచ్చారు. ప్రపంచంలోనే అత్యంత ధనవంతుల్లో ఒకరిగా నిలిచారు.

# పిఎన్‌బి వడ్డీరేట్ల తగ్గింపు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20:** దాదాపు ఐదేళ్ల తర్వాత రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఇటీవల రెపో రేటును తగ్గించింది. దానికి అనుగుణంగా ఇప్పుడు బ్యాంకులు కూడా రుణ రేట్లను సవరిస్తున్నాయి. ఇటీవల ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా వడ్డీరేట్లను తగ్గించగా, ఇప్పుడు మరో ప్రభుత్వ రంగ పిఎన్‌జి కూడా అదే నిర్ణయం తీసుకుంది. రిటైల్ రుణాలపై 25 బేసిస్ పాయింట్ల వరకు వడ్డీ రేట్లను తగ్గిస్తున్నట్లు పంజాబ్ నేషనల్ బ్యాంకు గురువారం ప్రకటించింది. కొత్త వడ్డీ రేట్లు ఫిబ్రవరి 10 నుంచి అమల్లోకి తీసుకొచ్చినట్లు బ్యాంకు తాజా ప్రకటనలో వెల్లడించింది. గృహరుణాలతో పాటు, కారు ఎడ్యుకేషన్, పర్సనల్ లోన్లపై ఈ తగ్గింపు వర్తించనుంది. తాజా సరవణతో పిఎన్‌బిలో గృహరుణాల ప్రారంభ రేటు 8.15 శాతానికి దిగొచ్చింది. దీంతో రూ.లక్ష రుణానికి ఇఎంఐ రూ.744గా ఉంటుందని బ్యాంకు తెలిపింది. ఇక ఆటోమొబైల్ రుణాలపై వడ్డీ రేటు 8.50 శాతం నుంచి ప్రారంభం కానుంది. విద్యా రుణాలపై కనిష్ట వడ్డీని 7.85 శాతానికి తగ్గించినట్లు పిఎన్‌బి తెలిపింది. అటు వ్యక్తిగత రుణాలపై సవరించిన వడ్డీరేటు 11.25 శాతంగా ఉన్నట్లు పేర్కొంది. ఫిబ్రవరి 7న రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా రేపో రేటును 6.50శాతం నుంచి 25 బేసిస్ పాయింట్లు తగ్గింపు 6.25 శాతానికి తగ్గించిన విషయం విదితమే. దీంతో పలు బ్యాంకులు కూడా తమ రుణాలపై వడ్డీ రేట్లను సవరిస్తున్నాయి. గత వారం ఎక్స్‌టర్నల్ బెంచ్‌మార్క్ ఆధారిత లెండింగ్ రేట్, రెపో లింక్డ్ లెండింగ్ రేట్లను ఎస్‌బిఐ 25బేసిస్ పాయింట్ల మేర తగ్గించింది.





# గూగుల్ పేలోనూ ఇక ఛార్జీల మోత!

**ముంబై, ఫిబ్రవరి 20:** గూగుల్‌కు చెందిన పేమెంట్ యాప్ గూగుల్ పే (గూగుల్ పే) విద్యుత్, గ్యాస్ వంటి బిల్ పేమెంట్లపైనా ఛార్జీలు వసూలు చేస్తోంది. ఇప్పటివరకు ఈతరహా లావాదేవీలపై ఎలాంటి ఫీజూ విధించేది కాదు. ఇక నుంచి క్రెడిట్ కార్డు, డెబిట్ కార్డు ద్వారా లావాదేవీలపై కన్వీనియన్స్ ఫీజు రూపంలో స్వల్ప మొత్తంలో రుసుము వసూలుచేసేందుకు సిద్ధమైంది. యూపీఐ లావాదేవీలకు మాత్రం ఈ ఛార్జీలు వర్తించవు. ఇతర పేమెంట్ ప్లాట్‌ఫామైన పేటీఎం, ఫోన్‌పేలు ఇప్పటికే ఈ తరహా ఫీజును వసూలు చేస్తుండగా, ఇన్నాళ్లూ ఉచితంగా అందించిన గూగుల్ పే సైతం ఇకనుంచి వాటి బాటలోనే నడవనుంది. గూగుల్‌పే మొబైల్ రీఛార్జీలపై రూ.3 కన్వీనియన్స్ ఫీజు రూపంలో వసూలు చేస్తోంది. ఇకపై క్రెడిట్, డెబిట్ కార్డు చేసే విద్యుత్, గ్యాస్ బిల్ పేమెంట్లపై 0.5 శాతం నుంచి 1 శాతం వరకు ఛార్జీలు విధిస్తున్నట్లు సూచిస్తున్నాయి. గూగుల్‌పేలో ఇటీవల క్రెడిట్ కార్డ్ ద్వారా విద్యుత్ బిల్లు చెల్లించిన ఓ యూజర్‌కు ఈ అనుభవం ఎదురైనట్లు ఓ ఆంగ్లమీడియా సంస్థ ఉదాహరణను ఉటంకించింది. తాను చెల్లించిన కరెంట్ బిల్‌పై రూ.15 కన్వియన్స్ ఫీజు రూపంలో గూగుల్ పేమెంట్ వసూలు చేసినట్లు ఆ వ్యక్తి పేర్కొన్నాడు. ఈ పేమెంట్ ప్లాట్‌ఫామ్ ఇప్పటికే ఛార్జీల వసూలు మొదలు పెట్టినట్లు తెలుస్తోంది. అయితే ఈ రుసుములు అందరికీ వర్తిస్తాయా? లేదా? అనే విషయం ఇంకా తెలియలేదు. భవిష్యత్‌లో అందరినుంచీ ఈ ఫీజు వసూలు చేసే అవకాశం ఉందని టెక్‌లు ఉన్నాయి. అయితే ఒప్పందం గూగుల్ పే ఎక్కడా అధికారికంగా వివరాలు వెల్లడించలేదు. పే గూగుల్ వెబ్‌సైట్ ప్రకారం.. కార్డ్ పేమెంట్ ప్రాసెసింగ్ ఖర్చుల్ని కవర్ చేయడానికి ఈ రుసుము సాయపడుతుందని, ఇప్పటికే అనేక ఫిన్టిక్, క్విక్కామర్స్, ఫుడ్ డెలివరీ సంస్థలు ప్లాట్‌ఫామ్ ఫీజు వసూలు చేయడం ప్రారంభించాయి. ఇదే ట్రెండ్‌ను ఇతర సంస్థలూ అనుసరించే అవకాశం ఉందని, తమ ఆదాయాలు పెంచుకోవడానికి ఈ మొత్తాలు ఉపయోగపడతాయని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి.




# నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

**ముంబై, ఫిబ్రవరి 20:** దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం కూడా నష్టాల్లోనే ముగిసాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ప్రతి కూల సంకేతాలతో ఉదయం నష్టాల్లో ప్రారంభమైన సూచీలు, రోజంతా అదే ఒరవడి కొనసాగించాయి. దీంతో వరుసగా మూడో రోజూ నష్టాల్లో ముగిసాయి. అమెరికా అనుసరిస్తున్న టారిఫ్ పాలసీలు, దానివల్ల ద్రవ్యోల్బణం పెరుగుతుందన్న భయాలు మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. మన మార్కెట్‌లో హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు, ఐసిఐసిఐ బ్యాంకు, ఐటిసి, మారుతి సుజుకి షేర్లలో అమ్మకాలు సూచీలను కిందకు లాగాయి. చివరికి సెన్సెక్స్ 203.22 పాయింట్లు క్షీణించి 75,735.96 పాయింట్ల వద్ద నిలిచింది. నిఫ్టీ కూడా 19.75 పాయింట్లు నష్టపోయి 22,913.15 పాయింట్ల వద్ద నిలిచింది. డాలరుతో మారకంలో రూపాయి విలువ రూ.86.65గాఉంది. హెచ్‌డిఎఫ్‌సిబ్యాంకు, మారుతి సుజుకి, టెక్ మహీంద్రా, హెచ్‌సి ఎల్ టెక్నాలజీస్, ఐటిసి వంటి షేర్లు నష్టపోయాయి. ఎన్‌టిపిసి, మహీంద్రా అండ్ మహీంద్రా, అదానీ పోర్ట్స్, టాటా స్టీల్, టాటా మోటార్స్ వంటి షేర్లు లాభాల్లో ముగిసాయి. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 76.16 డాలర్ల వద్ద కొనసాగగా, బంగా రం ఔన్సు 2971 డాలర్ల వద్ద ట్రేడ యింది.







Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.